www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 11-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 297 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 6.56 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పుష్యమి రా. 6.34 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 9.04-9.49, రా. 10.19-11.08; అమృతఘడియలు: మ. 12.01-1.39; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.11 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వైమానిక కుంభమేళా..!

రక్షణ రంగం పటిష్ఠతతోనే శాంతి

శాంతి, స్థిరత్వమే భారత్ విధానం

ఏరో ఇండియా-2025 ప్రారంభంలో రాజ్‌నాథ్‌సింగ్ 2



బెంగళూరులో ప్రారంభమైన ఏరో ఇండియా ప్రదర్శనలో సూర్యకిరణ్ విమానాల విన్యాసం

> శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్ఠంగా ఉండరాదు. అలా ఉంటే తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారు. - సుప్రీంకోర్టు



నేర ప్రజాప్రతినిధులపై
శాశ్వత నిషేధం!

మీ అభిప్రాయం చెప్పండి.. కేంద్రానికి, ఈసీకి సుప్రీం ఆదేశం

- రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్య
- క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం
- 42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటు
- శిక్ష పడ్డ ప్రజాప్రతినిధులపై కేవలం ఆరేళ్ల పాటే అనర్హత వేటు వేస్తారా?
- వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలి
- దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా?
- ప్రజాప్రాతినిధ్య చట్టంలో సెక్షన్ 8కి రాజ్యాంగబద్ధత ఉందా: అమికస్ క్యూరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడంపై మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశమని ఆందోళన వెలిబుచ్చింది. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాలని, శిక్ష పడ్డవారిపై శాశ్వత వేటు వేయాలని కోరుతూ.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8, 9 సెక్షన్ల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ 2016లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. ఏదైనా క్రిమినల్ కేసులో దోషిగా తేలినవారు అసలు చట్టసభలకు ఎలా తిరిగొస్తారని విచారణ సందర్భంగా ప్రశ్నించింది. ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడినట్టు తేలినా, ప్రభుత్వానికి అవిధేయుడుగా ఉన్నట్టు తేలినా ఆ వ్యక్తిని సర్వీసులో కొనసాగడానికి అనర్హుడుగా భావిస్తారని.. కానీ, అదే వ్యక్తి మంత్రిగా కొనసాగొచ్చని ఆశ్చర్యం వెలిబుచ్చింది. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే

మిగతా 2వ పేజీలో...

గాలి మేడలు!

పట్టా ఇచ్చారు.. స్థలం ఇవ్వలేదు.. పేదలకు జగనన్న మోసం

- 25 వేల మందికిపైగా గగ్గోలు
- బెజవాడలోనే 2 వేల మంది
- ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పేర్లు
- ఆ స్థలం మాత్రం భూమ్మీద లేదు
- కొత్తగా మరో అవకాశం లేదు
- దిక్కుతోచని పట్టాదారులు

ఆదుకోవాలని కూటమి సర్కారుకు మొర

గొప్పల కోసం జగన్ చేసిన నిర్వాకం ఇల్లు లేని పేదలకు శాపంగా మారింది. గత ప్రభుత్వాలు, పాలకుల కంటే తాను పేదలకు ఎక్కువ మేలు చేశానని డప్పు కొట్టుకోవడానికి ఎడాపెడా పట్టాలిచ్చేశారు. పట్టాలైతే ఇచ్చారు కానీ వేలాది మందికి గజం భూమి కూడా ఇవ్వలేదు. ఆ భూమి ఎక్కడుందో కూడా చూపించలేదు. నిజానికి చూపించడానికి భూమే లేదు. ఇలా జగన్ సర్కారు దాదాపు 25 వేలమందికి పైగా పేదలను మోసం చేసినట్టు అంచనా. పేదలకు గాలిలో మేడలు కట్టించిందన్న మాట. ఆ పట్టాలకు భూమి లేకపోవడంతో ఇళ్లు ఎక్కడ కట్టుకోవాలో తెలియక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



ఆంధ్రజ్యోతి పరిశీలన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పీఐ) పథకం పేరిట జగన్ చేసిన భూ పంపిణీ ప్రహసనంగా మారింది. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమి చొప్పున.. రాష్ట్రమంతా మొత్తం 33 లక్షల మందికి సంతృప్తికరస్థాయి(శాచురేషన్)లో ఇచ్చామని జగన్ గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో

మిగతా 14వ పేజీలో...

ఇదీ జగన్ లెక్క

- మొత్తం 33 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లుగా జగన్ ప్రభుత్వం గొప్పలు చెప్పింది.

ఇదీ వాస్తవం

- ఇప్పటికీ 9 లక్షల మంది పేదలు జగన్ సర్కారు ఇచ్చిన ఇంటి పట్టాలు తీసుకోలేదు.
- రాజధాని అమరావతిపై కోపంతో ఆర్-5 జోన్‌లో 50 వేలమందికి స్థలాలు కేటాయించారు. న్యాయ వివాదంతో ఇదీ అమల్లోకి రాలేదు.
- 4 లక్షల టిడ్కో ఇళ్లు కూడా ఈ జాబితాలో చేర్చారు.
- 3.8 లక్షల మేర ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ, 2.75 లక్షల మేర పేదల సొంతింటి స్థలాలు కూడా జాబితాలో ఉన్నాయి.
- దాదాపు 25 వేలమందికి పైగా పట్టాలు ఇచ్చి ఆ స్థలాలు ఎక్కడున్నాయో చూపలేదు. గజం కూడా ఇవ్వలేదు.



బొజ్జపు లోవలక్ష్మి, చిట్టోడితోట, పిఠాపురం

కాగితాలే మిగిలాయి

ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు బొజ్జపు లోవలక్ష్మి. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం పట్టణం చిట్టోడితోటకు చెందిన ఆమె అద్దె ఇంట్లో ఉంటున్నారు. నాలుగేళ్ల క్రితం సెంటు స్థలం మంజూరైందని చెప్పి ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. కానీ స్థలం అప్పగించలేదు. గత ఏడాది ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రమ్మని చెప్పి రిజిస్ట్రేషన్ చేసిన కాగితం చేతిలో పెట్టారు. ఆ కాగితాలే మిగిలాయి. ఇచ్చిన స్థలం ఎక్కడ ఉందో కూడా ఆమెకు తెలియదు.

రేసు గుర్రాల్లో జోష్ ఏదీ!

- కార్యదర్శుల స్థాయిలో కనిపించని చురుకు
- శాఖలను నడిపించాల్సిన సారథులు వీరే
- అధికారులపై కొరవడిన సమర్థ పర్యవేక్షణ
- శాఖలను ఇష్టారాజ్యంగా భావిస్తున్న కొందరు
- కీలక జీవోల జారీలోనూ గజిబిజి తీరు
- బేరాల కోసం వ్యూహాత్మకంగా ఫైళ్ల పెండింగ్
- ఇప్పటికీ హైదరాబాద్‌లోనే వీకెండ్ మకాం

ఇలాగైతే పాలనలో పరుగు ఎలా?

ఐఏఎస్ అంటేనే కీలకం! కార్యదర్శి, ఆ పైస్థాయి అంటే మరింత కీలకం! శాఖలకు సారథులు వీరే! విధాన నిర్ణయాలు తీసుకునేది మంత్రివర్గం! కానీ.. ఆ నిర్ణయం పూర్వాపరాలు, మంచీ చెడూ, న్యాయపరమైన అంశాలన్నీ పరిశీలించి సమగ్రమైన విధానాన్ని తయారు చేసేది కార్యదర్శులే! జీవోలు ఇచ్చేది వీరే! అలాంటి కార్యదర్శులకు తమ బాధ్యతలపట్ల పూర్తి అవగాహన ఉండాలి. కేబినెట్ తీసుకునే నిర్ణయాల అమలుపై చిత్తశుద్ధి ఉండాలి! కానీ.. జగన్ హయాంలో వ్యవస్థ మొత్తం గాడి తప్పింది. 'పరిగెత్తండి' అని ముఖ్యమంత్రి ఆదేశిస్తున్నా.. కార్యదర్శుల్లో పలువురు కాలు కదపడంలేదు. కేబినెట్ ఆదేశించిన సాయంత్రానికే జీవోలు వచ్చే రోజులు పోయి.. వారాలు గడుస్తున్నా జారీకాని పరిస్థితి వచ్చింది. సరైన అజమాయిషీ లేకపోవడం.. చిత్తశుద్ధి లోపించడం.. గత ఐదేళ్ల జాడ్యం వీడకపోవడం! కారణం ఏదైనా సరే... ఇప్పుడు కార్యదర్శులు, ఆపైస్థాయి యంత్రాంగంలో చురుకుదనం లోపించిందనే అభిప్రాయం నెలకొంది. ఈ నేపథ్యంలో.. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. కార్యదర్శులను కార్యోన్ముఖులను చేసే దిశగా మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇది ఐదేళ్ల కిందటి సంగతి! కేంద్రంలో కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న ఓ అఖిల భారత సర్వీసు అధికారి ఢిల్లీలోని హోటల్‌లో ఒక ప్రైవేటు వ్యక్తిని కలిశారు. భేటీ ముగించుకొని బయటకు రాగానే... ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్! "మీరు కలిసింది సరైన వ్యక్తిని కాదు! మరోసారి ఇలాంటివి రిపీట్ చేయవద్దు" అని ఆ అధికారికి ఫోన్‌లో గట్టి హెచ్చరిక ఇచ్చారు. అంటే, ఆ అధికారి ఎవరిని కలుస్తున్నారు? కలిసిన వ్యక్తి ఎలాంటి వాడో కూడా కనిపెట్టి

మిగతా 13వ పేజీలో...



బ్యాంకర్ల సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మణి మేఖలై

విజన్ 2047లో భాగస్వాములవ్వండి

- అగ్రి, అనుబంధ రంగాల్లో వృద్ధికి అవకాశం ఎక్కువ.. 15% వృద్ధి రేటు సాధనే లక్ష్యం
- బ్యాంకర్ల సహకారం ఎంతో అవసరం.. రైతులకు నిమిషాల్లో రుణమిచ్చే పరిస్థితి ఉండాలి
- ఉద్యాన, వాణిజ్య, ప్రకృతి సాగుకు మద్దతుగా నిలవాలి.. డెయిరీని ప్రోత్సహించాలి
- 'సూర్యఘర్'లో ఏటా 20లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ 13

రైతు ఆత్మహత్యల నివారణకు మేధో మథనం.. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల భేటీలో సీఎం



13

60 రోజులు రాకపోతే అనర్హత వేటు!

- బడ్జెట్ సమావేశాలకు జగన్ రావాలి
- ఎమ్మెల్యేకిచ్చే సమయమే ఇస్తాం
- గతంలోని కౌరవ సభలా అసెంబ్లీ నిర్వహించం
- గౌరవ సభలా హుందాగా నిర్వహిస్తాం: స్పీకర్ అయ్యన్న

24 నుంచి బడ్జెట్ సమావేశాలు

IIFL FINANCE

కల మీది. గోల్డ్ లోన్ మాది.

% తక్కువ వడ్డీ రేట్లు*

*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి

63 9111 9111

జగన్, భారతి ఆరోపణలు
ఖండిస్తున్నా

రాజకీయ ఉద్దేశాలు, కారణాలతోనే జగన్ కేసు వేశారు

- ఎన్‌సీఎల్‌టీలో తల్లి విజయలక్ష్మి కౌంటర్.. చెల్లెలు షర్మిలారెడ్డి కూడా..
- ఎంవోయూ ప్రకారమే సరస్వతి షేర్ల బదలాయింపు
- కుటుంబ ఒప్పందంలో ఎన్‌సీఎల్‌టీ జోక్యం తగదు
- పిల్లల మధ్య వివాదంతో కోర్టు గదిలో నిలబడాల్సి రావడం కలచివేస్తోంది
- బాధతోనే కౌంటర్ వేస్తున్నా: విజయలక్ష్మి
- అంతా చట్టప్రకారమే జరిగింది: షర్మిల
- తదుపరి విచారణ మార్చి 6కి వాయిదా



అమరావతి/హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'నా కుమారుడు జగన్, కోడలు భారతి చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నాను. నా పిల్లల మధ్య వివాదం కారణంగా నేను కోర్టు గదిలో నిలబడాల్సి రావడం తీవ్రంగా కలచివేస్తోంది. బాధాతప్త హృదయంతో కౌంటర్ దాఖలు చేస్తున్నాను. జగన్, భారతి పేర్కొంటున్న విషయాలు నిరాధారం, సదరు ఆరోపణలు న్యాయసమీక్షకు నిలువవు' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కంపెనీ వాటాలను చట్టబద్ధంగా బహుమతిగా ఇస్తూ చేసుకున్న కుటుంబ ఒప్పందంలో.. జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) జోక్యం చేసుకోజాలదని ఆమె, జగన్ చెల్లెలు షర్మిలారెడ్డి తెలిపారు. ఫ్యామిలీ సెటిల్‌మెంట్‌లో జోక్యం చేసుకునే అధికారం దానికి లేదన్నారు. కుటుంబ వివాద పరిష్కారాలు ట్రైబ్యునల్ పరిధిలోకి రావని పేర్కొన్నారు. తనకు తెలియకుండా సరస్వతి పవర్ షేర్లను తన తల్లి, చెల్లి బదిలీ చేసుకున్నారని.. సదరు బదిలీని రద్దు చేసి తన పేరిట, తన భార్య భారతి, తమ కంపెనీ క్లాసిక్ రియాల్టీ పేరిట 51.01 శాతం వాటాలు యథావిధిగా కొనసాగేలా ఆదేశాలివ్వాలని పేర్కొంటూ

మిగతా 2వ పేజీలో...



మద్యం ధరలు పెంపు

ఒక్కో బాటిల్‌పై రూ.10

- 'క్వార్టర్ 99', బీరు ధరల్లో మార్పు లేదు
- లైసెన్సీలకు 14 శాతం మార్జిన్
- దాని కోసమే వినియోగదారులపై భారం
- ఎక్సైజ్ అధికారుల పొరపాట్లతో మార్పులు
- ఏఆర్ఈటీని సవరిస్తూ ఉత్తర్వులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగాయి. క్వార్టర్ రూ.99 బ్రాండ్లు మినహా అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లకూ సీసాపై రూ.10 పెరిగింది. ఈమేరకు అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్ఈటీ)ను సవరిస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బీరు ధరల్లో ఎలాంటి మార్పూ లేదు. మార్జిన్ తక్కువ వస్తోందని లైసెన్సీలు గగ్గోలు పెట్టడంతో

మిగతా 12వ పేజీలో...

భోలేబాబా, వైష్ణవి, ఏఆర్ నడుమ 'నెయ్యి'ం 12



- మూడింటికీ టెండర్లలో పాల్గొనే అర్హత లేదు.. తప్పుడు డాక్యుమెంట్లతో పాల్గొన్న వైనం
- 2022లోనే భోలేబాబా నెయ్యి తిరస్కరించిన టీటీడీ.. దీంతో వైష్ణవి ద్వారా ఏఆర్ డెయిరీకి నెయ్యి
- అంతిమంగా ఏఆర్ నుంచి టీటీడీకి తరలింపు.. సెప్టెంబరులోనే తప్పుకొన్న పామిల్, విపిన్ జైన్లు
- తమ తరపున వైష్ణవి డైరెక్టర్లుగా కారు డ్రైవర్లు.. సిట్ రిమాండ్ రిపోర్టులో విస్తుగొలిపే విషయాలు

కాకాణి అల్లుడి భూమేత?

- కారుచౌకగా 50 ఎకరాలు కొట్టేశారు.. నాడు కోడ్‌కు ఒక్కరోజు ముందు జీవో
- అదేరోజు గోపాలకృష్ణారెడ్డికి భూమి స్వాధీనం చేసిన ఏపీఐఐసీ 11
- మార్కెట్ విలువ 100 కోట్లకు పైనే.. పేద రైతులకు చెల్లించింది 9 కోట్లే
- టీడీపీ నేతల ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ.. అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక

ఆలయాల ఎఫ్‌డీల జోలికెళ్తే కఠిన చర్యలు

- ఇష్టారాజ్యంగా అధికారులు బ్రేక్ చేయడానికి వీల్లేదు
- పకడ్బందీగా నిబంధనలు తీసుకొచ్చిన ప్రభుత్వం 14

తూర్పున బర్డ్‌ఫ్లూ పంజా!

- కానూరు అగ్రహారంలో 62 వేల కోళ్లు మృతి
- బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ.. కిలోమీటరు మేర రెడ్ జోన్
- 10 కిలోమీటర్ల పరిధిలో సర్వేలెన్స్ జోన్
- పెంపుడు పక్షులను చంపేయాలన్న అధికారులు

రాబోయే నాలుగేళ్లలో 63లక్షల ఎయిడ్స్ మరణాలు!

- అనాథలవ్వనున్న 34 లక్షల చిన్నారులు
- ఐరాస ఎయిడ్స్ విభాగం ఆందోళన
- ట్రంప్ సాయం నిలిపివేయడమే కారణం!!

ఎయిడ్స్ మహమ్మారి 2029కల్లా విశ్వరూపం చూపే ప్రమాదముందని ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఎయిడ్స్ విభాగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా ఇస్తున్న అంతర్జాతీయ సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణమని ఐరాస ఆరోపిస్తోంది. మూడు దశాబ్దాలకు పైగా ఐరాస 160కి పైగా దేశాల్లో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను చేపడుతోంది. ఐరాసకు అమెరికా ఏటా పేదరిక నిర్మూలన, వ్యాధుల నిర్మూలన, మానవతాసాయానికి రూ.3,83,160 కోట్లను విరాళంగా అందజేస్తోంది. ఈ విరాళాలను యూఎస్ ఎయిడ్ ఫండ్ నుంచి పంపిణీ చేస్తారు. ఈ ఎయిడ్‌లో పనిచేసే 13 వేల మంది సిబ్బందిని తొలగించడమే కాకుండా.. గ్రాంట్లపై 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తూ ట్రంప్ ఉత్తర్వులిచ్చారు. దాంతో.. యూఎస్ఎయిడ్స్‌కు అందే విరాళాలు కూడా నిలిచిపోయాయి. ఎయిడ్స్ కేసులు ఎక్కువగా ఉన్న ఇథియోపియా, ఉగాండా, మొజాంబిక్ వంటి దేశాలకు అమెరికా నుంచి ఏటా రూ.3,498 కోట్ల సాయం అందుతుందని, ఈ సాయం ఆగిపోతే.. ఎయిడ్స్ కేసులు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహించలేమని ఐరాస ఎయిడ్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీ బయాన్యిమా ఆందోళన వ్యక్తం చేశారు. "2029 కల్లా 63 లక్షల ఎయిడ్స్ మరణాలు సంభవిస్తాయి. కొత్తగా 87 లక్షల మంది ఎయిడ్స్ బారిన పడే ప్రమాదముందని అంచనా. అంతేకాదు.. ఎయిడ్స్ బాధితుల పిల్లలు సుమారు 34 లక్షల మంది అనాథలుగా మారుతారు" అని ఆమె ఆమె వాపోయారు. కాగా, యూఎస్ఎయిడ్‌కు నిధులను నిలిపివేయడానికి కారణాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్, టెస్లా అధినేత ఈలాన్ మస్క్ ఇప్పటికే పలు వేదికలపై వివరించారు. యూఎస్ఎయిడ్‌లో పనిచేస్తున్న వారు ఉగ్రవాదులు/తీవ్రవాదులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అందుకే.. ఆ సంస్థలో పనిచేస్తున్న వారిని తొలగించామన్నారు. - సెంట్రల్ డెస్క్

గాజాకు తిరిగి వచ్చే హక్కు పాలస్తీనియన్లకు ఉండదు



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: యుద్ధభూమిగా మారిన గాజాను అమెరికా స్వాధీనంలోకి తెచ్చుకుంటుందని గతంలో చెప్పిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో ఆసక్తికర ప్రకటన చేశారు. గాజా అమెరికా ఆధీనంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాంతంలోకి తిరిగి వచ్చే హక్కును పాలస్తీనావాసులకు ఇవ్వబోమని చెప్పారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో తాము నివాసముండే స్థలం గాజాయేనని పాలస్తీనావాసులు భావిస్తుండగా, వారిలో ఆ భావన తొలగేలా కృషిచేయాలని ట్రంప్ తన మిత్రదేశాలైన జోర్డాన్, ఈజిప్ట్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "పాలస్తీనియన్లకు ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి కొంచం దూరంలో సురక్షితమైన ఆవాసాలను నిర్మిస్తాం. ఈలోగా ఈ ప్రాంతాన్ని నేను తీసుకుంటాను. భవిష్యత్తులో దీన్నొక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా చూడండి. ఇది చాలా అందమైన ప్రదేశం. పెద్దగా సొమ్ము కూడా అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు.

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదులో తమిళనాడు, హిమాచల్, కేరళ టాప్

- కాలేజీ సాంద్రతతో రెండో స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: 2021-22లో ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు విషయంలో తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ ఉత్తమ ప్రదర్శన కనబర్చాయని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)లో ఈ రాష్ట్రాలను 'అచీవర్స్' క్యాటగిరీలో పేర్కొంది. 'రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల ద్వారా నాణ్యమైన ఉన్నత విద్య విస్తరణ' పేరుతో నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరి సోమవారం ఈ నివేదిక విడుదల చేశారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. తమిళనాడు, గోవా, కర్ణాటకల్లోని యూనివర్సిటీల్లో విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి తక్కువగా ఉండగా.. ఝార్ఖండ్, బీహార్ వర్సిటీల్లో అధికంగా ఉంది. మరోవైపు జీఎస్‌డీపీలో బిహార్ ఉన్నత విద్యపై 1.56 శాతం వ్యయం చేస్తుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో మణిపూర్, మేఘాలయ ఉన్నాయి. కాలేజీల సాంద్రత (ప్రతి లక్ష మంది అర్హులైన 18-23 ఏళ్ల మధ్య వయసు వారికి ఉన్న కళాశాలల సంఖ్య) విషయంలో 66 కర్ణాటకలో టాప్‌లో ఉంది. ఇది జాతీయ సగటు (2022లో 30) కంటే రెట్టింపు పైనే కావడం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ ఉన్నాయి. ఇక తక్కువ కాలేజీల సాంద్రత జాబితాలో మణిపూర్, బిహార్, ఝార్ఖండ్ ఉన్నాయి.

ఐదుగురు మావోయిస్టు మృత దేహాలు గుర్తింపు

చింతూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్ ఘటనలో 31మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. కాగా వారిలో ఐదుగుర్ని గుర్తించారు. బీజాపూర్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బస్తర్ ఐజీ సుందర్ రాజ్ పలు విషయాలు వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందగా వారిలో 11మంది మహిళా మావోయిస్టులు ఉన్నారన్నారు. మృత దేహాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా వీరిలో ఇప్పటి వరకు ఐదుగుర్ని గుర్తించామన్నారు. వారిలో రూ.8లక్షల రివార్డు ఉన్న పశ్చిమ బస్తర్ డివిజన్ డీవీసీఎం హుంగాఖర్మతో పాటు రూ.5లక్షల రివార్డు ఉన్న పీపీసీఎం ప్లటూన్ కమాండర్ మంగు హేమ్లా, నేషనల్ పార్క్ ఏరియా ఏసీఎం సుభాష్ ఓయం, గంగులూర్ ఏసీఎం సన్నులతో పాటు రూ.2లక్షల రివార్డు ఉన్న నేషనల్ పార్క్ ఏరియా సభ్యుడు రమేష్ ఉన్నారన్నారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉందన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిల్, 303 రైఫిల్, రాకెట్ లాంచర్, బీజీఎల్ లాంచర్‌లతో పాటు పెద్ద ఎత్తున పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో 40నుంచి 45మంది వరకు మావోయిస్టులు ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. వారిలో 31మంది మృతిచెందగా మరి కొందరు మృతిచెంది ఉండవచ్చు లేదా తీవ్రంగా గాయపడి ఉంటారని ఐజీ తెలిపారు.

ఏపీలో గ్రామీణ అక్షరాస్యత 67.5 శాతం

- లోక్‌సభలో కేంద్రప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణా అక్షరాస్యత 2023-24 గానూ 67.5 శాతంగా ఉందని , ఇదే ఏడాది గానూ తెలంగాణలో 69.9 శాతమని కేంద్రప్రభుత్వం తెలిపింది. సోమవారం, లోక్‌సభలో ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా సహాయ మంత్రి జయంత్ చౌదరి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా గ్రామీణ అక్షరాస్యత 77.5 శాతంగా ఉందని తెలిపారు.

సీఐడీ విచారణకు రామ్‌గోపాల్ వర్మ డుమ్మా

- 8 వారాల గడువు కోరిన వర్మ తరపు న్యాయవాది

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీ విచారణకు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ డుమ్మా కొట్టారు. సోమవారం ఆయన గుంటూరు సీఐడీ అధికారుల ముందు విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే 8 వారాల గడువు కావాలని ఆయన తరుపు న్యాయవాది సీఐడీ అధికారులను కోరారు. రాంగోపాల్ వర్మ 2019లో కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆ చిత్రం పేరుపై తెలంగాణ హైకోర్టులో కొందరు పిల్ వేయడంతో 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అనే పేరుతో విడుదల చేశారు. అయితే యూట్యూబ్‌లో మాత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరిటే విడుదల చేశారంటూ సీఐడీ పోలీసులకు మంగళగిరి సమీపంలోని ఆత్మకూరుకు చెందిన బండారు వంశీకృష్ణ సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు వర్మపై మంగళగిరిలోని సీఐడీ పోలీస్ స్టేషన్లో గతేడాది నవంబరు 29న కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన నోటీసులను ఆర్జీవీకి ఇటీవల ఒంగోలులో సీఐడీ అధికారులు అందజేశారు. ఈ కేసులో విచారణకు నేడు ఆయన హాజరుకావాల్సి ఉండగా గడువు కోరారు. ఈ నేపథ్యంలో మరోసారి వర్మకు నోటీసులు అందజేయాలని సీఐడీ అధికారులు యోచిస్తున్నారు.

నేర ప్రజాప్రతినిధులపై శాశ్వత నిషేధం!



(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరింది. కేంద్రం తరఫున అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది సానియా మాథుర్‌ను ఆదేశించింది. ఈ విషయంలో తన అభిప్రాయాన్ని కోర్టుకు వచ్చి వెల్లడించాలని సుప్రీం అటార్నీ జనరల్ ఎస్.వెంకటరమణిని కోరుతూ.. తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది. అఫిడవిట్ దాఖలుకు తమకు మరింత సమయం కావాలని ఎన్నికల కమిషన్(ఈసీ) తరఫు న్యాయవాది సిద్ధాంత కుమార్ కోరగా.. జస్టిస్ దీపాంకర్ దత్తా తీవ్రంగా స్పందించారు. "రాజకీయాలు నేరమయం కావడం ఎంతో తీవ్రమైన అంశం. ఇప్పటికే ఈసీ దీనిపై దృష్టి కేంద్రీకరించి మెరుగైన పరిష్కారం కనుక్కుని ఉంటే బాగుండేది" అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో మూడువారాల్లో ఈ అంశంపై తమ వైఖరి తెలిపేందుకు ఈసీ సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే.. ప్రజా ప్రతినిధులపై కేసులను వేగవంతంగా పరిష్కరించే విషయాన్ని హైకోర్టులే పర్యవేక్షించాలని 2023లో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం నిర్ణయించినందు వల్ల.. ఆ అంశాన్ని తమ ద్విసభ్య బెంచ్ రీ-ఓపెన్ చేయడం సరైంది కాదని, దీన్ని విస్తృత ధర్మాసనానికి అప్పజెప్పాల్సిందిగా సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నాకు నివేదించాలని న్యాయమూర్తులు నిర్ణయించారు. అయితే, హైకోర్టులు నివేదికలు తెప్పించుకోవడం, వాయిదాలు వేయడం తప్ప ఏమీ చేయడం లేదని, దీని వల్ల ప్రజా ప్రతినిధుల పై కేసుల్లో నిరంతర అలస్యం జరుగుతోందని వారు అభిప్రాయపడ్డారు.


ఆర్టికల్ 14 ఉల్లంఘనే!

ప్రజాప్రతినిధులపై కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. హైకోర్టులు ఆయా కేసులను పర్యవేక్షిస్తున్నప్పటికీ .. దేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన దాదాపు ఐదు వేల క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా కోర్టుకు తెలిపారు. "నేరాలకు శిక్షపడ్డ ప్రజా ప్రతినిధులపై ఆరేళ్లపాటు మాత్రమే అనర్హత వేటు వేయాలన్న ప్రజాప్రాతినిధ్యచట్టంలోని సెక్షన్ 8కి రాజ్యాంగబద్ధత ఉందా? శిక్ష పడ్డ ఒక వ్యక్తి రాజకీయ పార్టీ పెట్టి, దానికి పదాధికారిగా కొనసాగడం సరైనదేనా?" అనే ప్రశ్నలను ఈ పిల్ లేవనెత్తిందని ఆయన పేర్కొన్నారు. పది రాష్ట్రాల్లో 12 ప్రత్యేక కోర్టులను నెలకొల్పాలని సుప్రీంకోర్టు 2017లో ఆదేశించిందని, నోడల్ ప్రాసిక్యూషన్ అధికారులను నియమించాలని, కేసుల విచారణ వాయిదా వేయకూడదని, ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెండింగ్ క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించేలా పర్యవేక్షిస్తుండాలని 2023 వరకూ అనేక ఆదేశాలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. "అయినప్పటికీ 42% సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులు కొనసాగడం సిగ్గు చేటు. పలు కేసులు 30 ఏళ్లగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. "చట్టాలు చేసేవారు ఆయా చట్టాల కింద పదవులు నిర్వహిస్తున్న వ్యక్తుల కంటే చాలా పవిత్రంగా, మచ్చలేకుండా ఉండాలి. ఒకసారి వారు నైతిక ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే, వారు ఆ పదవిని నిర్వహించడానికి శాశ్వతంగా అనర్హులు కావాలి. అనర్హత కాలాన్ని పరిమితం చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో పేర్కొన్న సమానత్వ నిబంధనను ఉల్లంఘించడమే" అని హన్సారియా వాదించారు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా.. "కేసులను పరిష్కరించడంలో జరుగుతున్న ఆలస్యానికి నిర్దిష్ట కారణాలేమిటి?" అని ప్రశ్నించారు. ప్రత్యేక కోర్టులు ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను కాకుండా ఇతర కేసులు విచారిస్తున్నాయని, అవి కూడా తరచూ వాయిదాలు పడుతున్నాయని, నిందితులు హాజరు కావడం లేదని, కోర్టులు సాక్షులకు సమన్లు జారీ చేసినప్పటికీ సరైన సమయంలో, అవసరమైన సమన్లను జారీ చేయడం లేదని ధర్మాసనానికి అమికస్ క్యూరీ తెలిపారు. ఆయన వాదనను జస్టిస్ మన్మోహన్ అంగీకరించలేదు. ప్రత్యేక కోర్టులు ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రాధాన్యం ఇవ్వడంలేదన్న విషయం సరైంది కాదని, దేశమంతా అలా జరుగుతున్నట్టు అమికస్ క్యూరీ చెబుతున్నారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కావాలంటే రౌజ్ ఎవెన్యూ కోర్టుల పనితీరును పరిశీలించాలని ఆయన చెప్పారు. ఆయా కోర్టుల్లో మధ్యాహ్నానికే విచారణలు ముగుస్తున్నాయని గుర్తుచేశారు. ప్రతి రాష్ట్రంలోనూ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయని, ఒక్కో రాష్ట్రం పరిస్థితి గురించి వివరించాలని ఆయన అమికస్ క్యూరీని కోరారు.

అన్ని పార్టీలూ!

అత్యాచారం, హత్య వంటి తీవ్ర నేరాల్లో దోషులుగా తేలిన 46-48 శాతం మంది 2-3 ఏళ్ల శిక్ష అనంతరం ఎంపీ/ఎమ్మెల్యేగా ఎన్నికై తిరిగి చట్టసభలకు వస్తున్నారని.. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8, 9 సెక్షన్లకు సవాల్‌గా పరిణమించిందని పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ పేర్కొన్నారు. అన్ని పార్టీలూ నేరచరితులను పార్లమెంటుకు పంపుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. అసలు క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు చట్టసభలకు ఎలా తిరిగి వస్తున్నారని.. నేరాలకు శిక్షపడ్డ వారిని చట్టసభల్లో ప్రవేశించేందుకు ఎలా అనుమతిస్తున్నారని.. వారే చట్టాలను రూపొందించడం ఎలా జరుగుతోందని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం హత్యానేరానికి శిక్ష పడ్డ వ్యక్తి కూడా ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడు కావచ్చని, ఆ పార్టీకి ఈసీ గుర్తు కేటాయిస్తుందని అమికస్ క్యూరీ హన్సారియా తెలిపారు. శిక్ష పడ్డవారు పార్టీ పదవుల్లో ఉండరాదంటూ ఈసీ మార్గదర్శకాలను జారీ చేయవచ్చన్నారు. దీనిపై జస్టిస్ మన్మోహన్ స్పందిస్తూ.. శిక్షపడిన వారు పార్టీ పదవుల్లో ఉండొద్దని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తోనో పార్టీని నిర్వహిస్తారని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



మీరు ఆమోదించకుంటే చెల్లని బిల్లులైపోతాయా?

తమిళనాడు గవర్నర్‌ను నిలదీసిన సుప్రీం

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): "శాసనసభ రూపొందించిన బిల్లుల్ని మీరు ఆమోదించకపోతే అవి చెల్లనివైపోతాయని ఎలా చెబుతారు?.. మరి మీరు చెప్పినట్టు అవి చెల్లని బిల్లులే అయితే వాటిని రాష్ట్రపతికి ఎలా పంపిస్తున్నారు? మీ వాదనల్ని అంగీకరించలేకపోతున్నాం" అంటూ సుప్రీంకోర్టు తమిళనాడు గవర్నర్‌ను నిలదీసింది. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న పది కీలకమైన బిల్లుల్ని ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వీసీ పోస్టుల భర్తీ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోకుండా నియంత్రించాలని అభ్యర్థిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 4వ తేదీ నుంచి రోజువారీ విచారణ జరుపుతోంది. సోమవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. తాను ఆమోదించని పక్షంలో అసెంబ్లీ రూపొందించిన బిల్లులు చెల్లనివిగా మారిపోతాయన్న గవర్నర్ వాదనను తప్పుబట్టింది. శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు ఉందా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనాల్సిన అవసరముందని వ్యాఖ్యానించింది. ఏ బిల్లునైనా అంగీకరించకూడదని అనుకుంటే వెంటనే గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చని రాజ్యాంగ ధర్మాసనం చెబుతోందని స్పష్టం చేసింది. బిల్లుల ఆమోదం వ్యవహారంలోనూ, వీసీల నియామక వ్యవహారంలోనూ గవర్నర్ పారదర్శకంగా వ్యవహరించలేదనే అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగం ప్రకారం శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లుకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం మినహా మరో మార్గం లేదన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనకు గవర్నర్ తరఫు నుంచి సమాధానం లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది.

మా ఆదేశాలు ఎందుకు పాటించలేదు?

- తప్పుడు ఔషధ ప్రకటనల అంశంలో ఏపీ, ఢిల్లీ ప్రభుత్వాలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తప్పుదోవ పట్టించే ఔషధ ప్రకటనల విషయంలో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించినప్పటికీ, న్యాయస్థానం ఆదేశాలను ఎందుకు పాటించడంలేదని అంధ్రప్రదేశ్, ఢిల్లీ, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెలాఖరులోపు అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణ జరిగే మార్చి 7న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరుకావాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొన్ని ఔషధ ప్రకటనలు ఉంటున్నాయంటూ పతంజలి సంస్థ, యోగా గురు రామ్‌దేవ్‌బాబాపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ 2022 ఆగస్టు 10న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో, ఈ తరహా ప్రకటనలపై తీసుకున్న చర్యల గురించి అఫిడవిట్లు దాఖలు చేయాలని గత ఏడాది మే 7న అన్ని రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలి: సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: వీలైనంత త్వరగా దేశంలో జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. జనగణన జరగకపోవడం వల్ల దాదాపు 14 కోట్ల మంది ప్రజలు ఆహార భద్రతా చట్టం కింద ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆమె తెలిపారు. సోమవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆమె ఈ మేరకు మాట్లాడారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో జనగణన నాలుగేళ్లకు పైగా ఆలస్యమవడం ఇదే తొలిసారి అని ఆమె చెప్పారు.

కాంగ్రెస్ తదుపరి లక్ష్యం మమత!!

- బెంగాల్లో రాహుల్ పాదయాత్ర



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పరస్పర అవగాహన, సర్దుబాట్లతో 'ఇండీ' కూటమిని బలోపేతం చేయాల్సిన కాంగ్రెస్.. తొలుత తాను బలం పుంజుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఒంటరిపోరే మార్గమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ కృతనిశ్చయంతో ఉన్నారు. మిత్రపక్షాలతో ముఖాముఖి పోరుకు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఢిల్లీలో ఓటింగ్ శాతం పెంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమికి కారణమైన కాంగ్రెస్.. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీని టార్గెట్ చేసింది. ఆ రాష్ట్రంలో బలపడేందుకు ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఏకంగా పాదయాత్రకు సంకల్పించారు. ఇందుకోసం రాష్ట్ర శాఖ సర్వసన్నాహాలూ చేయాలని అధిష్ఠానం ఆదేశాలు కూడా జారీచేసింది. సోనియాగాంధీ పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు యూపీఏ సంకీర్ణ ప్రయోగానికి చొరవ చూపడమే గాక పదేళ్ల కేంద్రంలో విజయవంతంగా నడిపారు. 2004లో క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టి ఏఐసీసీ యువజన వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన రాహుల్ మాత్రం ఆది నుంచీ భిన్న పంథాలో వెళ్తున్నారు. పార్టీ ఒంటరిగానే పోరాడాలని.. అప్పుడే బలపడుతుందన్నది ఆయన వైఖరి. దీనివల్ల ఎన్నికల్లో ఓడిపోయినా.. భవిష్యత్‌లో లాభం కలుగుతుందని తన సన్నిహిత నేతలతో ఆయన తరచూ చెప్పేవారు. అయితే వరుస ఓటములు, ప్రధాని మోదీని ఓడించాలన్న ఆకాంక్ష కారణంగా సంకీర్ణ రాజకీయాలపై రాజీపడాల్సి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత.. ఇండీ కూటమి పార్టీలు బలపడి.. కాంగ్రెస్ మాత్రం బలహీనపడుతోందని రాహుల్ గ్రహించారు. అందుకే ఎంతో లోతుగా ఆలోచించి.. మొదట పార్టీని బలోపేతం చేసుకోవాలనుకుంటున్నారు. బెంగాల్లో వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈలోపు అక్కడ కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేయడానికి నేరుగా రాహులే నడుం బిగించారు.

వైమానిక కుంభమేళా!





రక్షణ రంగం పటిష్ఠతతోనే శాంతి సాధ్యం

- ఏరో ఇండియా పారంభంలో రాజ్‌నాథ్
- మహా కుంభమేళాతో పోల్చిన రక్షణ మంత్రి

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగం పటిష్ఠంగా ఉన్నప్పుడే శాంతి సాధ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని యలహంక ఎయిర్ బేస్‌లో ఏరో ఇండియా-2025 వైమానిక ప్రదర్శనను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అస్థిరతలను పరిశీలిస్తే ఒక పటిష్ఠమైన దేశంగా భారత్ ఎప్పుడూ శాంతి, స్థిరత్వాన్ని ప్రతిపాదిస్తుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతోందని.. బెంగళూరులో సాంకేతిక, యుద్ధ విమానాల మహాకుంభమేళా ప్రారంభమైందని రక్షణ మంత్రి అభిప్రాయపడ్డారు. కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు పరిశోధనలు అవసరమని అన్నారు. ఎయిర్ షోలో 90కుపైగా దేశాలు భాగస్వామ్యం కావడం, 30 దేశాల నుంచి రక్షణ మంత్రులు, ప్రతినిధులు పాల్గొంటున్నందున.. అభివృద్ధి చెందుతున్న భారత్ రక్షణ, పరిశోధన రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రపంచానికి చాటే వేదిక ఇదని కొనియాడారు. ఇది కేవలం వైమానిక ప్రదర్శన కాదని.. సాంకేతిక, ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలను నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా చేసే వేదికని చెప్పారు. కార్యక్రమంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు వైమానిక రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన వైమానిక ప్రదర్శనలో తేజస్, సూర్యకిరణ్ యుద్ధ విమానాల చక్కర్లు కొట్టాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వేలాదిమంది తరలివచ్చారు.

సైన్యానికి అండగా రోబో దండు!

ఎయిర్ షోలో ఆర్మీ పెట్ ప్రాజెక్ట్‌లో భాగమైన నాలుగు కాళ్ల రోబోటిక్ డాగ్ (ట్రాకర్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ డాగ్/ట్రాకర్‌గా పిలిచే ఇవి చూడటానికి కుక్కలని పోలి ఉంటాయి. వాహనాలు, హెలికాప్టర్లు చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లి ఇవి సైనికులకు అవసరమైన మందులు, ఆయుధాలు అందిస్తాయి. హైదరాబాద్‌కు చెందిన జెన్ టెక్నాలజీస్ కూడా మిషన్ ప్లానింగ్, నావిగేషన్ వంటి వాటికోసం నాలుగు కాళ్ల రోబో 'ప్రహస్త'ను అభివృద్ధి చేస్తోంది. అలాగే కాకినాడకు చెందిన స్టార్టప్ భైరవ్ రోబోటిక్స్ కూడా రోబోటిక్ డాగ్ 'శ్రవణ'ను భారత్‌లోనే తొలి సాయుధ క్యూ-యూజీవీని రూపొందిస్తోంది.

ఆకాశంలో అద్భుతం..

ఎయిర్ షో సందర్భంగా భారత వైమానిక దళానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఆకాశంలో గర్జించాయి. ఎయిర్ క్రాఫ్ట్‌లు చేసిన అద్భుత విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తొలివిడత కార్యక్రమంలో భాగంగా తేజస్ బృందానికి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ నేతృత్వం వహించారు. హాల్ అభివృద్ధి చేసిన తేజస్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. అనంతరం మహిళా పైలట్లు రాఫెల్ యుద్ధ విమానాలను నడిపి మహిళా శక్తి చాటారు. ఐఏఎఫ్‌కు చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్ (ఎస్‌కేఏటీ) వివిధ రూపాలు ప్రదర్శించడం చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. తొమ్మిది హాక్ ఎంకే 132 విమానాలను దగ్గరగా తీసుకొచ్చి చేసిన విన్యాసం, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన తీరు అబ్బురపరిచింది.

అమెరికా, రష్యా.. ఫైటర్ జెట్లు తొలిసారి

అమెరికాకు చెందిన యుద్ధవిమానం లఖీడ్ మార్టిన్ ఎఫ్35 లైటినింగ్ 2, రష్యాకు చెందిన సుఖోయ్-ఎస్‌యూ-57 కూడా ఎయిర్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రపంచంలోనే అత్యంత అధునాత ఐదవ తరం యుద్ధ విమానాలు అమెరికన్ ఎఫ్-35, రష్యన్ ఎస్‌యూ-57 భారత ఎయిర్‌షోలో పాల్గొనడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. ప్రపంచ రక్షణ సహకారంలో ఇదొక మైలు రాయి అని పేర్కొన్నారు.

జగన్, భారతి ఆరోపణలు ఖండిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

జగన్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేసిన విషయం విదితమే. ఆ షేర్లను తన తల్లికి గిఫ్టుగా ఇచ్చానని.. వాటిని తాను ఎప్పుడైనా వెనక్కి తీసుకోవచ్చని అందులో పేర్కొన్నారు. సరస్వతి పవర్ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో తాను గిఫ్ట్‌గా ఇచ్చిన షేర్లను షర్మిలకు బదలాయించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ షేర్ల బదలాయింపును అడ్డుకోవాలని కోరారు. అయితే రాజకీయ ఉద్దేశాలు, కారణాలతోనే జగన్ ఎన్‌సీఎల్‌టీలో తప్పుడు కేసు వేశారని విజయలక్ష్మి, షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు ట్రిబ్యునల్‌లో వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశారు. జగన్ పిటిషన్‌కు ఇద్దరూ 38 పాయింట్లతో ఘాటుగా సమాధానాలిచ్చారు. కుటుంబ వివాదాన్ని కంపెనీ వివాదంగా మార్చారని తెలిపారు. సొంత బిడ్డలపైనే ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేయాల్సి రావడం తన గుండెను పిండేసిందని విజయలక్ష్మి పేర్కొన్నారు. 2019 ఆగస్టు 31వ తేదీన కుటుంబం మధ్య జరిగిన 'మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్(ఎంవోయూ)' మేరకే సరస్వతి పవర్ షేర్ల బదలాయింపు జరిగిందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఎంవోయూలో ఎన్‌సీఎల్‌టీ జోక్యం చేసుకోజాలదన్నారు. షేర్ల బదలాయింపు అంతా చట్టప్రకారమే జరిగిందని వెల్లడించారు. ఎన్‌సీఎల్‌టీని తప్పుదారి పట్టించేలా జగన్ రాజకీయ ప్రేరిత వ్యాజ్యం వేశారని తల్లీ కుమార్తెలు పేర్కొన్నారు. వాటాల బదలాయింపుపై ఆయన చేస్తున్న 'క్లెయిమ్' అంతా తప్పేనని తెలిపారు. ట్రిబ్యునల్‌ను తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారన్నారు. చట్టబద్ధంగా జరిగిన ఎంఓయూపై వాస్తవాలు వివరిస్తూ తాము పొందుపరచిన సాక్ష్యాధారాలను పరిశీలించి.. ఆదేశాలు జారీ చేయాలని ఎన్‌సీఎల్‌టీని వారు అభ్యర్థించారు.

ట్రైబ్యునల్ విచారణ మార్చి 6కి వాయిదా

కాగా.. జగన్ పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ సోమవారం విచారణ జరిపింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది, వైసీపీ రాజ్యసభ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి వర్చువల్‌గా హాజరై వాదనలు వినిపించారు. కౌంటర్లు దాఖలు చేయాలని విజయలక్ష్మి, షర్మిల తదితర ప్రతివాదులకు గత ఏడాది సెప్టెంబరులోనే నోటీసులు జారీచేసినప్పటికీ.. ఇద్దరు మాత్రమే దాఖలు చేశారని పేర్కొన్నారు. అందరూ కౌంటర్లు సమర్పిస్తే తాము రిజాయిండర్ దాఖలు చేస్తామని తెలిపారు. విజయలక్ష్మి, షర్మిల తదితరుల తరఫున న్యాయవాది విశ్వరాజ్ వాదనలు వినిపించారు. ఆన్‌లైన్‌లో తాము కౌంటర్లు దాఖలు చేశామని.. ఒకట్రెండు రోజుల్లో భౌతికంగా సైతం ధర్మాసనానికి సమర్పిస్తామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ట్రైబ్యునల్.. తదుపరి విచారణను మార్చి 6కు వాయిదా వేసింది.

మహాకుంభమేళాకు రాష్ట్రపతి ముర్ము



ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 10: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమ ప్రాంతంలో పుణ్యస్నానమాచరించారు. ప్రత్యేకపూజలు చేశారు. అంతకు ముందు ఆమెకు ప్రయాగ్‌రాజ్‌లో యూపీ గవర్నర్ ఆనంది బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. పుణ్యస్నానం అనంతరం ముర్ము బడే హనుమాన్ మందిరాన్ని కూడా సందర్శించారు.

విజయవాడ నుంచి రాజధానికి రాజమార్గం

- నాలుగు లేన్లుగా కరకట్ట రోడ్డు విస్తరణ
- అలైన్‌మెంట్ పూర్తి.. క్షేత్రస్థాయిలో పెగ్ మార్కింగ్ పనులు
- భూములు ఇవ్వడానికి రైతులు సంసిద్ధత
- మంత్రి నారాయణతో త్వరలో ఏడీసీఎల్ అధికారుల సమావేశం
- ముఖ్యమంత్రితో చర్చించాక నోటిఫికేషన్ విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ వైపు నుంచి ప్రజలు రాజధానికి వెళ్లడానికి విశాలమైన రోడ్డు సిద్ధం కానుంది. రాజధాని అమరావతిలోని కృష్ణా కరకట్ట రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించటానికి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) టెండర్ల ప్రక్రియకు రెడీ అవుతోంది. క్షేత్రస్థాయిలో కరకట్ట రోడ్డుకు పెగ్ మార్కింగ్ పనులు చేపడుతోంది. దాదాపు అలైన్‌మెంట్‌ను కూడా సిద్ధం చేసింది. టెండర్ల ప్రక్రియ చేపట్టేలోపు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని ఏడీసీఎల్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కరకట్ట విస్తరణకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఇచ్చే రిపోర్టుపై మంత్రి నారాయణతో ఏడీసీఎల్ అధికారులు చర్చించనున్నారు. కరకట్టను రెండు, నాలుగు వరసలుగా విస్తరించటానికి వీలుగా ఎంత భూమి అవసరమనేది అంచనా వేసి నివేదిక ఇవ్వాల్సిందిగా సీఆర్‌డీఏ ల్యాండ్ డిపార్ట్‌మెంట్‌ను ఏడీసీఎల్ అధికారులు కోరారు. రెండు వరసలకైతే భూ సేకరణకు ఇబ్బంది లేదని తెలుస్తోంది. నాలుగు వరసలకు మాత్రం తప్పనిసరిగా భూములను సేకరించాల్సి ఉంటుంది. ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ఇప్పటికే పలుమార్లు కరకట్ట రోడ్డును పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో నాలుగు వరసలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రైతులందరితో ముఖాముఖి మాట్లాడుతూ భూ అవసరాలను వివరించారు. దాదాపు 90 శాతానికి పైగా రైతులు తమ భూములు ఇవ్వటానికి సానుకూలంగానే ఉన్నారు. నాలుగు వరసలుగా విస్తరించటానికి మరో 10 ఎకరాలను సేకరించగలిగితే సరిపోతుందని తెలుస్తోంది. అలైన్‌మెంట్‌పై మంత్రి నారాయణతో చర్చించాక చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కూడా కరకట్ట విస్తరణ అంశాన్ని ఏడీసీఎల్ అధికారులు చర్చించనున్నారు. భూములకు సంబంధించి సమీకరణ విధానంలో వెళ్లాలా? సేకరణ విధానంలో వెళ్లాలా? అనే అంశంపై ముఖ్యమంత్రితో చర్చించాక నోటిఫికేషన్ ఇవ్వాలని ఏడీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.

వరదలను తట్టుకునేలా కరకట్ట బలోపేతం

కరకట్ట రోడ్డు విస్తరణను చేపడుతున్నట్టు అప్పట్లో వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. అట్టహాసంగా భూమిపూజ చేపట్టారు. రెండు వరసలకు కొంతమేర ఎర్త్ వర్క్ చేసి ఆపేశారు. భూ సేకరణ పేరుతో పనులు నిలిపేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టాన్ని ఏడీసీఎల్ అధికారులు దృష్టిలో ఉంచుకున్నారు. నాలుగు వరసలుగా కరకట్ట రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికోసం కరకట్టను బలోపేతం చేయాల్సి ఉంటుంది. వరదలను తట్టుకునేలా ఒక బండ్‌గా దీనిని నిర్మించాలి. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారుల అభిప్రాయాలు, సలహాలను కూడా తీసుకోవాలని ఏడీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.



శ్రీవారి సేవలో హైకోర్టు సీజే

తిరుమల, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు, డైరీ, క్యాలెండరును టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.34నుండి 46/2024-25, తేది:07.02.2025

కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స. & పారిశుధ్య విభాగము, గూడూరు పరిధిలో గల 13 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకముల నిర్వహణ పనులు అంచనా విలువ: **రూ.233.60 లక్షలతో** ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ షెడ్యూల్ ప్రారంభ తేది: 18.02.2025, సా.5గం. తరువాత. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ **www.eprocurement.gov.in** నందు చూడవచ్చును.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, గూడూరు

DIPR RO No.15325/CL/ADVT/1/1/2021-22, Dt: 10.02.2025

తెలంగాణ గిరిజన సహకార సంస్థ లిమిటెడ్
(గిరిజన సంక్షేమ శాఖ)
4వ అంతస్తు, DSS భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్- 500028. ఇమెయిల్: mktgtsgcc@gmail.com
ఇ-టెండరు ప్రకటన

తెలంగాణ గిరిజన సహకార సంస్థ లిమిటెడ్, హైదరాబాద్ వారికి సోప్ నూడుల్స్ సరఫరా కొరకు తయారీదారులు మరియు వర్తకుల నుండి ఇ-టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ల వివరాలు తెలంగాణ ఇ-పోర్టల్ **http://tender.telangana.gov.in** నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

తేది: 08.02.2025 సం/- జనరల్ మేనేజర్(ఎం)/కన్వీనర్, TGGCC లిమిటెడ్, హైదరాబాద్

DIPR RO No.10136-PP/CL/ADVT/1/2024-25, తేది: 10.02.2025

ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి హాజరు కోరుతూ ప్రకటన

సెక్షన్ 82 Cr.P.C చూడగలరు

ఆరోపణలు ఎదుర్కొంటున్న మెసర్స్ **MNM మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ హరి క్రిషన్ అచ్చుపెలియా, 40-26-24, ఎల్.వి. రమేష్ వీధి, నవీపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్** వారు **పోలీస్ స్టేషన్, కరోల్‌బాగ్ ఢిల్లీ** వద్ద సెక్షన్ **138 NI** చట్టం క్రింద **C.C.No.13921/18**లో నేరం చేసినట్లు (లేదా చేసినట్లు అనుమానించబడిన వారు)గా నా సమక్షంలో ఫిర్యాదు చేయబడింది మరియు తదనుగుణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న **హరి క్రిషన్ అచ్చుపెలియాకు** జారీచేసిన అరెస్ట్ వారెంట్ వారు కనుగొనబడక తిరిగి వచ్చినది. అయితే సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న **హరి క్రిషన్ అచ్చుపెలియా** పరారీలో ఉన్నారని (లేదా సదరు వారెంట్‌ను అందుకోకుండా తప్పించుకోవడానికి తనకుతాను దాగి ఉన్నాడని) నా సంతృప్తి మేరకు తెలియజేయడమైనది.

పోలీస్ స్టేషన్, కరోల్‌బాగ్ ఢిల్లీ వద్ద ఆరోపణలు ఎదుర్కొంటున్న **హరి క్రిషన్ అచ్చుపెలియా**, సదరు ఫిర్యాదుకు సమాధానం ఇవ్వడానికి ఈ న్యాయస్థానం సమక్షంలో **21.03.2025**న లేదా ఆలోగా హాజరు కావాలని ఇందుమూలముగా ఈ ప్రకటన ఇవ్వడమైనది.

ఉత్తర్వు ద్వారా Ms. శ్రేయా సింగ్, JMFC-05, రూమ్ నం.05, తీస్ హజారీ కోర్ట్స్, ఢిల్లీ

DP/1269/CD/2025

మండలికి ముగిసిన నామినేషన్ల ఘట్టం

- మొత్తం 99 మంది నామినేషన్లు దాఖలు.. నేడు పరిశీలన

గుంటూరు/ఏలూరు/విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు సోమవారంతో గడువు ముగిసింది. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి 40 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన సోమవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, విజయవాడ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి 22 మంది గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వారి మద్దతుదారులతో తరలివచ్చారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, పీడీఎఫ్ బలపరిచిన అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు సోమవారం మధ్యాహ్నం నామినేషన్ వేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ నెల 7వ తేదీన నామినేషన్ దాఖలు చేసిన విషయం విదితమే.

- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గడువు ముగిసే నాటికి 49 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు 20 మంది నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం ఒక్కరోజే 29 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, దిడ్ల వీర రాఘవులు (పీడీఎఫ్)లతో పాటు మరో 47 మంది ఎన్నికల బరిలో నిలిచారు. కూటమి అభ్యర్థిగా పేరా బత్తుల రాజశేఖరం సోమవారం మద్దతుదారులతో బయలుదేరి నామినేషన్ పత్రాలను ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వికి సమర్పించారు.
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఆఖరిరోజు సోమవారం ఇద్దరు (పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు) నామినేషన్లు వేశారు. గడువు ముగిసే సమయానికి మొత్తం పది మంది నామినేషన్లు దాఖలు చేశారు.
- 11వ తేదీ మంగళవారం నామినేషన్ పరిశీలన ఉంటుంది. 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

దక్షిణ మధ్య రైల్వే
www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

టెండరు ప్రకటన నం. C/SG/C/36/5/399, తేది: 07.02.2025

భారత రాష్ట్రపతి తరఫున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికామ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) ఎస్.సి. రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు 17.03.2025న 15.00 గం.వరకు ఇ-టెండర్లు (బహిరంగ) కోరుతున్నారు.

క్ర.సం.01 టెండరు నం: C/SG/C/36/5/399, పని వివరణ: KZJ-BPQ సెక్షన్‌లో 3వ లైన్ పనులతో సంబంధం కలిగిన KZJ యార్డ్ వద్ద ఇంటర్‌లాకింగ్ సిగ్నలింగ్ పనులు. **సుమారు విలువ:** రూ. 221819282.53. **పూర్తి చేయాల్సిన కాలం:** 18 నెలలు.

పై పనుల కొరకు పని పూర్తి వివరణ, టెండరు నిబంధనలు, అర్హతాప్రమాణం మరియు వివరాలు, టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ వంటి అన్ని వివరాల కొరకు భారత ప్రభుత్వ టెండరు పోర్టల్ వెబ్‌సైట్ **www.ireps.gov.in** ను దర్శించగలరు.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికామ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు), సికింద్రాబాద్

టెండరు నం. GTL-EM-43-2024-25, తేది: 07.02.2025

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం: GTL-EM-43-2024-25: గుంతకల్ డివిజన్- 3 సంవత్సరాల కొరకు గుంతకల్ డివిజన్‌లో పంపుల కొరకు వార్షిక మరమ్మతు కాంట్రాక్టు. **సుమారు విలువ:** రూ. 3994756.89., **బయానా:** రూ. 79900/-.,

ముగింపు తేది మరియు సమయం: 03.03.2025న 15.00 గం.లకు.

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. ఏదేని సవరణ ఉంటే అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. గమనిక: ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటులో గల DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్.

ఇ-టెండరు ప్రకటన నం: 24 నుండి 26

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్వహణ), గుంటూరు వారు IREPS పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా దిగువ తెలిపిన ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం: 01, **టెండరు రిఫరెన్స్ నం:** GNT-E.24.2024-25, Dt. 06.02.2025 **టెండరు టైటిల్:** GNT డివిజన్: గుంటూరు డివిజన్‌లోని వివిధ స్టేషన్ల వద్ద గల కొండ/ రాకీ సాయిల్ ఏరియాల వద్ద నిర్వహణ రహిత మట్టిగుంటల ఏర్పాటు, ఎర్త్ రెసిస్టెన్స్ వాల్యూస్ మెరుగుపరచడానికి & రిలయబుల్ & సురక్షిత విద్యుత్ సరఫరా ఏర్పాట్ల నిర్వహణ కోసం సర్వీసు భవనాలు, క్వార్టర్లు, సబ్ స్టేషన్లు, ఎల్‌సి గేట్లు, పంపింగ్ లొకేషన్లు మొ.వి. **సుమారు విలువ:** రూ.46,53,192-11 **బయానా:** రూ.93,100-00 **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** రూ.0

క్ర.సం: 02, **టెండరు రిఫరెన్స్ నం:** GNT-E.25.2024-25, Dt. 07.02.2025 **టెండరు టైటిల్:** GNT డివిజన్: గుంటూరు డివిజన్‌లోని కమర్షియల్ స్టాల్స్, ఔట్ సైడర్ కనెక్షన్లు మొ॥ వాటి కోసం ప్రీ పెయిడ్ ఎనర్జీ మీటర్ల ఏర్పాటు. **సుమారు విలువ:** రూ.30,31,125-00 **బయానా:** రూ.60,600-00 **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** రూ.0

క్ర.సం: 03, **టెండరు రిఫరెన్స్ నం:** GNT-E.26.2024-25, Dt. 07.02.2025 **టెండరు టైటిల్:** GNT డివిజన్: DRM ఆఫీస్ కాంపౌండ్‌లో పాత/ తుప్పుపట్టిన/ డ్యామేజ్ అయిన పోల్స్ స్థానంలో కొత్త స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు & లైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ మరియు NLPD నుండి DRM ఆఫీస్‌కు అప్రోచ్‌రోడ్. **సుమారు విలువ:** రూ.37,50,425-57 **బయానా:** రూ.75,000-00 **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** రూ.0

క్ర.సం.1 కొరకు ఆన్‌లైన్‌లో ఇ-బిడ్ల దాఖలుకు చివరి తేది మరియు సమయం: 28.02.2025, 11.30 గం. వరకు.
క్ర.సం.2 కొరకు ఆన్‌లైన్‌లో ఇ-బిడ్ల దాఖలుకు చివరి తేది మరియు సమయం: 28.02.2025, 16.00 గం. వరకు.
క్ర.సం.3 కొరకు ఆన్‌లైన్‌లో ఇ-బిడ్ల దాఖలుకు చివరి తేది మరియు సమయం: 03.03.2025, 11.30 గం. వరకు.


ఏదేని తదుపరి సమాచారం/ సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** లో మాత్రమే ప్రచురించబడును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/గుంటూరు

A0177

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ఆంధ్రప్రదేశ్‌లో 2018-19 నుంచి 2022-23 వరకు రూ.3,707.43 కోట్ల సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం, లోక్‌సభలో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శ్రేయో మేధ

బ్రహ్మంగారి కాలజ్ఞానం కృత్రిమ మేధను ఊహించిందో లేదో గానీ ఈ అధునాతన సాంకేతికత మనలను కాలం అంచులకు తీసుకువెళ్లుతోంది. నాగరికత ప్రారంభమయింది మొదలు మానవాళి సాంకేతికతల మార్పులు చవిచూస్తూనే ఉన్నది. మానవ సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సాంకేతిక పరిజ్ఞానాలు ఎన్నో ఉన్నాయి. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ) విప్లవాత్మక సాంకేతికతలు అన్నిటిలోకి విప్లవాత్మకమైనది. మానవుని సమస్త అనుభవాలను మార్చివేస్తోంది. 'ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను' అని చెప్పటం ద్వారా మానవ అస్తిత్వ ప్రధాన లక్షణం ఆలోచనాశీలత అనే భావనను ఫ్రెంచ్ తాత్త్వికుడు డెకార్ట్ సుస్థిరం చేశాడు. మానవ సామర్థ్యాలు అన్నిటినీ సంతరించుకుంటున్న ఎఐ అంతిమంగా ఆలోచనాశీలి కూడా కాగలిగితే మానవ అస్తిత్వ ప్రత్యేకత ఏమిటి అనేది అనేక మందిని కలవరపెడుతోంది. 'జీవితంలో భయపడవలసింది ఏదీ లేదు, కాకపోతే అర్థం చేసుకోవలసి ఉంటుంది' అన్న మ్యారీ క్యూరీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఆ వ్యాకులతను జయించవచ్చు.

కృత్రిమ మేధ ప్రస్తుత ప్రస్థానం మూడు ప్రధాన సమస్యలకు దారితీస్తోంది: ఎఐపై నియంత్రణ ఉన్నవారు, దానిని ఉపయోగించుకుంటున్న వారి మధ్య పెరుగుతున్న అసమానతలు; ఎఐ అభివృద్ధి కొద్ది మంది వ్యక్తుల, సంస్థల పరిధిలో కేంద్రీకృతమై, ఆ పురోగతిలో ఇతరులు భాగస్వాములు అయ్యేందుకు సమ అవకాశాలు కొరవడడం; ఈ వినూత్న సాంకేతికతను ప్రజాహితానికి ఉపయోగించే ప్రయత్నాలు సంఘటితంగా జరగకపోవడం వల్ల మానవాళిని పీడిస్తున్న కీలక సమస్యలను పరిష్కరించడంలో చోటుచేసుకుంటున్న జాప్యం, నిర్లక్ష్యం.

ఈ సమస్యలను అధిగమించేందుకే పారిస్‌లో ఈ సోమ, మంగళ వారాలలో 'ఎఐ యాక్షన్ సమ్మిట్'ను ఫ్రాన్స్ నిర్వహిస్తోంది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చొరవతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సుకు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహ అధ్యక్షుడుగా ఉండడం విశేషం. స్వతంత్ర, భద్రమైన, విశ్వసనీయమైన ఎఐని సమస్త దేశాల వారికి అందుబాటులో ఉంచడం, పర్యావరణ హితకరమైన కృత్రిమ మేధను అభివృద్ధిపరచడం. ఈ కొత్త సాంకేతికత వ్యవహారాల అంతర్జాతీయ నిర్వహణ ప్రభావశీలంగా, సమ్మిళితంగా ఉండేలా చేయడం అనేవి పారిస్ ఎఐ యాక్షన్ సదస్సు లక్ష్యాలుగా ఉన్నాయి.

కృత్రిమ మేధపై ఈ తరహా అంతర్జాతీయ సదస్సు ఇదే మొదటిది కాదు. 2023 నవంబర్‌లో బ్రిటన్‌లోని బ్లెట్చ్లే పార్క్‌లో మొదటి సదస్సు జరిగింది. ఎఐ సాంకేతికతలను మానవ కేంద్రితంగా అభివృద్ధి పరచాలని ఆ సదస్సు పిలుపునిచ్చింది. నేరపూరిత కార్యకలాపాలకు ఈ సాంకేతికత ఉపయోగపడకుండా నిరోధించడంపై జాగ్రత్త వహించాలని ఆ సదస్సు నొక్కి చెప్పింది. ఈ మేరకు బ్రిటన్ ఎఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్ నొకదాన్ని నెలకొల్పింది. రెండో శిఖరాగ్ర సదస్సు మే 2024లో సియోల్‌లో జరిగింది. ఈ సదస్సు స్ఫూర్తితో ఎఐ సాంకేతికతల రక్షణపై ప్రపంచ దేశాలు మరింతగా శ్రద్ధాసక్తులు చూపడం ప్రారంభమయింది. ఇప్పుడు పారిస్‌లో జరుగుతున్న సదస్సు కేవలం ఆ సాంకేతికత రక్షణ విషయాలకే పరిమితమవకుండా దాని సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే అజెండాతో జరుగుతుంది. ఎఐ అభివృద్ధి సమష్టి కృషితో జరగాలని ఈ అజెండా నిర్దేశిస్తోంది.

పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలు, ఎఐ రంగంలో తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న టెక్ దిగ్గజ కంపెనీలకు సవాల్‌గా పరిణమిస్తూ డీప్ సీక్ అనే చైనీస్ ఎఐ మోడల్ ప్రపంచ ప్రజల ముందుకు వచ్చిన నేపథ్యంలో పారిస్ ఎఐ యాక్షన్ సమ్మిట్ జరుగుతోంది. ఈ నవీన సాంకేతికత రంగంలో చైనా సాధించిన అద్భుత పురోగతి పాశ్చాత్య దేశాలను ముఖ్యంగా అమెరికాను అమితంగా కలవరపరుస్తోంది. ఏఐలో అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టేందుకు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంత దూరమైనా వెళతారు, ఎంతకైనా సాహసిస్తారు. అపార భాగ్యరాశులను పోగేసుకున్న అమెరికన్ టెక్ కంపెనీలు ఎఐ రంగంలో తమ గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నాయి. గుత్తాధిపత్యం ఉన్నచోట సమ అవకాశాలు ఎలా లభిస్తాయి? పారిస్ సదస్సు నిర్వాహకుల లక్ష్యం ఎలా ఉన్నా అమెరికా, ఆ దేశ టెక్ దిగ్గజాల ఆధిపత్యాన్ని అదుపుచేయడం సాధ్యమవుతుందా? అమెజాన్, గూగిల్, మైక్రోసాఫ్ట్ మొదలైన కంపెనీలతో పాటు ఎఐ చిప్‌ల డిజైన్, ఉత్పత్తిపై నియంత్రణ ఉన్న ఓపెన్ ఎఐ, ఆంత్రోపిక్, డీప్‌మైండ్, మిస్ట్రాల్, ఎన్‌విడియా మొదలైన ఎఐ ల్యాబ్స్ గుత్తాధిపత్యాన్ని తగ్గించడంలో పారిస్ సదస్సు కించిత్ విజయం సాధించినా ఎఐ యాక్షన్ సమ్మిట్ అన్న నామకరణం సార్థకమవుతుంది. విప్లవాత్మక సాంకేతికతల వలే మౌలిక రాజకీయ పరిణామాలు, సామాజిక పరివర్తనలు మానవాళికి శుభకరాలు. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు 'మనుష్యుడే నా సంగీతం/మానవుడే నా సందేశం' అన్నది ఏ సాంకేతిక విప్లవానికైనా ఆదర్శంగా, లక్ష్యంగా ఉండాలి. కృత్రిమ మేధ విషయంలో అటువంటి స్ఫూర్తి వెల్లివిరిస్తే ఆ అపూర్వ సాంకేతికత సమస్త మానవులకూ తప్పక శ్రేయో మేధ అవుతుంది.

మూడు దశాబ్దాల నిరీక్షణ

అనుకున్నదే.! అనూహ్యమైనదేమీ కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి, నవభారత రాజకీయ వినీలాకాశంలో వినూత్న తారాజువ్వలా ఒక్క ఉదుటున పైకి ఎగసిన అరవింద్ కేజ్రీవాల్... అంతే వేగంతో అవినీతి పంకిలంలోకి రాలి పడినప్పుడే ఈ ఫలితం ఖరారైంది. చెత్తను సాంతం ఊడ్చేస్తానంటూ బయలుదేరిన చీపురు కట్టే.. స్వయంగా చెత్తబుట్టలోకి చేరినప్పుడే జరగబోయేదేమిటో నిర్ణయమైపోయింది.

దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ దరిమిలా బీజేపీ చేతికి అందివచ్చిన విజయ ఫలమిది. అసలు ఇంతకీ అప్పట్లో బీజేపీ ఎందుకు ఢిల్లీ పీఠానికి దూరమైంది... ఆ తర్వాత కూడా రాజధాని ప్రజలు కమలం పార్టీని వరుసగా ఎందుకు తిరస్కరిస్తూ వచ్చారన్నది ప్రస్తుత గెలుపును అర్థం చేసుకోవడానికి ఉపకరించేదే.

ఢిల్లీ అసెంబ్లీ ఏర్పడ్డాక 1993లో మొట్టమొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో బీజేపీనే విజేతగా నిలిచింది. కానీ 1998 దాకా ఐదేళ్లపాటు సాగిన ఆ పార్టీ పాలన సమస్తం అస్తవ్యస్తం. అస్థిరత, కుమ్ములాటలు, ఆర్థిక అరాచకం. ఐదేళ్లలోనే ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. వివాదాల్లో కూరుకుపోయారు. ఆటుపోట్లు, ప్రతిఘటనలను సమర్థంగా ఎదుర్కొనలేక చివరకు చేతులెత్తేశారు.

మొట్టమొదట 1993లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన మదన్‌లాల్ ఖురానా మంచి ప్రజాదరణ కలిగిన నాయకుడే అయినప్పటికీ, అవినీతి ఆరోపణల్లో పూర్తిగా దిగబడిపోయారు. దరిమిలా 1996లో రాజీనామా చేశారు. దాంతో పార్టీలోని ఆయన వర్గంలో అలజడి చెలరేగింది. అవకాశం కోసం ఎదురుచూడసాగారు. ఆయన స్థానే ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన సాహిబ్‌సింగ్ వర్మది మరో కథ.. వేరే వ్యథ. అప్పటికే ఢిల్లీ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. ముఖ్యంగా నిత్యావసర సరకైన ఉల్లి ధర ఏకంగా 50 రూపాయల దాకా దేకి ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు, పార్టీ వర్గాలకు, అభిమానులకు కన్నీళ్లు తెప్పించింది. ఫలితంగా బీజేపీ ప్రతిష్ఠ పూర్తిగా మసకబారింది. ధరోల్బణం, గాడి తప్పిన పరిపాలన తోడై.. కోలుకోవడం అసాధ్యంగా మారింది.



కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కాలదన్నిన వాళ్లను, వాళ్లవాళ్లనూ ఒక్కోసారి కళ్లకద్దుకొని, నెత్తినెత్తుకొంటుంది. ఇప్పుడు డిల్లీ ఓటర్లు బీజేపీపై తమ నమ్మకాన్ని పునరుద్ధరించుకొని.. మరొక్క అవకాశం ఇచ్చారు. పాత వైఫల్యాలనుంచి అది ఏ మేరకు పాఠాలు నేర్చుకొని కొత్త బాటలు వేస్తుందో చూడాలి!

వాస్తవంలో ఆ దురవస్థకు సాహిబ్‌సింగ్‌నే పూర్తిగా బాధ్యుడిని చేయలేం. ఆయన ఒక్కడినే నిందించలేం. అప్పటి పరిస్థితులు ఆయనతో చెలగాటమాడాయి. 1998 జనవరిలో కురిసిన అకాల వర్షాలు ఉల్లి ఉత్పత్తిని దారుణంగా దెబ్బతీశాయి. కిలో పది రూపాయల దాకా ఉన్న ధరలు ఒక్క నెల వ్యవధిలోనే పాతిక రూపాయలు దాటాయి. ఆనాటి వాజపేయి సర్కారు వెంటనే ఉల్లి ఎగుమతుల్ని నిషేధించినప్పటికీ, మార్చిలో ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. దురదృష్టం వెన్నాడి అధిక ఉష్ణోగ్రతల కారణంగా రబీ పంటా నేలకు ఒరిగిపోయింది. ఆగస్టు నాటికి ధర 30కి చేరింది. ఖరీఫ్ పంటపైనా ఆశలు అడుగంటిపోయి, అక్టోబర్ నాటికి కిలో ఉల్లి ధర 50 దాటింది. అప్పటికి ఎలాంటి దిద్దుబాటు చర్యలకు అవకాశం లేకుండా పోయింది. ఆశలు పూర్తిగా అడుగంటిపోయిన పరిస్థితుల్లో... ఆఖరి అస్త్రంగా ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు సుష్మాస్వరాజ్‌ను బీజేపీ అధిష్ఠానం రంగంలోకి దింపింది. కేవలం 52 రోజుల స్వల్ప వ్యవధిలో పరిస్థితిని చక్కదిద్దడం అన్నది ఆమెకే కాదు.. మరెవరున్నా సాధ్యపడదు, పడలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఢిల్లీలో బీజేపీ భవిష్యత్తు ఏమిటో తేలిపోయింది.. భవిష్యత్తు లేదనీ స్పష్టమైపోయింది. 1998 నవంబరు నెలాఖరులో జరిగిన ఎన్నికల్లో షీలా దీక్షిత్ సారథ్యంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించి ఢిల్లీ కోటలో పాగా వేసింది. ఆనాటి నుంచి ప్రజల్లో నమ్మకం కలిగించలేక ఢిల్లీ పీఠానికి బీజేపీ బహు దూరంలోనే ఉండిపోయింది. కాలగమనంలో 27 ఏళ్లు దొర్లిపోయాక.. ఇప్పుడు మరోసారి ఓటరు దేవుడు కరుణించడంతో ఆ కరవుకు తీరినట్లయింది.

షీలా దీక్షిత్ 1998 నుంచి 2013 దాకా 15 ఏళ్ల పాటు ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలం ..దేశ రాజధానిలో కాంగ్రెస్‌కు స్వర్ణ యుగం. మెట్రో వ్యవస్థ పట్టాలకు ఎక్కడమే కాకుండా, ప్రజా రవాణా, నీటి సరఫరా సహా మౌలిక సదుపాయాల సర్వోన్నతి కారణంగా ఢిల్లీ ఓటర్లు వరుసగా మూడుసార్లు ఆమెకు పట్టం కట్టారు. అంతా బాగానే సాగుతోందని అనుకుంటున్న పరిస్థితుల్లో అద్భుతం జరిగింది. మాజీ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో 2013లో రాజకీయ తెరంగేట్రం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ... జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ రెండింటి గుత్తాధిపత్యానికి గండి కొట్టింది. 2015 ఎన్నికల్లో 70 స్థానాల్లో 62 గెలుచుకొని కొత్త చరిత్ర సృష్టించడమే కాదు... బీజేపీని కేవలం 3 సీట్లకు పరిమితం చేసింది. కాంగ్రెస్ సోదిలోకి లేకుండా పోయింది. 2020 ఎన్నికల్లోనూ అదే హవా కొనసాగింది. బీజేపీ దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతున్నప్పటికీ.. ఢిల్లీ పీఠం బహుదూరంలోనే ఉండిపోయింది. 62 సీట్లతో ఆప్ మళ్లీ దుమ్మురేపింది.

ఎట్టకేలకు ఇప్పుడు ఢిల్లీ ఓటర్లు బీజేపీపై తమ నమ్మకాన్ని పునరుద్ధరించుకొని.. మరొక్క అవకాశం ఇచ్చారు. పాత వైఫల్యాల నుంచి అది ఏ మేరకు పాఠాలు నేర్చుకొని కొత్త బాటలు వేస్తుందో... ఎంతవరకు ప్రజావిశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందో చూడాలిక..!

కొసమెరుపు: కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కాలదన్నిన వాళ్లను, వాళ్లవాళ్లనూ ఒక్కోసారి కళ్లకద్దుకొని, నెత్తినెత్తుకొంటుంది. అప్పట్లో ఉల్లి లొల్లి కారణంగా అప్రతిష్ఠ మూటగట్టుకొని ఢిల్లీ సీఎంగా తప్పుకోవడమే కాదు, రాజధాని నుంచే బీజేపీ తాత్కాలిక నిష్క్రమణకు చాలావరకు బాధ్యుడిగా నిందమోశారు– సాహిబ్‌సింగ్ వర్మ. ఇప్పుడు అదే సాహిబ్ కుమారుడు పర్వేశ్ వర్మ– కీలక న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌ను మట్టికరిపించడమే కాదు, ఏకంగా ఢిల్లీ సీఎం పీఠానికే బాటలు వేసుకొన్నారు. కాలం కలిసొస్తే పట్టాభిషేకం ఆయనకే. ఏమో... గుర్రం ఎగురావచ్చు?

○ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కొత్త సమస్యల్లో వీసీల నియామకాలు

భారతదేశపు మొదటి ఉపరాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కమిటీ సూచన మేరకు భారత ప్రభుత్వం పార్లమెంటు చట్టం ద్వారా 1953లో 'విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం' (యూజీసీ)ను ఏర్పాటు చేసింది. దేశంలోని విశ్వవిద్యాలయాలను ఈ సంస్థ పరిధిలోకి తీసుకొచ్చి డిగ్రీలు ప్రదానం చేసే అవకాశం కల్పించడం ఈ సంస్థ బాధ్యత. విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం, నాణ్యమైన విద్యను బోధించడం, నాణ్యత కలిగిన పరిశోధనలు జరిగేలా చూడటం యూజీసీ బాధ్యత. డీమ్డ్ విశ్వవిద్యాలయాల స్థాపనలో మానవ వనరుల అభివృద్ధి శాఖకు యూజీసీ కమిటీల ద్వారా సిఫార్సు చేయటం, అర్హత కలిగిన విశ్వవిద్యాలయాలను, కళాశాలలను గుర్తించి వాటికి ఆర్థిక సహాయం చేయటమే కాకుండా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో యూజీసీ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఉత్కృష్ట ప్రమాణాలతో నడుస్తున్న కళాశాలలను గుర్తించి, స్వయం ప్రతిపత్తి హోదా కలిగించటం, ఆర్థిక సహాయం చేయటం, ఉన్నతమైన విశ్వవిద్యాలయాలలో పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించటం మొదలైనవి యూజీసీ బాధ్యతలు.

దేశంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, పార్లమెంటరీ చట్టం ద్వారా; రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర అసెంబ్లీ చట్టం ద్వారా ఏర్పాటవుతాయి. యూజీసీ కమిటీ సిఫార్సు మేరకు కేంద్రీయ విద్యాశాఖ యూజీసీ చట్టం ద్వారా (Section 3 of U.G.C act) విశ్వవిద్యాలయాలు ఏర్పాటవుతాయి. ఇక రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఆయా రాష్ట్ర శాసనమండలి, ప్రభుత్వాల చట్టం ద్వారా అనుమతులతో ఏర్పడతాయి. భారతదేశంలో ప్రస్తుతం 1000 పైచిలుకు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు కాగా, దాదాపు 375 రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, నాలుగు వందల పైచిలుకు రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఇక పోతే 130 పైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయాలు సమర్థంగా, ప్రగతి పథంలో పయనించాలంటే సమర్థత కలిగిన, మంచి అనుభవం కలిగిన విద్యావేత్తలను కులపతులుగా నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపకులపతులుగా ఎటువంటి వారిని నియమిస్తే విశ్వవిద్యాలయాలు బాగుపడుతాయో పలు కమిటీలు, రాధాకృష్ణ కమిటీ (1948), డాక్టర్ కొఠారి కమిటీ (1966), జ్ఞానం కమిటీ (1990), రామ్‌లాల్ పరీఖ్ కమిషన్ (1993) విలువైన సూచనలు ఇచ్చాయి. ఈ కమిటీలు కూడా మంచి పరిజ్ఞానం, పరిపాలన దక్షత కలిగిన వ్యక్తులను, విశ్వవిద్యాలయ ఉపకులపతులుగా నియమించడం మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేశాయి. పరీఖ్ కమిటీ అయితే ప్రభుత్వ అధికారులు కాకుండా విద్యాసంస్థల పరిపాలన అనుభవం కలిగిన వారిని నియమించటం మంచిదని అభిప్రాయం వ్యక్తం చేసింది.

కొత్త యూజీసీ నిబంధనల ప్రకారం పరిశ్రమల విభాగం నుంచి గాని, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి గాని, పబ్లిక్ పాలసీ నుంచి గాని, ఇంకా పరిశోధన సంస్థల నుంచి గాని మంచి విద్యావేత్తలను విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా నియమించవచ్చు. ఈ ప్రతిపాదనలు కొత్త సమస్యను తీసుకువచ్చాయి. ఏ ఏ సంస్థలు నిపుణులు ఆయా సంస్థలకు అధిపతిగా ఉండటం మంచిది. ఒక సంస్థ నుంచి విద్యారంగంలో అనుభవం లేని వ్యక్తులను, విశ్వవిద్యాలయ వ్యవస్థలో పరిపూర్ణ జ్ఞానం లేని వ్యక్తులను ఉపకులపతులుగా నియమించటం ఆలోచించదగ్గ విషయం. ఇక పోతే విశ్వవిద్యాలయ రంగంలో మంచి అనుభవం కలిగిన సమర్థమైన వ్యక్తులను ఉపకులపతులుగా నియమించడం ఎంతైనా సమంజసం.



మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదం పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ఉపకులపతులు నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం పెత్తనం లేనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడ్డ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల్లో మాత్రం కేంద్రం పెత్తనం ఎందుకు? బీజేపీ యేతర రాష్ట్రాలు గాని, బీజేపీ పాలనలోని రాష్ట్రాలు గాని యూజీసీ కొత్తగా ప్రతిపాదించిన ముసాయిదాని వ్యతిరేకించడం ఎంతైనా అవసరం.

రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతులను సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసిన మూడు పేర్లలో రాష్ట్ర గవర్నర్ ఒకరిని ఉపకులపతిగా నియమిస్తారు. ప్రస్తుతం సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ మెంబర్లుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకరు, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ద్వారా ఒకరు, యూజీసీ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. యూజీసీ కొత్తగా తెచ్చిన సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తరపున సభ్యుడి బదులుగా గవర్నర్ తరపున సభ్యుడిని ప్రతిపాదించి రాష్ట్ర ప్రభుత్వాలలో ఒక అలజడి తీసుకొచ్చింది. యూజీసీ కొత్తగా తీసుకొచ్చిన సవరణను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యతిరేకించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం, విద్యావేత్తలూ వ్యతిరేకిస్తున్నారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్పును వ్యతిరేకిస్తాయని అనటంలో సందేహం లేదు.

సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీల విషయానికొస్తే కేంద్ర విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ నుంచి ఇద్దరు మెంబర్లు ఉండగా, ఒకరు విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కమిటీ నామినేట్ చేసిన వ్యక్తి కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురూ వచ్చిన అప్లికేషన్లు పరిశీలించి ముగ్గురు వ్యక్తులను కేంద్ర మానవ వనరుల శాఖకు పంపిస్తారు. ఆ శాఖ వీరి పేర్లను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ జాబితా నుంచి ఒకరిని కేంద్రీయ విశ్వవిద్యాలయ కులపతిగా నియమిస్తారు. కేంద్ర మానవ వనరుల శాఖ నోటిఫికేషన్ ద్వారా విశ్వవిద్యాలయం ఉపకులపతిని నియమిస్తారు. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వానికి కావాల్సిన వ్యక్తిని రాష్ట్రపతి నియమిస్తారు.

ఇక రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకరు, విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కమిటీ నుంచి ఒకరు, యూజీసీ నుంచి ఒకరు ముగ్గురు సభ్యులు సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురు సభ్యులు మూడు పేర్లను రాష్ట్ర విద్యాశాఖకు సమర్పిస్తారు. ఈ మూడు పేర్లను గవర్నర్‌కు పంపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యక్తిని సూచిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వ్యక్తిని కాకుండా, గవర్నర్ ఇంకొక వ్యక్తిని విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమించిన సందర్భాలు కూడా ఉన్నాయి. నందమూరి తారకరామారావు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల యాక్ట్‌ను సవరణ చేసి ప్రభుత్వం పంపిన ముగ్గురు పేర్లలో ప్రభుత్వం సూచించిన వ్యక్తినే విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నియమించాలని సూచించారు. దాని ప్రకారం ప్రభుత్వం సూచించిన వ్యక్తినే ఉపకులపతిగా నియమించేవారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ముందు పద్ధతినే అనుసరించి ఉపకులపతిని నియమించే అధికారం గవర్నర్‌కే ఇచ్చాయి.

ఇక రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల విషయానికొస్తే ఉపకులపతులను నియమించే అధికారం పూర్తిగా మేనేజ్‌మెంట్ మీద ఉంటుంది. సెర్చ్ కమిటీని నియమించి మేనేజ్‌మెంటుకు కావలసిన వ్యక్తిని సూచించి ఉపకులపతిగా నియమించుకుంటారు. ఇక డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు వస్తే, విశ్వవిద్యాలయ కులపతి... ఉపకులపతిని నియమిస్తారు. మేనేజ్‌మెంట్ వారు గానీ, వారికి బాగా తెలిసిన వ్యక్తి గాని విశ్వవిద్యాలయం కులపతిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉపకులపతుల నియామకాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం ఉండదు.

కొత్తగా ప్రతిపాదించిన యూజీసీ ముసాయిదా ప్రకారం సెర్చ్ కమిటీలో యూజీసీ నుంచి ఒకరు, గవర్నరు సూచించే మరొక వ్యక్తి, యూనివర్శిటీ నుంచి ఒకరు ఉంటారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎవరూ సెర్చ్ కమిటీ మెంబర్‌గా ఉండరు. సెర్చ్ కమిటీ తన ప్రతిపాదనలను నేరుగా గవర్నర్‌కి పంపిస్తే, గవర్నర్ ఉపకులపతిని ఎంపిక చేస్తారు. అంటే గవర్నర్ సూచించిన వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతిగా నియమించవలసిన పరిస్థితి. విశ్వవిద్యాలయం స్థాపించడం, వాటికి కావలసిన అన్ని సదుపాయాలు కల్పించడం, ఆర్థిక వనరులు కల్పించాల్సిన బాధ్యతలున్న రాష్ట్ర ప్రభుత్వాలకు విశ్వవిద్యాలయాల ఉపకులపతిని నియమించే అధికారం లేదంటే ఆలోచించదగిన విషయం.

ఇకపోతే యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనల్లో ఉపకులపతులను నియమించడంలో, పరిశ్రమల నుంచి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి, పబ్లిక్ పాలసీ నుంచి, వైజ్ఞానిక పరిశోధనా సంస్థల నుంచి వ్యక్తులను తీసుకురావడం సమంజసం కాదు. గొప్ప విద్యావంతులు, మేధావులు, ప్రతిభావంతులు, విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా అనుభవం కలిగిన వ్యక్తులను ఉపకులపతులుగా నియమించడం ఉన్నత విద్యను ప్రగతిపథంలోకి తీసుకురావడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

దేశంలో దాదాపు 400 పైబడిన రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాలలో కేంద్ర ప్రభుత్వం ప్రమేయం లేనప్పుడు ఏ మాత్రం, ఆర్థిక సహాయం చేయని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రమేయం అవసరం లేదు. దీనికంటే విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన విద్య, పరిశోధనలు, ఇన్నోవేటివ్ కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా ప్రపంచ విశ్వవిద్యాలయాలకు పోటీగా తీసుకురావడంలో తగు సూచనలు ఇవ్వడం మంచిది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదం పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ఉపకులపతుల నియామకాల్లో కేంద్ర ప్రభుత్వ పెత్తనం లేనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడ్డ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల్లో మాత్రం పెత్తనం ఎందుకు? బీజేపీ యేతర రాష్ట్రాలు గాని, బీజేపీ పాలనలో రాష్ట్రాలు గాని యూజీసీ కొత్తగా ప్రతిపాదించిన ముసాయిదాని వ్యతిరేకించడం ఎంతైనా అవసరం. ఎందుకంటే విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించే విధంగా యూజీసీ ప్రతిపాదించిన ముసాయిదా ఉంది. దేశంలోని గొప్ప విద్యావంతులు, మేధావులు, ప్రతిభావంతులు ఆలోచించి ఈ ముసాయిదాను వ్యతిరేకించవలసిన అవసరం ఉంది.

■ ఆచార్య కిలారి రామమూర్తినాయుడు
పూర్వపు మెంబరు, యూజీసీ

చరిత్రా, ఆ ప్రాచీన యశస్సు ఎవరిది?

పురావస్తు తవ్వకాలలో వెలుగు చూసిన కొత్త విషయాలను ప్రపంచానికి ఎవరు వెల్లడించాలి? తవ్వకాలు జరిపిన, పరిశోధనలను పర్యవేక్షించిన పురావస్తు శాస్త్రవేత్తలే కాదూ? 'చారిత్రక విభాత సంధ్యల మానవకథ వికాసం'పై కొత్త వెలుగులు ప్రసరించిన పురావస్తు శాస్త్ర ఆవిష్కరణను ఒక రాజకీయ నాయకుడు ప్రకటించడం అసాధారణ పరిణామం. అయితే నేటి భారతదేశంలో అదేమంత ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు సుమా! స్వాతంత్ర్యానికి పూర్వం లేదా నెహ్రూ భారత్‌లో అయితే మౌలిక ప్రాధాన్యమున్న పురావస్తు విశేషాలను తొలుత ప్రముఖ అకడమిక్ జర్నల్స్‌లో, అదీ పురావస్తు శాస్త్ర పరిశోధనల్లో అనుభవజ్ఞులయిన విద్వజ్జుల నిశిత పరిశీలన, ఆమోదం అనంతరం మాత్రమే వెల్లడించేవారు. ఉదాహరణకు 1995లో ఉత్తరప్రదేశ్‌లో క్రీ.పూ.1800 – క్రీ.పూ.1000 మధ్య కాలం నాటి ఇనుప పనిముట్లు, బట్టీలు, ఇతర సామగ్రి పురావస్తు తవ్వకాలలో బయల్పడ్డాయి. ఆ కొత్త విశేషాలను మొట్టమొదట భారతీయ, విదేశీ పురావస్తు శాస్త్ర జర్నల్స్‌లో వెల్లడించారు. అదొక విసుగు పుట్టించే సుదీర్ఘ విద్యా విషయిక ప్రక్రియ.

కాలం మారింది. ఇప్పుడు ఏదీ రాజకీయాలకు అతీతమైనది కాదు, అనర్హమైనది అంతకంటే కాదు. ఎన్నికల తరువాత ఎన్నికలకు సంసిద్ధమవడమే చరిత్ర గమనంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పురావస్తు శాస్త్రాన్ని సైతం ఆ విద్వత్ క్షేత్ర కృషీవలులకు వదిలివేయడానికి మన రాజకీయవేత్తలకు మనసొప్పడం లేదు. మన దేశంలో హరప్పా నాగరికత విలసిల్లిన ప్రాంతాలలో ఒకటైన రఖిగర్హిలో పురావస్తు తవ్వకాలను హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఎలా పర్యవేక్షించారో గుర్తుచేసుకోండి. ఆ తవ్వకాల ద్వారా పురాణాలలో ప్రస్తావితమైన, అయితే భౌతికంగా అదృశ్యమైన సరస్వతీ నది జాడను కనుగొనేందుకు ఆయన ప్రభుత్వం ఎంతగా ఆరాటపడిందో మరి చెప్పాలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం అయోధ్యలో అభిరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఎంత ఆచారబద్ధంగా పాల్గొన్నారో చూశాం. మొగల్ సామ్రాజ్య స్థాపకుడు బాబర్ కూల్చివేసిన ఒక దేవాలయం స్థలంలోనే బాబ్రీ మసీదును నిర్మించారని పురావస్తు తవ్వకాలతో సహా భారతీయ జనతా పార్టీ దశాబ్దాల పాటు శత విధాల చేసిన ప్రయత్నాల పరాకాష్ఠే అయోధ్యలో దశరథరాముడి ప్రతిమా ప్రతిష్ఠాపన.

రాజకీయవేత్తల ఈ వైఖరినే తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ సైతం అనుసరిస్తున్నారు. 'మానవ ఇతిహాసంలో ఇనుప యుగం తమిళగడ్డపై ప్రారంభమయిందని ప్రపంచానికి చెప్పుతున్నా'నని గత నెల 24న 'సగర్వంగా, ఎనలేని సంతృప్తితో' ఆయన ప్రకటించడం ఆ వైచిత్రీ విన్యాసమే. తన ప్రకటనకు మద్దతుగా ఆయన రెండు కార్బన్ డేటింగ్ (రేడియో కార్బన్ సహాయంతో కాల నిర్ధారణ)తో సహా మూడు శాస్త్రీయ పరీక్షల ఫలితాలను రుజువులుగా చూపారు. మన దేశంలోని రెండు ప్రతిష్ఠాత్మక వైజ్ఞానిక పరిశోధనా సంస్థలు, అమెరికాలోని ఒక ప్రముఖ ప్రయోగశాల ఆ పరీక్షలను నిర్వహించాయి. తమిళనాడులోని మయిలదుంపరాయి, కిల్నామండి, శివగళై, ఆదిచనల్లూర్‌లలో జరిగిన పురావస్తు తవ్వకాలలో బయల్పడిన ఇనుప వస్తువులు క్రీస్తుపూర్వం మూడవ, నాల్గవ సహస్రాబ్దాలకు చెందినవని ఆ పరీక్షల్లో నిర్ధారితమయింది.



సంగం యుగం నుంచి ఇనుపయుగం దాకా పురాతన అస్తిత్వ యశస్సుకై తమిళ స్వాభిమాన అన్వేషణ–అతి పురాతన వైభవానికి హిందూత్వ అన్వేషణను–ప్రతిబింబించడం ఆసక్తికరమైన విషయం. ద్రావిడ అభిజాత్యులు, హిందుత్వవాదులు ఇరువురూ ప్రాచీన యశస్సుకు ఎందుకు ఆరాటపడుతున్నారనేది స్పష్టమే.

తమిళ భూమికి లభించిన కొత్త కీర్తి కాంతుల గురించి తమిళనాడు పురావస్తు పరిశోధనల విభాగం 73 పేజీల మోనోగ్రాఫ్ నొకదాన్ని ప్రచురించింది. ఉత్తరప్రదేశ్‌లో ఇనుపయుగ ప్రదేశాలను కనుగొన్న రాకేష్ తివారీ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్)సహా పదిమంది పురావస్తు శాస్త్ర దిగ్గజాల అభినందన సందేశాలు ఆ పుస్తకంలో ఉన్నాయి. ఇతర స్వతంత్ర మదింపుల్లో ఆ మూడు పరీక్షల ఫలితాలు సరైనవని ధ్రువీకరణ అయితే మానవాళి ప్రాక్ చరిత్రను సరికొత్తగా రచించిన ఘనత తమిళనాడుకు సమకూరుతుంది. ప్రపంచానికి ఇంతవరకు తెలిసిన ఇనుపయుగ ప్రదేశాలు క్రీ.పూ. 2000 సంవత్సరానికి ముందువి కావు. తమిళనాడులో బయల్పడిన ఇనుప యుగ క్షేత్రాల కాలం క్రీ.పూ. 2953 – క్రీ.పూ.3345 సంవత్సరాల మధ్య నాటివి. తాజా ఆవిష్కరణలు ఇనుపయుగ ఆరంభం 5300 సంవత్సరాల క్రితానికి తీసుకువెళ్లాయి.

స్టాలిన్ అభివర్ణించినట్టు తమిళనాడు చరిత్ర అతి ప్రాచీనత నిర్ధారణతో డిఎంకె అనివార్యంగా తమిళ అస్తిత్వం, స్వాభిమానం, అగ్రగామిత్వం గురించి మాట్లాడే హక్కు పూర్తిగా తమదే అని ఘంటాపథంగా ఘోషిస్తుంది. 2014లో కీలడిలో పురావస్తు తవ్వకాలతో ప్రారంభమైన అన్వేషణలకు పరాకాష్ఠగా తమిళనాడులో ఇనుపయుగ ఆవిష్కరణ జరిగింది. నరేంద్రమోదీ ప్రధానమంత్రిత్వం ఆరంభమైన కాలంలోనే తమిళనాడులో ఎడతెగని పురావస్తు అన్వేషణలూ ఆరంభమవటం యాదృచ్ఛికమే. అప్పట్లో బీజేపీ అజెండాలో సరస్వతీ నది జాడను కనుగొనడానికి అగ్ర ప్రాధాన్యముండేది. హరప్పా నాగరికతను వేదకాలంతో ముడిపెట్టడం, తొలి హిందువుల 'ఇండిక్' మూలాలను ఆవిష్కరించడం ఆ అజెండా ప్రధాన లక్ష్యం.

ఉత్తరభారతావనిలోను, దక్షిణాపథాన స్పర్థాత్మక పురావస్తు పరిశోధనలతో కీలడి తవ్వకాల వ్యవహారం తొలుతనే ఒక కుట్ర సిద్ధాంతంలో చిక్కుకున్నది. 'ద్రావిడ నాగరికత' ఆవిష్కరణలను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నది ఆ సిద్ధాంత సారాంశం. కీలడి తవ్వకాలను పర్యవేక్షించిన అధికారిని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా బదిలీ చేయడంతో ఆ సిద్ధాంతానికి మరింత ఆసరా లభించింది. కీలడి తవ్వకాలకు సంబంధించి బదిలీ అయిన ఆ అధికారి రాసిన నివేదికపై నిర్ణయం తీసుకోవడంలో ఎఎస్ఐ ఉన్నతాధికారులు ఏ కారణాల వల్లో గానీ తీవ్ర జాప్యం చేశారు. తమిళుల చరిత్రలో సుప్రసిద్ధమైన సంగం యుగం కాలాన్ని అప్పటివరకు అందరూ అంగీకరిస్తున్నట్టు క్రీ.పూ.300 కాకుండా క్రీ.పూ.600గా ఆ నివేదిక నిర్ధారించిందని తమిళనాడులోని సామాన్య విద్యావంతులకూ తెలుసు. ఆ నివేదికను ప్రచురించాలని డిమాండ్ చేస్తూ అనేక ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కీలడి పురావస్తు తవ్వకాల ప్రదేశాన్ని తమిళనాడు పురావస్తు పరిశోధనల విభాగానికి అప్పగించాలని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. తమిళనాడు ప్రభుత్వం మరిన్ని తవ్వకాలు జరిపించడమే కాకుండా అక్కడొక మ్యూజియంను కూడా ఏర్పాటు చేసింది.

కీలడిలో కనుగొన్న వాస్తవాల కంటే ఈ ఇనుపయుగ ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యమున్నది. ఈ కొత్త ఆవిష్కరణల అంతస్సూచనలు ఏమిటనేది ఇంకా స్పష్టం కానప్పటికీ సింధులోయ నాగరికతకు ద్రావిడ నాగరికతతో అనుబంధమున్నదనే వాదనను బలపరిచేందుకు అవి విశేషంగా తోడ్పడుతున్నాయి. తమిళనాడు విద్యామంత్రి ఇదే విషయాన్ని నొక్కి చెప్పుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే సంస్కృతం కంటే తమిళ భాషే పురాతనమైనదని, ద్రావిడులు హరప్పా ప్రజల కంటే ముందువారని లేదా సమకాలికులు అని, కచ్చితంగా ఆర్యులకు పూర్వమే వారు ఈ గడ్డపై ఉన్నారని. విఖ్యాత విద్వజ్జులు ఇరావతం మహదేవన్, అస్కోపర్పోల పరిశోధనలు ఈ వాదనను పూర్తిగా బలపరుస్తున్నాయి. ఇప్పటికీ ఎవరూ చదవలేకపోతున్న సింధు లిపి తొలినాటి ద్రావిడ లిపికి అనురూపమైనదనే వాదనను కూడా వారి పరిశోధనలు దృఢపరుస్తున్నాయి.

ఈ ఇనుపయుగ ఆవిష్కరణను ప్రకటించడానికి కొన్ని రోజుల ముందు తమిళనాడు ప్రభుత్వం చెన్నైలో హరప్పా మొహంజొదారోల ఆవిష్కరణ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించింది. భారతీయ, అంతర్జాతీయ విద్వజ్జులు పాల్గొన్న సభలో సింధు లిపిని సంపూర్ణంగా చదివిన వారికి మిలియన్ డాలర్లను బహుమానంగా ఇస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సింధు నాగరికత ఆవిష్కరణ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మొట్టమొదటి డైరెక్టర్ జనరల్ సర్ జాన్ మార్షల్ విగ్రహ ప్రతిష్ఠాపనకు కూడా తమిళనాడు ప్రభుత్వం పూనుకున్నది. 'భారత ఉపఖండ చరిత్ర ఇంకెంత మాత్రం తమిళనాడును ఉపేక్షించలేదు. ఆ మహోజ్వల చరిత్ర ఇక్కడే (తమిళనాట) ప్రారంభమయింది' అని స్టాలిన్ ఆ సదస్సులో వక్కాణించారు.

సంగం యుగం నుంచి ఇనుపయుగం దాకా పురాతన అస్తిత్వ యశస్సుకై తమిళ స్వాభిమాన అన్వేషణ అతి పురాతన వైభవానికి హిందూత్వ అన్వేషణను ప్రతిబింబించడం ఒక ఆసక్తికరమైన విషయం. ద్రావిడ అభిజాత్యులు, హిందుత్వవాదులు ఇరువురూ ప్రాచీన యశస్సుకు ఎందుకు ఆరాటపడుతున్నారనేది స్పష్టమే. అయితే వర్తమాన సవాళ్లు సంక్లిష్టమైనవి, ముఖ్యంగా ఎన్నికల సమయాల్లో అవి మరింత క్లిష్టమవుతాయి.

• నిరుపమ సుబ్రమణియన్
(ది ట్రిబ్యూన్)





మరియతనయ.. మధుర హృదయ

- రెండోరోజూ ఘనంగా గుణదల తిరునాళ్లు
- కొండపై ఏసు శిలువ మార్గానికి పోటెత్తిన భక్తులు

గుణదల తిరునాళ్లు రెండోరోజు సోమవారం కూడా ఘనంగా జరిగాయి. కొండ కింద ప్రార్థనామందిరంతో పాటు గుహ ప్రాంగణం, కొండపైన శిలువ మార్గం భక్తులతో నిండిపోయాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న తిరుపతమ్మ ఆలయం(ఇన్‌సెట్‌లో) మైలవరంలోని గోపయ్య సమేత తిరుపతమ్మ ఉత్సవ మూర్తులు

తిరునాళ్ల శోభ

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సర్వంసిద్ధమైంది. మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి 9.32 గంటలకు గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. 8

విజయోస్తు..!

కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవ ప్రస్థానం

- వార్షిక టర్నోవర్ రూ.1,200 కోట్లు.. పాల సేకరణ 11 కోట్ల లీటర్లు
- 2 లక్షల మంది పాడి రైతులకు రోజువారీ ఆదాయం
- 4 వేల మందికి ఉపాధి.. 84 రకాల పాల ఉత్పత్తులు
- వీరవల్లిలో 'కామధేను' ప్రాజెక్టు అందుబాటులోకి..

8



చలసాని ఆంజనేయులు

వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేనులో ఎన్టీఆర్ పాల ప్రాంగణం

'విజయ డెయిరీ' ఇది పేరు కాదు. 60 ఏళ్ల కృష్ణామిల్క్ యూనియన్ కృషికి నిదర్శనం. 'పాల'కవర్గాల కష్టానికి ప్రతిఫలం. 1965లో స్థాపించిన ఈ యూనియన్ అంచెలంచెలుగా ఎదుగుతూ, ఎన్నో విజయాలను నమోదు చేస్తూ, జాతీయ స్థాయిలో మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదిగింది. 11 కోట్ల లీటర్ల పాల సేకరణతో పాటు రూ.1,200 కోట్ల టర్నోవర్‌తో ఈ యూనియన్ అంతులేని ఖ్యాతిని ఆర్జించింది. 2 లక్షల మంది పాడి రైతులకు జీవనాధారంగా, దక్షిణ భారతంలోనే 84 రకాల పాల ఆధారిత ఉత్పత్తులతో నెంబర్‌వన్‌గా, పాడి రైతులకు నాలుగు నెలలకోసారి బోనస్, సభ్యులకు లాభాల్లో వాటా, అనేక సంక్షేమ పథకాలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధితో దినదినప్రవర్థమానమవుతోంది. తాజాగా వీరవల్లిలో ప్రాజెక్టు 'కామధేను'తో మరింత ముందుకు వెళ్తూ వజ్రోత్సవ సంబరాలను జరుపుకొంటున్న కృష్ణా మిల్క్ యూనియన్ 'విజయ' ప్రస్థానంపై కథనం.

రీసర్వే చిచ్చు..!

గత ప్రభుత్వ జగనన్న రీసర్వేలో లోపాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న రీసర్వే పచ్చటి కుటుంబాలను ఛిద్రం చేస్తోంది. భూ కొలతల్లో తేడాలు వివాదాలను సృష్టిస్తున్నాయి. జిల్లాలో 3 వేలకు పైగా జగనన్న రీసర్వే అభ్యంతరాలు రాగా, అవి పరిష్కారానికి నోచుకోకపోగా, కొత్త వివాదాలకు కారణమవుతున్నాయి. మైలవరంలో శనివారం జరిగిన రైతు హత్య వెనుక జగనన్న రీసర్వే నిర్వాకాలే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ రీసర్వే సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించకపోతే మరిన్ని విపరీత పరిణామాలకు దారితీసే అవకాశముంది.

- పచ్చటి కుటుంబాల్లో కన్నీటి కల్లోలాలు
- జిల్లావ్యాప్తంగా 3 వేల అపరిష్కృత అర్జీలు
- నానాటికీ పెరుగుతున్న రైతుల వివాదాలు
- ములకలపెంటలో హత్య కూడా ఈ కోవలోనిదే..
- రెండు కుటుంబాల్లో నాడు మొదలైన వివాదం
- నేడు ఒకరిని హత్య చేసే వరకు..

మైలవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న రీసర్వే పుణ్యమా అని తలెత్తిన భూ వివాదం కారణంగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఓ కుటుంబం యజమానిని కోల్పోయింది. మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంట గ్రామంలో కడియం భాగ్యలక్ష్మికి, మొర్సుమల్లికి చెందిన చల్లా సుబ్బారావుకు పక్కపక్కనే పొలాలున్నాయి. 2003లో



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న శ్రీనివాసరావు బంధువులను వారిస్తున్న ఎస్సై సుధాకర్ (ఇన్‌సెట్‌లో) శ్రీనివాసరావు (ఫైల్)

ములకలపెంట గ్రామాన్ని జగనన్న రీ సర్వేలో ఆదర్శ గ్రామంగా తీసుకున్నారు. అప్పట్లో జరిగిన రీసర్వేలో చల్లా సుబ్బారావు పొలంలో కడియం భాగ్యలక్ష్మికి చెందిన 47 సెంట్లు ఉన్నట్లు తేల్చారు. దీంతో యజమానులిద్దరూ వారున్న పొజిషన్ భూమికి హద్దులు వేసి 47 సెంట్ల భూమికి మిగతా 8లో..



మెట్రోకు భూ సేకరణ

- 101 ఎకరాలు కావాలంటూ మెట్రో అధికారుల ప్రతిపాదనలు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లకు పంపిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్
- జిల్లాలో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం

8

ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం కేసు ముగ్గురు అరెస్టు

- 15 రోజుల పాటు రిమాండ్

PUBLIC NOTICE

BEFORE NATIONAL COMPANY LAW TRIBUNAL AMARAVATI IA NO.34 OF 2024 IN TCP NO.126 OF 2019

[NOTICE OF PETITION UNDER SECTION 59, 241 AND 242 OF THE COMPANIES ACT 2013 BEARING TCP NO.126 OF 2019]

IN THE MATTER OF:
CHALASANI UDAYA SHANKAR & ORS. ...PETITIONERS
VERSUS
M/S LEXUS TECHNOLOGIES AND ORS. ...RESPONDENTS

To
MR. APPA RAO MUKKAMALA (RESPONDENT NO.3)
NRI MEDICAL COLLEGE
CHINAKAKANI GUNTUR-522503
MR. SURESH ANNE (RESPONDENT NO.4)
NRI MEDICAL COLLEGE
CHINAKAKANI GUNTUR-522503

Whereas the above-named applicant has instituted a case against you and whereas it has been shown to the satisfaction of the Tribunal that it is not possible to serve you in ordinary way. Therefore, this notice is given by advertisement directing you to make appearance before the NCLT Amaravati on 05.03.2025. Any person desirous of supporting or opposing the said petition should send to the Petitioner's advocate and National Company Law Tribunal Amaravati, notice of his intention, signed by him or his advocate, with his name and address to furnish the copy of the application.

Date: 06.02.2025
Advocates for the Petitioners
Sri & Associates
B-1/6 Lower Ground Floor, Hauz Khas, New Delhi-110016
Mob: 9871643433,
Email: pbasrinivasan@yahoo.co.in

కృష్ణా మిల్క్ యూనియన్
DIAMOND JUBILEE CELEBRATIONS



విజయ 60 Years Since 1965

అపురూపం ఈ ప్రస్థానం .. అద్వితీయం ప్రగతి పథం

- రూ. 1200 కోట్ల వార్షిక టర్నోవర్.. 11 కోట్ల లీటర్ల పాల సేకరణ
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉత్పత్తుల విక్రయం
- రెండు లక్షల మంది పాడిరైతులకు రోజువారీ ఆదాయవనరు
- పాడి రైతుకు ధీమా, బీమా, సహకారానికి చిరునామా
- నాలుగు నెలలకోసారి బోనస్.. సభ్యులకు లాభాల పంపిణీ
- 4 వేల కుటుంబాల జీవనానికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- 84 రకాల ఉత్పత్తులతో దక్షిణభారతంలో నంబర్ వన్
- ప్రతి లీటరుపై రెండు రూపాయలు సభ్యుల సంక్షేమానికి వెచ్చింపు



చలసాని ఆంజనేయులు
చైర్మన్

"సాధించిన దానికి సంతృప్తిని చెంది.. అదే విజయమనుకుంటే పొరపాటోయి" అన్న కవి వాక్కులను శిరోధార్యంగా భావించి సమున్నత శిఖరాలపై మన సంస్థను నిలిపేందుకు మీ సహకారంతో నిరంతరం శ్రమిస్తూనే ఉంటాం. ఈ కృషి కొనసాగిస్తునే ఉంటాం. ఈ కర్తవ్య నిర్వహణలో సదా మీ ఆశీస్సులు ఆకాంక్షిస్తూ.. "

కృష్ణామిల్క్ యూనియన్
లక్షా యాభైవేల పాడి రైతు కుటుంబాల సంస్థ



కొల్లి ఈశ్వరబాబు
మేనేజింగ్ డైరెక్టర్




ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ సమిష్టి దివ్యపూజాబలి సమర్పణ, గుణదల లూర్దుమాత మహోత్సవాలకు హాజరైన భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేసిన పీఠాధిపతులు


ఆధ్యాత్మిక శిఖరం గుణదల పుణ్యక్షేత్రం

మరియమాత దర్శనానికి రెండోరోజు పోటెత్తిన భక్తులు



విద్యుత్ దీపాల వెలుగులో గుణదల లూర్దుమాత క్షేత్రం

గుణదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ప్రసిద్ధ క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో గుణదల లూర్దుమాత పుణ్యక్షేత్రం ఒకటి అని.. గుణదలమాతగా పేరొందిన క్రైస్తవ క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ అన్నారు. కొండ నడుమ సహజసిద్ధంగా వెలసిన గుహలో లూర్దుమాత స్వరూపం శిఖరాగ్రాన ఉన్న ఏసుక్రీస్తు శిలువను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఇక్కడ విశేషం అని ఆయన చెప్పారు. సోమవారం రెండోరోజు గుణదల మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఖమ్మం కతోలిక పీఠం బిషప్ సగిలి ప్రకాష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సందేశమిస్తూ సంతాన ప్రాప్తి కోసం మహిళలు కొండపైన మరియ మాతను దర్శించుకుని చెట్లకు ముడుపులు కడితే సంతాన ప్రాప్తి కలుగుతుందన్నారు. కతోలిక పుణ్యక్షేత్రం అయినప్పటికీ ఇక్కడ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల సమ్మేళనం స్పష్టంగా కనబడుతుందన్నారు. గుణదల లూర్దుమాత 101వ మహోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మరియమాత ఆశీర్వచనాలు మెండుగా అందాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. గుణదల పుణ్యక్షేత్రం వందేళ్లుగా భక్తుల కోర్కెలు తీర్చేతల్లిగా నీరాజనాలు అందుకుంటుందని తెలిపారు. గుణదలమాత పుణ్యక్షేత్రం స్వాతంత్ర్యం రాక పూర్వం నుంచే క్రైస్తవ మిషనరీలు తాడిత, పీడిత ప్రజలకు సేవలందిస్తూ ప్రజల విశ్వాసానికి దిక్సూచిగా నిలిచాయన్నారు. లోక కళ్యాణార్థం యేసుక్రీస్తు తన రక్తాన్ని చిందించారని తెలిపారు. సర్వేశ్వరుడు సదా మీతో ఉండుగాక ఆమెన్ అని భక్తులకు వివరించారు. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. గుణదల లూర్దుమాత తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై సగిలి ప్రకాష్, బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఏలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర డయాసిస్‌కు చెందిన గురువులు 100 మంది సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం బిషప్‌లు భక్తులకు పవిత్ర దివ్యసత్ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్ రాజు, డైరెక్టర్ కొలకాని మరియన్న, గురువులు గాబ్రియేలు, ఎం.చిన్నప్ప, జి.మైఖేల్, పల్లె జోజి బాబు తదితరులు పాల్గొన్నారు.



గుణదల లూర్దుమాత

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రెండోరోజు సోమవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. క్రైస్తవ భక్తిగీతాలు, సెయింట్ ఆన్స్ స్కూల్ నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నిరీక్షణ యాత్రికులు సాంస్కృతిక కార్యక్రమాలు.. కళాదర్శిని ప్రదర్శించిన దేవుని కరుణ నృత్యరూపకం, నెహ్రూ పేట విచారణ నుంచి సంసోను డెలీలా బుర్రకథ గుమ్మడి జయరాజు నాట్యమండలి ప్రదర్శించిన యేసు కృప నాటకం ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఏపీలో గత ఐదేళ్లలో 36 నైపుణ్యలోటు అధ్యయన కేంద్రాలు

» ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి జయంతి చౌదరి సమాధానం

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల కాలంలో పలు పరిశ్రమలకు నైపుణ్యలోటు అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత స్వతంత్ర సహాయ మంత్రి జయంతి చౌదరి తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్య లోటు అధ్యయనాలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఐదేళ్లకాలంలో 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేయగా, 2019 నుంచి ఆయా పరిశ్రమల అవసరాలను బట్టి కార్మిక వనరుల పరిశీలన, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలు, పరిశ్రమల అవసరాలను అంచనా వేయడం వంటి అంశాలపై అధ్యయనాలు జరిగాయన్నారు. తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, అమరావతి, చిత్తూరు, కోనసీమ, కృష్ణా, గుంటూరు, అనంతపురం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పలు పరిశ్రమలకు సంబంధించి అధ్యయనాలు జరిగాయన్నారు. 2024-25కు సంబంధించి నైపుణ్య అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను మరింత సమగ్రంగా అమలు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు.



హైదరాబాద్ వెళుతున్న బస్సుకు జెండా ఊపుతున్న టీడీపీ నేతలు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

» ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : 'వికసిత్ పంచాయత్' గ్రామాల అభివృద్ధి లక్ష్యంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నియోజకవర్గ పరిధిలోని 290 గ్రామాల అభివృద్ధికి రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 100 మంది యువతకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇప్పించే క్రమంలో తొలివిడతగా 33 మందిని ఎంపిక చేసి హైదరాబాద్‌కు పంపించారు. ఈనెల 16వరకు ఎన్ఐఆర్, డీపీఆర్‌లో వారం రోజులపాటు శిక్షణలో యువకులు పాల్గొననున్నారు. గురునానక్‌కాలనీలోని కార్యాలయం నుంచి బస్సును మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో గతేడాది నవంబరు 1న ఎంపీ శివనాథ్ స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కోసం ఒకరోజు శిక్షణ తీసుకున్నారని, వారి సహకారంతో రాష్ట్రంలోని గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని సంకల్పం చేస్తున్నారన్నారు. స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణకు వెళ్లే యువతకు కేశినేని ఫౌండేషన్ ద్వారా నెలకు రూ.10వేలు ఉపకార వేతనం అందించటంతో పాటు, వారం రోజుల శిక్షణకు అయ్యే ఖర్చు రూ.15లక్షలు ఎంపీ శిక్షణా సంస్థకు చెల్లించారని తెలిపారు. శిక్షణ పొందిన యువత రాబోయే కాలంలో వారి మండలాలలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో చంద్రబాబు ఆకాంక్షలను నెరవేరేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు.

పేదల బియ్యం దారి మళ్లితే కఠిన చర్యలు

» అవకతవకలకు తావులేకుండా నిరంతర తనిఖీలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్/మొగల్రాజపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. రేషన్ బియ్యం దారిమళ్లకుండా పటిష్ట నిఘా పెట్టామని పేర్కొన్నారు. భవానీపురంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యూసి) గోడౌన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. రైస్ ఏజ్ టెస్ట్‌ను పరిశీలించటంతో పాటు రికార్డులు, భౌతిక నిల్వలను సరిచూశారు. అనంతరం సీతారామపురంలోని డిపో 225 నెంబరు చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్స్, ఆన్‌లైన్ స్టాక్, సరుకు నాణ్యత, తదితరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీడీఎస్ బియ్యంలో సీఎంఆర్ బియ్యం కలవకుండా చూడటంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను పటిష్టం చేసినట్టు తెలిపారు. ప్రతి బఫర్ గోడౌన్‌ను తరచూ తనిఖీ చేస్తామని చెప్పారు. రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్యకలాపాలను అధికారులు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో 957 రేషన్ దుకాణాలున్నాయని, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి లోపాలుంటే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి నెలా 20, తహసీల్దార్లు నెలకు 5 రేషన్ దుకాణాలను తనిఖీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, పేదల ఆహార భద్రతకు భరోసా కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వో శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శతశాతం రెవెన్యూ అర్జీలు పక్కాగా పరిష్కరించాలి

» కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నమోదైన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) రెవెన్యూ అర్జీలతో పాటు రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 4,832 (96 శాతం) మేర పరిష్కారం పూర్తయిందని, మిగిలిన నాలుగు శాతం అర్జీలపైనా ప్రత్యేక దృష్టిపెట్టి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి రెవెన్యూ పిటీషన్‌ల పరిష్కారంపై ఆర్డీవోలు, తహసీల్దార్లు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పీజీఆర్ఎస్-రెవెన్యూ అర్జీల పరిష్కార పురోగతిని పరిశీలించారు. పెండింగ్ అర్జీలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నందిగామ డివిజన్‌కు సంబంధించి మొత్తం 2,022 అర్జీలు రాగా 1,931 అర్జీల పరిష్కారం పూర్తయిందన్నారు. అర్జీ అందుకున్నప్పుడే క్షుణంగా పరిశీలించి సంబంధిత క్షేత్రస్థాయి అధికారులతో నేరుగా లేదా వర్చువల్‌గా మాట్లాడి తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని, వివిధ శాఖల అధికారుల పటిష్ట సమన్వయం, సమర్థవంతమైన ఆడిటింగ్ చర్యలు వల్లే అర్జీల పరిష్కారంలో జిల్లా ముందంజలో వుందని, ఇకపైనా ఇదే విధమైన పనితీరుతో పెండింగ్ అర్జీలను పరిష్కరించి శతశాతం లక్ష్యాన్ని చేరుకొందామని పేర్కొన్నారు. నోడల్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని, ఏదైనా అర్జీ పరిష్కారంలో ఎదురయ్యే అడ్డంకులను పరిష్కరించేందుకు సమన్వయ శాఖల అధికార బృందాలు ఎప్పటికప్పుడు సమావేశమవ్వాలని ఆదేశించారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్), రీసర్వేకు సంబంధించిన పెండింగ్ అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులు రైతులతో మాట్లాడుతూ వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

నులి పురుగులు.. మానసిక వికాసానికి నిరోధకాలు

» కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగులు పిల్లలు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమవుతాయని, అందుకే అందరూ అల్బెండజోల్ మాత్రను తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని గవర్నరుపేట చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల శారీరక సమస్యలతో పాటు మానసిక ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇది చదువుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. సోమవారం 1-19 ఏళ్ల వయస్సు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని, ఇంకా ఎవరైనా తీసుకోకుండా ఉంటే వారికి ఈనెల 17న మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నులిపురుగుల నిర్మూలనతో పిల్లలకు ఆరోగ్యపరంగా బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. శుభ్రమైన నీటిని తాగడం, చేతులను ఎప్పుడూ శుభ్రంగా వుంచుకోవడం వంటి వాటిని కలెక్టర్ తెలియజెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని మాట్లాడుతూ, ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో గోడపత్రికల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించి విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. జల రవాణాపై వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం అధికారి, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

నగరంలో సందడి చేసిన నిధి అగర్వాల్!

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న 'హరిహరవీరమల్లు' చిత్రం ఫేమ్ హీరోయిన్ నిధి అగర్వాల్ సోమవారం నగరంలో సందడి చేశారు. సత్యనారాయణపురంలోని ఎన్నార్పీరోడ్డులో ఓ బంగారు ఆభరణాల షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమెను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా నటి నిధి మాట్లాడుతూ, విజయవాడ నగరం అంటే తనకెంతో ఇష్టం అన్నారు. ఉపముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌తో హరిహరవీరమల్లు చిత్రంలోని ఓ పాట త్వరలో విడుదల కానున్నట్టు తెలిపారు. రెబల్‌స్టార్ ప్రభాస్‌తో రాజా సాబ్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నట్టు చెప్పారు. ఒకేసారి ఇద్దరు పెద్ద హీరోలతో సినిమాలు చేసే అదృష్టం తనకు వచ్చిందని, రెండు సినిమాలను విజయవంతం చేయాలన్నారు.



16న జనసేన విస్తృత స్థాయి సమావేశం

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 16వ తేదీన మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. విజయవాడ గాంధీనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడారు. ఈ సమావేశానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, నాగబాబు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించే ప్లీనరీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సమావేశం అనంతరం అమలు చేస్తామన్నారు. కూటమి పార్టీల నేతల మధ్య ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి రాష్ట్రం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. కార్యకర్తల మధ్య అక్కడక్కడ అభిప్రాయ బేధాలు ఉంటే సరి చేస్తున్నామన్నారు. వైసీపీ నుంచి చాలా మంది జనసేనలోకి వస్తామని రాయబారాలు పంపుతున్నారన్నారు. ఆయా నియోజకవర్గాల నేతలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ పని తీరు ద్వారా దేశంలో ఏపీకి గుర్తింపు తెచ్చారన్నారు. సర్పంచ్‌లకు నిధులు ఇచ్చి వారికి ఒక గౌరవం తెచ్చారన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌లు, ఎంపిటీసీ, జడ్పీటీసీలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టి వారం వారం నిధులు కేటాయిస్తున్నారన్నారు. జనసేనను ప్రజలకు మరింత చేరువ చేసామన్నారు. ఆనాడు ప్రజారాజ్యం కోసం పని చేసిన వారు చాలా మంది జనసేనలోకి వచ్చారన్నారు. చిరంజీవి ఒక వేదికలో మాట్లాడిన మాటలను వక్రీకరిస్తున్నారన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	121,130, 141
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



పటమటలంక వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టీటీడీలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పటమటలంక నుంచి కూరగాయల లారీ పంపినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులు ఆనందోత్సాహంతో పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ప్రలోభాలకు లొంగి ఓట్లు వేయొద్దు

సబ్ కలెక్టర్ కావూరి చైతన్య

గుణదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతి పౌరుడు తన ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా భావించాలని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య సూచించారు జాతీయ ఓటరు దినోత్సవం 2025ను పురస్కరించుకుని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ,విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసే కార్యక్రమం సోమవారం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కావూరి చైతన్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగి ఓట్లు వేయకూడదని అన్నారు. యువతలో చైతన్యం తీసుకురావడానికి కలెక్టర్ చేసిన ఈ ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తుందని అన్నారు.

ఈ పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీబీ సిద్ధార్థ కళాశాల, దుర్గామల్లేశ్వర మహిళా కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని వారి వారి ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సబ్ కలెక్టర్ చైతన్య

ఉత్తమ హాస్య నాటికగా ఆవేశంలో ఆనందం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) :సుమధుర కళా నికేతన్ హాస్య నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా మల్లాది క్రియేషన్స్ (హైదరాబాద్) వారి ఆవేశంలో ఆనందం బహుమతి అందుకుంది. ప్రేక్షకులను ఆహ్లాదపరుస్తూ మూడు రోజుల పాటు పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన నాటికల పోటీల్లో విజేతలుగా ఈవీఎస్ కళాసమితి(విజయవాడ) వారి దంత వేదాంతం ద్వితీయ, భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ (విశాఖపట్నం) వారి దొందూ దొందే నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచాయి. మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ (చిలకలూరిపేట) వారి మా ఇంట్లో మహాభారతం, సహృదయ, ద్రోణాదుల వారి వర్క్‌ఫ్రం హోమ్ నాటికలు ప్రత్యేక జూరీ బహుమతులు పొందాయి. ఉత్తమ దర్శకుడుగా వాసుదేవ రావు (ప్రేమపిచ్చి), ఉత్తమ రచయితగా మల్లాది రవికిరణ్ (ఆవేశంలో ఆనందం), ఉత్తమ నటిగా లహరి (వర్క్ ఫ్రం హోమ్), ఉత్తమ నటుడిగా ఎ.అర్జున్ (ఆవేశం లో ఆనందం), ప్రోత్సాహక బహుమతులు పి.రమేష్‌బాబు (దంత వేదాంతం), కె.కుమారి (దొందూ దొందే), ఉత్తమ ఆహార్యం పి.శ్రీధర్ (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ సంగీతం సురభి ఎం.నాగరాజు (దంత వేదాంతం) బహుమతులు అందుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎస్కే మిశ్రో, సుబ్బరాయశర్మ, కోట శంకరరావు వ్యవహరించారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, డి.రామకోటేశ్వరరావు, కోనేటి సుబ్బరాజు (రంగస్థల నటులు), పి.మురళీకృష్ణ (జాషువా సాంస్కృతిక వేదిక), రావి వెంకటరావు (ఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), సామంతపూడి నరసరాజు (సుమధుర అధ్యక్షులు), పీవీ భాస్కరశర్మ (ప్రధాన కార్యదర్శి), డాక్టర్ ఎంసీ దాస్, డి.కైలాసరావు, పి.సూర్యనారాయణమూర్తి తదితరులు కళాకారులకు బహుమతులు అందించి అభినందించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న మల్లాది భాస్కర్

ఇమామ్, మౌజన్‌లకు జీతాలు విడుదల చేయండి

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఎనిమిది నెలల నుంచి ఇమామ్, మౌజన్‌లకు నిలిచిపోయిన జీతాలను విడుదల చేయాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ సద్రుద్దీన్ ఖురేషి అన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాలు, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫారూఖ్‌కు ఓ లేఖ రాశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన చేస్తూ గత 8 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు రాకపోవటంతోఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, యువనాయకుడు గద్దె క్రాంతికుమార్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలుపించుకుందామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, పీబీ సిద్ధార్థ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ఎస్ఎం పాఠశాల మైదానంలో ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాకర్స్‌తో మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయడం ద్వారా చంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, వీరంకి డాంగే కుమారి, గరికపాటి శ్రీనివాస్, వీరంకి సుబ్బారావు, కాకు మల్లికార్జునయాదవ్, మల్లెల రామకృష్ణ, దండమూడి సన్నిధి, షేక్ షరీఫ్, పార్టీ నాయకలు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

దాడులకు తెగబడితే రౌడీషీట్ తెరుస్తాం


సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్

గుణదల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న నగరంలో దాడులకు తెగబడితే అటువంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం ఖాయమని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. గుణదల లూర్దుమాత మహోత్సవాల ప్రారంభ రోజున ఆదివారం రాత్రి పుణ్యక్షేత్ర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతున్న సమయంలో కొంత మంది యువకులు ఆకతాయితనంగా మహిళలతో గొడవపెట్టుకుని అది చాలదన్నట్లుగా బ్లేడుతో దాడికి తెగబడ్డ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. బ్లేడుతో దాడికి తెగబడ్డ వారిలో సాయి అనే వ్యక్తిపై గతంలో నేరచరిత్ర ఉన్నట్లుగా గుర్తించామని, అతనిని అరెస్టు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నామని తెలిపారు. బ్లేడ్‌బ్యాచ్‌ల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే డ్రోన్ కెమెరాల సాయంతో శివారు ప్రాంతాలను జల్లెడపట్టడం జరుగుతుందని చెప్పారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేదంపై విస్తృతంగా చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం ఉదయం శాఖాధిపతులతో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి సర్కిల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని దానికనుగుణంగా వినియోగదారులను గుర్తించి వారితో ఒక సమావేశం నిర్వహించి 120 మైక్రాన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నగర పాలక సంస్థ నిషేధిస్తోందన్న విషయాన్ని తెలపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్ర శేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీకమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎస్ఈ పి. సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకట నారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, ఈఈలు, అసిస్టెంట్ కమిషనర్లు, సీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ : శైలజ	మచిలీపట్నం : సిరికాంప్లెక్స్
విజయవాడ : స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం : వరం PVR INOX
విజయవాడ : జి3 రాజ్ యువరాజ్	గుడివాడ : జి3 సింధూర
విజయవాడ : ఊర్వశి INOX	గుడ్లవల్లేరు : రామకృష్ణ
ఎంజిరోడ్ : లైలా INOX	ముదినేపల్లి : పూర్ణిమ
లబ్బీపేట : పివిపి సినీపోలీస్	కైకలూరు : జి3విజయలక్ష్మి
లబ్బీపేట : పివిఆర్‌సినిమాస్	బంటుమిల్లి : శ్రీదుర్గామహాల్
బెంజిసర్కిల్ : క్యాపిటల్ సినిమాస్	లక్ష్మీపురం : అంజన సినీమ్యాక్స్
పటమట : LEPL INOX	మానికొండ : వెంకటేశ్వర
అశోక్‌నగర్ : పవర్‌సినీపోలీస్	గన్నవరం : శాంతి
వన్‌టౌన్ : సౌమ్య	హనుమాన్‌జంక్షన్ : శ్రీకృష్ణాటాకీస్
భవానీపురం : స్వాతి	నూజివీడు : సత్యనారాయణ
పాయకాపురం : తారాస్క్రీన్స్	ఆగిరిపల్లి : అనుడీలక్స్
గుణదల : రామ్ సినిమాస్	ఇబ్రహీంపట్నం : స్వర్ణసినీమ్యాక్స్
కానూరు : శ్రీవిజయలక్ష్మి	కొండపల్లి : శివకృష్ణ
పోరంకి : శ్రీ వెంకటకృష్ణ	కంచికచర్ల : పివిఆర్ సినీప్లెక్స్
కంకిపాడు : శ్రీరామచంద్ర	నందిగామ : లక్ష్మీప్రసన్న
ఉయ్యూరు : జి3 శ్రీనివాస	జగ్గయ్యపేట : జి3 కమల
పామర్రు : శివరామ్	వత్సవాయి : వెంకటేశ్వర
కూచిపూడి : సత్యసాయి	మైలవరం : సంఘమిత్రకాంప్లెక్స్
చల్లపల్లి : సాగర్	తిరువూరు : న్యూప్యాలెస్
అవనిగడ్డ : వెంకటేశ్వర	చిన్ననందిపేట : శ్రీరామ్
కోడూరు : శ్రీలక్ష్మీటాకీస్	వీరులపాడు : శ్రీలక్ష్మీటాకీస్
పెడన : శ్రీకృష్ణతులసి	గంపలగూడెం : రామమోహన్
	ఏకొండూరు : వెంకటేశ్వర

G3 MOVIES LLP release

పీబీ సిద్ధార్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్ది పోటీ ప్రపంచానికి సంసిద్ధులు చేయాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను ఏర్పాటు చేశామని వక్తలు చెప్పారు. సోమవారం కళాశాల వెబినార్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో డేటాసైన్స్ అండ్ ఏఐ విభాగం హబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని సిద్ధార్థ అకాడమీ విద్యా సలహాదారులు డాక్టర్ ఎల్‌కే మోహన్‌రావు, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి రాజేంద్రప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కావూరి శ్రీధర్, డేటా సైన్స్ హెడ్ డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీ, పాల్గొన్నారు.

● **పోస్టర్ ఆవిష్కరణ**

పీబీ సిద్ధార్థ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 12న సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్న సింటిలా 6.0 కార్యక్రమం పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పీపీటీ, , క్విజ్, సైన్స్ మోడల్స్ వక్తృత్వం, సైన్స్ ట్రెజర్‌హంట్, సంగీత, నృత్య, ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫిజిక్స్ శాఖాధిపతి, సింటిలా సమన్వయకర్త డాక్టర్ టి.శ్రీనివాసకృష్ణ, భౌతికశాస్త్ర అధ్యాపకులు టి.పూజిత, డాక్టర్ ఎస్‌కె ముస్సరీన్, జె. పాండురంగారావు, ఎన్. రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను ప్రారంభిస్తున్న సిద్ధార్థ అకాడమీ విద్యా సలహాదారులు డాక్టర్ ఎల్‌కే మోహన్‌రావు తదితరులు

సీజ్ చేసిన వాహనాలను విడుదల చేయండి

కృష్ణా ఎస్పీని కోరిన ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

లబ్బీపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల సందర్భంగా సీజ్ చేసిన వాహనాలను విడుదల చేయాలని కోరుతూ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆర్.గంగాధర్‌ను మచిలీపట్నంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వాహనాల రికార్డును పరిశీలించి సక్రమంగా ఉంటే డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చి వాహనం విడుదల చేయాలని, గతంలో డీజీపీ ఉత్తర్వులు ఉన్నా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో అమలు కావటం లేదన్నారు. ఫిబ్రవరి 2న ఒక లారీపై 304 ఎ కింద కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌కు బెయిల్ మంజూరు చేసి లారీని విడుదల చేయలేదని ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించిన ఆయన డీఎస్పీకి ఫోన్ చేసి న్యాయమూర్తితో ఈ విషయంపై మాట్లాడి లారీని విడుదల చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఇటువంటి కేసుల్లో వాహనాల రికార్డులు పరిశీలించి విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా సంఘం అధ్యక్షులు నాగమోతు రాజా, మాజీ అధ్యక్షులు రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



ఎస్పీని కలిసిన అసోసియేషన్ సభ్యులు

సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు కేబీఎన్ విద్యార్థినులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో త్వరలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థినుల బృందం కృష్ణా యూనివర్సిటీ తరపున ఎంపికైందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థినులు బి.లోకేశ్వరి, వి.సుప్రియ, సి.హెచ్.ద్వారకేశ్వరి, టి.అరుణ, నాగదుర్గ, బి.సత్య, జి.మానస, ఎస్.కె.నాగూర్‌బి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అభినందించినట్లు పేర్కొన్నారు.



సౌత్ జోన్‌కు ఎంపికైన కేబీఎన్ కళాశాల క్రీడాకారిణులు

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

కృష్ణలంక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు. చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 1-19 ఏళ్ల చిన్నారులు, కిశోర బాలలు ప్రతి ఒక్కరూ అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.



విద్యార్థితో మాత్రలు మింగిస్తున్న ఆర్డీవో

ఎమ్మెల్సీ అభ్యర్థిగా 'అరిగల' నామినేషన్ దాఖలు

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు కలెక్టర్ ఆఫీసులో బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ అభ్యర్థి అరిగల శివరాంప్రసాద్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, గుంటూరు బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, నాగదాసు వీరమణింద్ర, సీడీ భగవాన్, రాయపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అరిగల శివరాం ప్రసాద్ (రాజా)

ఆర్టీసీ బస్సులో తండేల్ ప్రదర్శనపై విచారణకు ఆదేశం

బస్టేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో ఇటీవల విడుదలైన తండేల్ చిత్రం పైరసీ వీడియో ప్రదర్శించడంతో పలువురు ప్రయాణికులు ట్వీట్ ద్వారా ఆర్టీసీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ బస్సులో తండేల్ సినిమా వీడియో ప్రదర్శించటంపై విచారణ చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

WANTED

» ఇంటర్‌సిటీస్ కార్గో మూవర్స్ సంస్థలో బుకింగ్ చేయుటకు M/F, P/F టైమ్, 10th Pass/ Fail కావలెను. ఇంగ్లీష్ చదవడం, వ్రాయడం రావాలి. సంప్రదించండి. సెల్ : **7995367015, 9246417040**
AJB - 225624

» విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, నార్త్ ఇండియన్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డు. ఆకర్షణీయమైన జీతం. సెల్ : **7288885598**
AJB - 1338

» పోరంకి, శారదా క్యాటరింగ్‌లో పనిచేయుటకు క్యాటరింగ్‌లో అనుభవం కలిగిన భార్య, భర్తలు కావలెను. హోటల్ మేనేజ్‌మెంట్ చదివిన మేల్ కావలెను. సంప్ర: ✆ **9490994567, 91829 88388**
AJB- 225594

» కానూరులోని ప్రముఖ హాస్పిటల్‌కి పురుష సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గంటలు డ్యూటీ, జీతం 11,000 + PF + ESI. వయస్సు 50 సం.లలోపు ✆ **96408 42023, 73861 78618**
AJB- 225731

» Axis Max సంస్థలో P/F టైమ్‌గా పనిచేయుటకు రిటైర్డ్, VRS రియల్ ఎస్టేట్, బిజినెస్ మెన్, CA's & హౌస్ వైఫ్స్ కావలెను. వ: 35-65 సం.లు Q. ఇంటర్ + ✆ **98850 48306, 63048 75113**
AJB- 492

» విజయవాడ, మొగల్‌రాజపురం నందు 8 గంటలు ఇంటిలో పనులు చేయగల హిందూ లేడీ కుకింగ్ మరియు మాపింగ్ వర్కర్స్ కావలెను జీతం 10 వేలు. అనుభవం గల డ్రైవర్ జీతం 13 వేలు. 24 గం.లు పని చేయగల హిందూ లేడీ మరియు 12 గం.లు పనిచేయగల కేర్‌టేకర్ జీతం 15 వేలు. సంప్రదించండి: సెల్: **83417 15255, 93902 59994**
AJB- 225963

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: **83338 33368**
AJB -225787

CHANGE OF NAME

» **We POTLURI SOMNATH & POTLURI** ANUSHA Resident of D.No:59A-8/12-2, Plot No.105, SVKP Colony, Besides Funtimes Club, Patamata, Vijayawada, NTR District, Andhra Pradesh-520008. Are Parents of POTLURI aashrith (Old Name). We are changing our Son's name as POTLURI SRI AASHRITH. Here after his name is known as **POTLURI SRI AASHRITH (New Name).**
AJB-225790

REAL ESTATE

» కాజలో **CRDA & RERA** అప్రూవల్ కలిగిన వెంచర్‌లో ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి కలవు Bank Loan కలదు. Cell No: **9949113998.**
AJG-210357

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, వాట్లి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99054 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240





ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

విజయ ప్రస్థానానికి వజ్రోత్సవ శోభ

దేశంలోనే అత్యున్నత బ్రాండ్ 'విజయ' డెయిరీ

దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తూ పాడిరైతు ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న విజయ డెయిరీ (కృష్ణా మిల్క్ యూనియన్) వజ్రోత్సవాలను జరుపుకొంటోంది. మార్కెట్‌లో ఎన్నో ప్రైవేటు డెయిరీలతో పోటీని తట్టుకుని అగ్రస్థానంలో నిలబడటం ఒక ఎత్తయితే.. కోట్లాది రూపాయల వ్యయంతో అధునాతన పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీలను నిర్మించి నిర్ణీత సమయానికి ముందే ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తూ సహకార సంస్థల విభాగంలో మేటిగా నిలబడింది కృష్ణా మిల్క్ యూనియన్.

- ఆంధ్రజ్యోతి, చిట్టినగర్/హనుమాన్‌జంక్షన్‌రూరల్



మొఫ్పి(మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ) కేంద్ర ప్రభుత్వ గుర్తింపు బోర్డు.


చిట్టినగర్‌లోని పాల ఫ్యాక్టరీ

1965లో స్థాపించిన కృష్ణా మిల్క్ యూనియన్ నేటి వజ్రోత్సవ ప్రస్థానంలోకి అడుగు పెట్టడంలో పాడి రైతుల విజయమే అతి ముఖ్యమైంది. పాడిరైతు కుటుంబాలకు అండగా నిలబడుతూ కోట్లాది రూపాయలతో క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ లాంటి ప్రోత్సాహకాలను అందించటంతో పాటు ఆరోగ్యం కోసం హెల్త్‌కార్డులు, ఆరోగ్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. పాడి పరిశ్రమకు ప్రోత్సహించేందుకు పల్లెకు పోదాం.. పాడిని చూద్దాం, పాడిరైతు లాభాలను పెంచుదాం వంటి కార్యక్రమాలతో పాడిరైతులకు సేవలను మరింత విస్తృతం చేస్తున్నారు. పశువులకు బీమా సౌకర్యంతో పాటు ఇంటి వద్దే వైద్య సేవలందించేలా పశువైద్యవాహనాలను సమకూర్చారు. పశువులకు పచ్చగడ్డి అందుబాటులో వచ్చేలా నేపియర్ గడ్డి విత్తనాలు, దాణాను సబ్సిడీ ధరలపై రైతులకు అందిస్తున్నారు.

ఇదీ 'విజయ' సత్తా

పనిచేసి చూపిస్తామంటూ పాలసేకరణలో రోజుకు 10 లక్షల లీటర్లు మైలురాయి చేరడంతో పాటు పాలసేకరణ ధర రూ.2 నుంచి బోనస్‌తో కలిపి సుమారు రూ.92 చెల్లించడంతో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది కృష్ణామిల్క్ యూనియన్. అదే సమయంలో రూ.600 కోట్ల టర్నోవర్‌ను.. ఐదేళ్లలోనే రూ.1200 కోట్లకు చేర్చిన ఘనత పాలకవర్గానిదే. రూ.కోట్లాది వ్యయంతో విజయవాడలో 3వ బ్లాక్, వీరవల్లి వద్ద ప్రాజెక్ట్ కామధేను పాల ఫ్యాక్టరీ నిర్మించడంతో నిర్ణీత సమయానికి ముందే పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. గత సెప్టెంబరులో వరదల వల్ల విజయవాడ పాలఫ్యాక్టరీ 45 రోజులు మూతపడినా సకాలంలో పాల ఉత్పత్తులు అందించడం వీరవల్లి ఫ్యాక్టరీ వల్లే సాధ్యమైంది.

జాతీయ స్థాయి బ్రాండ్

మార్కెట్‌లో విజయ డెయిరీ పాలే కాకుండా అనేక పాల ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌ను శాసిస్తున్నాయనే చెప్పాలి. పాలు, పెరుగు, బటర్ మిల్క్ సరఫరాలో ఉన్నత స్థానంలో ఉంది. అలాగే మలాయి లడ్డూ, ఖర్జూరం కోవా, బటర్ బర్ఫీ, చాక్లెట్ బర్ఫీ, దూద్ పెడ వంటి స్వీట్లకు ఎంతో క్రేజుంది. నెయ్యి, బటర్ స్కిమ్ మిల్క్ పౌడర్, యూహెచ్ టీమిల్క్ వంటివి ప్రఖ్యాతి పొందాయి. యూహెచ్‌టీ పాలకు హైదరాబాద్, ముంబాయి, కోల్‌కతా, చెన్నై, పూణె, గోవాలలో విస్తృతమైన మార్కెట్ ఉంది.

- 2 లక్షల మంది పాడి రైతులు
- రూ.1200 కోట్ల టర్నోవర్
- 11 కోట్ల లీటర్ల పాల సేకరణ
- 4 వేల మందికి ఉపాధి
- అధునాతన ప్రాజెక్టులు
- సంక్షేమ పథకాలు, అధిక పాలసేకరణ ధరతో లాభాలు

సవాళ్లకు ఎదురేగి..

సవాళ్లను ఎదుర్కొని అగ్రపథానికి పయనించిన కృష్ణామిల్క్ యూనియన్, గత వైసీపీ ప్రభుత్వంలో రూ పాయి గ్రాంటు ఇవ్వకపోయినా, మార్కెట్‌లో అమూల్ వంటి కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ గ్రామస్థాయి వరకూ సహకారమందించినా కృష్ణా మిల్క్ యూనియన్ నిలదొక్కుకుంది. అదే సహకారం స్థానిక కృష్ణామిల్క్ యూనియన్‌కు అందిస్తే మరోలా విజయాన్ని చేరకుంటారనేది వాస్తవం.

పశు సంరక్షణకు కంకణం

విజయ డెయిరీ పాడి పరిశ్రమాభివృద్ధికి దోహదపడుతోంది. పాడికి పరిశ్రమ హోదాను దృష్టిలో ఉంచుకుని పశువుల పెంపకాన్ని ప్రోత్సహించటం, రాయితీకి మంచి పుష్టికరమైన పశుదాణాను అందించటం, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, వెటర్నరీ డాక్టర్లచే శిబిరాల నిర్వహిస్తుంటుంది. పశువులకు పూర్తిస్థాయిలో బీమా కల్పిస్తున్న ఏకైక సంస్థ విజయానే. ఇవన్నీ ఒక ఎత్తయితే మేలు జాతి పశువులను ఉత్పత్తి చేసేందుకు నాణ్యమైన పశువీర్యాన్ని సేకరించి పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తోంది.

పాడి మీదనే మా కుటుంబ ఆధారం
అంబటి వీరాంజనేయులు, పాడిరైతు



15 ఏళ్లు నుంచి పశువులను సాకుతూ పాడిపైనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. గతంలో కంటే ఇప్పుడిస్తున్న పాలసేకరణధర సహాయకారిగా ఉంది. సంక్షేమ పథకాలు అందరికీ ఇవ్వడం ప్రోత్సాహకరం. పాలసేకరణ ధరను పెంచితే తమ లాంటి చిన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూత అందుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

విజయాకు పాలు పోయటం రెండోతరం
పానుకుమాటి కోటయ్య, పాడిరైతు



నా తండ్రి తరువాత రెండో తరమైన మేము కృష్ణామిల్క్ యూనియన్‌కు పాలు పోస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి చెల్లింపులతో ఆర్థికంగా అండగా ఉంటోంది. పశువుల కొనుగోలుకు సహకారం ఇస్తున్నారు. పాలసేకరణ ధర పెంచితే ఇంకా లాభమే. చైర్మన్‌ను కలిసి మా సాధకబాధకాలు చెప్పుకోగలుగుతున్నాం.

పాడిరైతే యజమాని
చైర్మన్ చలసాని ఆంజనేయులు



ఆరుగాలం శ్రమించి పాలను సేకరించే పాడిరైతు కష్టానికి తగిన ప్రతిఫలం చెల్లించేలా కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గం కృషి చేస్తోంది. పాలసేకరణ నుంచి కోట్లాది రూపాయల స్థిరాస్తులు (పాల ఫ్యాక్టరీ నిర్మించడం) ఏర్పాటులో పాడిరైతుల సహకారం మరువలేనిది. పాలకవర్గం, పాడిరైతుల సమన్వయంతోనే ఆటుపోట్లను తట్టుకుని కృష్ణామిల్క్ యూనియన్ లాభాల బాటలో పయనిస్తోంది. దీనికి ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నా.

'విజయ'ను నిలబెట్టిన అంశాలు

దేశంలోనే మిల్క్ డెయిరీల రంగంలో శరవేగంగా విస్తరిస్తున్న వాటిలో విజయ ముందు వరసలో ఉంది. విజయ డెయిరీని నిలబెట్టిన అంశాలేమిటన్నది పరిశీలిస్తే.. విజయ డెయిరీ కార్యకలాపాలు ప్రతి రైతుకు తెలియటం ప్రధానమైన అంశం. పాడి రైతులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. చెల్లింపుల్లో జాప్యం జరగదు. రైతుల నుంచి సేకరిస్తున్న పాలలో ఎంత ఫ్యాట్ ఉంది, ఇతర కాంపోనెంట్స్ ఎంత శాతం ఉన్నాయన్న దానిపై పాడి రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వెళుతుంటాయి. ఇలాంటి వ్యవస్థను మిగిలిన డెయిరీలలో చూడటం కష్టం.


సోమవారం విజయవాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టి.లక్ష్మీనారాయణ. వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు

'బనకచర్ల' ఆలోచన మానండి

- బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు సమర్థ వాదనలు వినిపించండి
- గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానం చేపట్టండి
- కృష్ణా బోర్డు ఆఫీసు కర్నూలులో పెట్టాలి రాష్ట్రప్రభుత్వానికి అధ్యయన వేదిక
- సీమ సాగునీటి సాధన సమితి సూచన

అమరావతి/విజయవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల వాటాలపై పునఃసమీక్ష చేస్తున్న బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ముందు రాష్ట్ర హక్కులపై సమగ్ర, సమర్థ వాదనలు వినిపించాలని రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక, రాయలసీమ సాగునీటి సాధన సమితి సంయుక్తంగా డిమాండ్ చేశాయి. గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకాన్ని విరమించుకుని, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానాన్ని (పోలవరం-సోమశిల) చేపట్టాలని తీర్మానించాయి. సోమవారం విజయవాడలో రాష్ట్ర రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్ అధ్యక్షతన కృష్ణా జలాలపై చర్చ జరిగింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ట్రైబ్యునల్ ముందు ఈ నెల 19-21 తేదీల్లో జరుగనున్న విచారణలో.. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేలా, కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షించేలా బలమైన వాదనలు వినిపించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై ఆధారపడి గడచిన మూడున్నర దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టులకు 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని తీర్మానించారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవా అనుసంధాన పథకాన్ని కూడా విరమించుకోవాలని స్పష్టంచేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూలుకు సత్వరమే తరలించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని డిమాండ్ చేశారు. నదుల అనుసంధానం విషయంలో ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న ఆలోచనల వల్ల రాయలసీమకు అన్యాయం జరుగుతుందన్నారు. సమగ్ర సాగునీటి విధానంలో భాగంగా మొదట తుంగభద్ర, కృష్ణా జలాల సద్వినియోగంతో ప్రాజెక్టుల నీటి హక్కుల పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధాన పథకాన్ని గొల్లపల్లి రిజర్వాయర్ వరకు నిర్మించాలని.. అక్కడి నుంచి సోమశిల మీదుగా పెన్నాకు అనుసంధానించాలని ప్రతిపాదించారు. బనకచర్లకు గోదావరి అనుసంధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇరిగేషన్ రంగ ప్రముఖులు, ఇంజనీర్లు కూడా తమ అభిప్రాయాలను సమర్థించారని తెలిపారు. గోదావరి-బనకచర్ల వల్ల ఎగువ రాష్ట్రాలు వాటా అడిగే ప్రమాదం ఉందని, కనుక కూటమి ప్రభుత్వం దానిని విరమించుకోవాలన్నారు. ఈ అంశాలపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని భవానీప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్ఆర్ జోన్-2 ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ.. అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్న తెలంగాణకు అడ్డుకట్ట వేయాలన్నారు. కాగా.. అసంబద్ధ వాదనలకు కేంద్రం తలొగ్గి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ గడువును పొడిగించి, జలాల పునఃసమీక్షపై విచారించాలని నిర్దేశించడం అత్యంత గర్హనీయమని సమావేశం పేర్కొంది. ఈ ట్రైబ్యునల్ 65 శాతం, 55 శాతం నీటి లభ్యత ప్రామాణికంగా లభించే మిగులు జలాలనూ అంచనా వేసి కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తూ తీర్పు ఇవ్వడంతో సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిందని గుర్తుచేసింది. ఈ తీర్పును కేంద్రం కూడా నోటిఫై చేయలేదని, దీంతో అది అమల్లోకి రాలేదని తెలిపింది. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణను సుప్రీంకోర్టు ద్వారా అడ్డుకోవాలని సూచించింది. సమర్థులైన న్యాయవాదులను నియమించుకుని.. పటిష్ఠ వాదనలు వినిపించాలని కోరింది.



విద్యుత్ దీపాలంకరణలో వెలిగిపోతున్న ఆలయం

నేటి నుంచి పెద్ద తిరునాళ్లు

తిరుపతమ్మ అమ్మవారి కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 నుంచి 15 వరకు జరగనున్నాయి. ప్రధానంగా మంగళవారం రాత్రి 9.32 గంటలకు శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా భారీ సెట్టింగులతో పెద్ద ఎత్తున మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే వేలాది మంది భక్తులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. మామిడి తోటలో సుమారు 27 వేల మంది దీక్షాస్వాములకు దాతల సాయంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులకు ఆలయానికి ఉత్తర వైపున ప్రత్యేక టెంట్స్‌ను ఏర్పాటు చేశారు. ఇరుముడులు సమర్పించే స్వాములకు గ్రామంలోని శివాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షాస్వాములు విడిది కోసం తిరుపతమ్మ ఆలయంతో పాటు గ్రామంలోని పలు దేవాలయాల వద్ద షామియానాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇరుముడులు సమర్పించేందుకు ఇచ్చిన దీక్షా స్వాములకు ఆర్యవైశ్యులు అల్పాహారం అందించారు. డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమా, తహసీల్దార్ శాంతి లక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



బొర్రగూడెంలో కల్యాణోత్సవాలు

మైలవరం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రగూడెంలో వేంచేసియున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు ఈవో ఎం.తేజ సోమవారం తెలిపారు. 11న రంగుల మహోత్సవం, 12న కల్యాణం, 13న యాదవ రాజులచే జలబిందె జరుగుతాయన్నారు. ఈ కల్యాణాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో వైభవంగా అలంకరించారు. అమ్మవారి తలంబ్రాలకు విశిష్టత ఉంది. సంతానం లేని వారు తలంబ్రాలు తీసుకుంటే పిల్లలు పుడతారని భక్తులు ఎంతగానో విశ్వసిస్తారు.

వరప్రదాయని వీరమ్మ తల్లి

తిరునాళ్లకు భారీగా తరలివచ్చిన భక్తులు


మొక్కుబడి తీర్చుకునేందుకు వెళుతున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. తిరునాళ్లలో 3వ రోజైన సోమవారం వేకువజాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కన్పించింది. చీర, సారె, పసుపుకుంకుమలు, గొర్రె, పొట్టేళ్లతో డప్పువాయిద్యాల నడుమ తరలివచ్చి, ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు తయారుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచి క్యూలైన్లలో నిలుచుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు సంస్థలు, వ్యక్తులు ప్రసాదం పంపిణీ చేశారు.

రీసర్వే చిచ్చు..!

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఎల్‌పీఎం నెంబరు ఇచ్చి అనుభవదారుడిగా చల్లా సుబ్బారావు, పట్టాదారుడిగా భాగ్యలక్ష్మిని చూపారు. ఎన్డీఏ ప్రభుత్వం రాగానే జగనన్న రీసర్వే గ్రామాల్లో మళ్లీ సర్వే చేపట్టేందుకు ప్రత్యేక రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే అందులో భాగ్యలక్ష్మి భర్త శ్రీనివాసరావు అర్జీ పెట్టుకున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు రీవెరిఫికేషన్ చేశారు. 'చల్లా సుబ్బారావు రెస్పాండ్ కావడం లేదు. మీరు ఆర్డీవో కోర్టులో అర్జీ పెట్టుకోండి.' అని శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. ఇక్కడే భాగ్యలక్ష్మి భర్తకు, చల్లా సుబ్బారావుకు మధ్య వివాదం రేగింది. ఈ నేపథ్యంలో శనివారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన శ్రీనివాసరావు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాసరావును గమనించగా, శరీరంపై గాయాలు కనిపించాయి.

జాతీయ రహదారి దిగ్బంధం

మృతుడు శ్రీనివాసరావుపై గాయాలను గమనించాక స్థానికులు దీనిని హత్యగా భావించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరావు మృతదేహాన్ని మైలవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, శ్రీనివాసరావును పథకం ప్రకారం హత్య చేశారని, వెంటనే నిందితులను అరెస్టు చేయాలని సోమవారం ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌ఘడ్ 30వ నెంబరు జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించి నిరసన తెలిపారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్‌లు అక్కడకు చేరుకుని.. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చల్లా సుబ్బారావు ఇంట్లో పనిమనిషి అయిన వడ్లమూడి సంసోన్‌ను ఏ1 ముద్దాయిగా, చల్లా సుబ్బారావును ఏ2గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి

నా భర్తను హత్య చేసిన నిందితులను తక్షణం అరెస్టు చేసి మాకు న్యాయం చేయండి. పథకం ప్రకారమే నా భర్తను చంపేశారు. కుటుంబం దిక్కు లేనిదైంది. ఇప్పటి వరకు అరెస్టు చేయలేదు. ఉన్నతాధికారులు కలగజేసుకోవాలి. **- భాగ్యలక్ష్మి, మృతుడి భార్య**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన


శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికపై బోర్డు సభ్యుల పేర్లు

వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో పలువురు కార్యనిర్వాహణ అధికారులు రాష్ట్రంలో ఇంకా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందనే భ్రమలో ఉన్నట్టున్నారు. ఆ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యులకు అధికారులు రాచమర్యాదలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం లో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈవో నాగం సన్యాసిరావు, వన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరగనున్న స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈవో నటరాజన్ షణ్ముగం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఆహ్వాన పత్రికపై ట్రస్ట్ బోర్డు చైర్మన్, ధర్మకర్తల పేర్లను ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. చైర్మన్లు, ధర్మకర్తలు చెప్పినట్టు అధికారులు వ్యవహరించటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు ఉన్నాయని తెలిసినా అధికారులు ఎలా చైర్మన్లు, ధర్మకర్తల పేర్లు ముద్రిస్తారని ప్రశ్నిస్తున్నారు.


ఆహ్వాన పత్రిక పై ఆలయ బోర్డు సభ్యుల పేర్లు ముద్రణ

ఇంజనీరింగ్ విద్యార్థిని అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్ట్

కంచికచర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను కంచికచర్ల పోలీసులు అరెస్టు చేశారు. ఒక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న తిరువూరుకు చెందిన ఒక యువతి జనవరి 12న అత్యాచారానికి గురైన సంగతి విదితమే. ప్రేమ పేరు తో వంచించి అత్యాచారంతో పాటుగా వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితరాలు ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిందితులైన షేక్ గాలి షాహిద్ (సిద్దూ), షేక్ హుస్సేన్ (పీసు), చింతల ప్రభుకుమార్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం రాత్రి 8 గంటల సమయంలో ముగ్గురు నిందితులను నందిగామ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, 15 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు చెప్పారు.



మెట్రోకు భూ సేకరణ



- 101 ఎకరాలు కావాలంటూ మెట్రో అధికారుల ప్రతిపాదనలు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లకు పంపిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్
- ఎన్టీఆర్ జిల్లాలో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మెట్రో రైల్ ప్రాజెక్టుకు అవసరమైన భూముల కోసం ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు భూ ప్రతిపాదనలను అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చేపట్టే ప్రతిష్ఠాత్మకమైన విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు 101 ఎకరాల భూములు అవసరమని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు రెండు జిల్లాల కలెక్టర్లకు నివేదించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ భూములు అప్పగించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఇప్పటికే సమావేశం నిర్వహించగా.. కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టు రెండు జిల్లాల్లో విస్తరించి ఉంది. తొలిదశలో గన్నవరం బస్టేషన్ నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా విజయవాడ విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ తిరిగి మళ్లీ ఎన్ హెచ్ - 16 మీదుగా రామవరప్పాడు రింగ్ వరకు అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-1, పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-2 , పీఎన్‌బీఎస్ నుంచి అమరావతి రాజధానిలో లింగాయపాలెం వరకు కారిడార్-3, జక్కంపూడి నుంచి పీఎన్‌బీఎస్ వరకు రెండు వరసలలో కారిడార్-4, 5 ను ప్రతిపాదించారు. తొలిదశలో గన్నవరం - పీఎన్‌బీఎస్ (వయా ఏలూరు రోడ్డు), పెనమలూరు సెంటర్ - పీఎన్‌బీఎస్ (వయా బందరు రోడ్డు) కారిడార్లను మాత్రమే ప్రతిపాదించారు. తొలిదశలో చేపట్టే వాటికి మాత్రమే భూ ప్రతిపాదనలు అందజేశారు. రెండు జిల్లాల్లో కృష్ణాజిల్లాలోనే ఎక్కువగా భూములను సేకరించాలి. ఎన్టీఆర్ జిల్లాలో తక్కువ సేకరించాల్సి ఉంది. కృష్ణాజిల్లాలోని గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ప్రధానంగా మెట్రో కోచ్ డిపోను ఏర్పాటు చేయటానికి నిర్ణయించారు. దాదాపుగా 50 ఎకరాల వరకు అవసరమని మెట్రో అధికారులు నివేదించారు.

భూ ప్రతిపాదనలు ఇలా..

విజయవాడ అర్బన్ పరిధిలో పటమటలో 3219.48 చదరపు గజాలు, మొగల్రాజపురం పరిధిలో 2857.64 చదరపు గజాలు, మాచవరం పరిధిలో 1990.22 చదరపు గజాలు, గుణదల పరిధిలో 4455.19 చదరపు గజాలు, విజయవాడ టౌన్ పోర్షన్‌లో 6055.43 చదరపు గజాలు, విజయవాడ గ్రామీణం పరిధిలో 1424.36 చదరపు గజాల చొప్పున ప్రతిపాదించారు. ప్రసాదంపాడు గ్రామంలో 2112.87 చదరపు గజాలు, నిడమానూరు గ్రామంలో 835.92 చదరపు గజాలు, ఎనికేపాడులో 3272.55 చదరపు గజాల చొప్పున భూ సేకరణలకు ప్రతిపాదించటం జరిగింది.

కలెక్టర్ లక్ష్మీశ సమావేశం

విజయవాడలో మెట్రో స్టేషన్లకు సంబంధించి భూముల సేకరణకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ ఎన్‌వీ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. మొత్తం 48 చోట్ల మెట్రో స్టేషన్లకు భూ సేకరణ చేయాల్సి ఉంది.

చక్కెర చేటు

లేబుళ్లు - మతలబులు

సూపర్‌మార్కెట్లలో ప్యాకెట్లలో దొరికే పదార్థాలు, పానీయాలు మన బరువును తగ్గించే ప్రయత్నంలో ఉన్న భ్రమకు లోను చేసే లేబుళ్లను కలిగి ఉంటాయి. మరీ ముఖ్యంగా వాటిలోని చక్కెర మోతాదులను తెలపడం కోసం చిత్రమైన పదాలను ఉపయోగిస్తూ ఆకట్టుకునే ప్రయత్నం కూడా చేస్తూ ఉంటాయి. కాబట్టి ఆ పదాల అసలు అర్థాలను తెలుసుకోవడం ఎంతో అవసరం.

చక్కెర మోతాదులు

కొన్ని ప్యాకెట్ల మీద చక్కెర మోతాదు 'ఫ్రీ' లేదా 'లో'గా ముద్రించి ఉంటుంది. అంటే ఆ ప్యాకెట్‌లో, ఉపయోగించవలసిన దాని కంటే తక్కువ చక్కెరను ఉపయోగించారు కాబట్టి మిగతా ఉత్పత్తులతో పోలిస్తే దాన్లో ఉన్న చక్కెర తక్కువని అర్థం.

షుగర్ ఫ్రీ

ఈ ఉత్పత్తుల్లో ఒక సర్వింగ్‌లో 0.5 గ్రాముల చక్కెర ఉంటుంది. ఆ చక్కెర సహజసిద్ధమైనదీ, జోడించినదీ అయి ఉండవచ్చు. ఫ్రీ ఆఫ్ షుగర్, షుగర్‌లెస్, నో షుగర్, జీరో షుగర్.. ఇవన్నీ ఇదే అర్థాన్ని కలిగి ఉంటాయి.

రెడ్యూస్డ్/లెస్ షుగర్

సాధారణ ఉత్పత్తులతో పోల్చితే దీన్లో కనీసం 25% తక్కువ చక్కెర ఉందని అర్థం.

నో యాడెడ్ షుగర్

శుద్ధి చేసే సమయంలో, లేదా ప్యాక్ చేసే సమయంలో చక్కెర లేదా చక్కెర కలిగి ఉన్న దినుసును జోడించలేదని అర్థం. సహజ చక్కెర కలిగిన పదార్థాల ప్యాకెట్ల మీద, లో క్యాలరీ స్వీటెనర్ లేదా షుగర్ సబ్‌స్టిట్యూట్ అని పేర్కొని ఉంటుంది.



చక్కెర లేకపోయినా...

ఉత్పత్తిలో చక్కెర లేదని పేర్కొన్నంతమాత్రాన అది ఆరోగ్యానికి మంచిదని భావించడం కూడా పొరపాటే! ఉదాహరణకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా తినే సిరీల్ ప్యాకెట్ మీద 'రెడ్యూస్డ్ షుగర్' లేదా 'లైట్లీ స్వీటెన్డ్' అని పేర్కొని ఉండవచ్చు. దాంతో మిగతా వాటికంటే ఇదే మెరుగైన ఉత్పత్తి అనే భావన కలుగుతుంది. నిజానికి కంపెనీలు, ప్రచారంలో భాగంగా, వాటి ఉత్పత్తుల్లో 30% తక్కువ చక్కెర వాడినట్టు పేర్కొంటూ ఉంటాయి. కానీ నిజానికి వాటిలోని చక్కెర మోతాదులు అంత కంటే ఎక్కువ కూడా ఉండవచ్చు.

మీకు తెలుసా?

జంక్ ఫుడ్ మీద మోజు ఎందుకు?

ఉదయం కంటే రాత్రివేళే మనసు జంక్ ఫుడ్ వైపు లాగుతూ ఉండడాన్ని మీరెప్పుడైనా గమనించారా? ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం!

ఉదయం నిద్ర లేవగానే మన రక్తంలోని చక్కెర మోతాదులు తక్కువగా ఉండి, వాటిని స్థిరీకరించడం కోసం శరీరం సమతులాహారాన్ని కోరుకుంటుంది. కాబట్టి శరీరం, చక్కెర లేదా కొవ్వులతో కూడిన ఆహారానికి బదులుగా మాంసకృత్తులు, సంక్లిష్టమైన పిండిపదార్థాలు కలిగిన సమతులాహారాన్ని కోరుకుంటుంది. నిద్రలో ఆకలిని తగ్గించే లెప్టిన్ హార్మోన్ మోతాదు పెరిగి, ఆకలిని ప్రేరేపించే గ్రెలిన్ మోతాదు తగ్గుతుంది. అలాగే నిద్రలో శరీరంలో నీటి శాతం కూడా తగ్గిపోతుంది. దాంతో ఉదయం నిద్ర లేవగానే శరీరంలో నీటి మోతాదును పెంచే పోషకభరిత ఆహారం వైపే మొగ్గు చూపుతూ ఉంటాం. అయితే రాత్రి వేళ రక్తంలో చక్కెర మోతాదులు తగ్గి లేదా భావోద్వేగాలు ప్రేరేపితమమై, జంక్ తినాలనే కోరిక పెరుగుతుంది. జంక్ ఫుడ్ మీదకు మనసు మళ్లకుండా చేయడంలో మన హార్మోన్లు ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఎప్పుడైతే రక్తంలో చక్కెర మోతాదులు అదుపు తప్పుతాయో, నిద్రలేమి, పోషకలోపాలు వేధిస్తాయో, భావోద్వేగాలు అదుపు తప్పి, హార్మోన్లు క్రమం తప్పి, ఆహారం మీద యావ పెరుగుతుంది. రక్తంలో చక్కెర మోతాదులు తగ్గితే, తక్షణ భర్తీ



కోసం శరీరం పరితపిస్తుంది. అలాంటి సందర్భాల్లో అత్యధిక క్యాలరీలతో కూడిన ఆహార పదార్థాలు, పానీయాల వైపు మనసు సాగుతుంది. అవి శీతల పానీయాలు కావచ్చు. లేదా చక్కెర కలిపిన టీ, కాఫీలూ కావచ్చు. సరిపడా నిద్ర లేనప్పుడు కూడా ఆకలి హార్మోన్ గ్రెలిన్ ఆకలిని విపరీతంగా పెంచేస్తుంది. సాధారణంగా ఉదయం వేళ ఈ హార్మోన్ మోతాదు తక్కువగానే ఉంటుంది. కానీ హార్మోన్ అసమతౌల్య సమస్య ఉన్నవాళ్లలో గ్రెలిన్ మోతాదు పెరిగి ఆకలి పెరుగుతుంది. ఆకలిని పెంచే పోషకలోపాలు, క్యాల్షియం, ప్రొటీన్ లోపాలకు సూచికలు. రాత్రి భోజనం తర్వాత తీపి తినాలనే కోరిక వేధిస్తుంటే, ఆ భోజనంలో సరిపడా పీచు, ప్రొటీన్, సంక్లిష్టమైన పిండిపదార్థాలు లేవని అర్థం. పాలిష్ పట్టిన బియ్యం, మైదాతో తయారైన పదార్థాలు, లేదా బంగాళాదుంపలతో రాత్రి భోజనాన్ని ముగిస్తే, రక్తంలో చక్కెర మోతాదులు అకస్మాత్తుగా పెరిగిపోయి, వెంటనే చక్కెర మోతాదులు అంతే వేగంగా పడిపోతాయి. ఈ పరిస్థితి కూడా తీపి పదార్థాల వైపు ఆకర్షిస్తుంది. ఆకలిని ప్రేరేపించి, మనసును జంక్ దారి పట్టించే పరిస్థితికి దూరంగా ఉండాలంటే పోషకాలు సరిపడా ఉండే సమతులాహారాన్ని ఎంచుకోవాలి. కంటి నిండా నిద్ర పోవడం కూడా తప్పనిసరి.



కడుపులో మంటకు కారాలు, మసాలాలు కారణమనుకుంటాం! యాంటాసిడ్లతో ఉపశమనం పొందే ప్రయత్నం చేస్తాం! కానీ కడుపులో మంటతో వేధించే 90 శాతం అల్సర్లకు పొట్టలో తిష్ఠ వేసిన 'హెలికోబ్యాక్టర్ పైలోరి' అనే బ్యాక్టీరియా కారణమని మీకు తెలుసా? అంతిమంగా క్యాన్సర్‌కు సైతం దారితీసే వీలున్న ఈ పెప్టిక్ అల్సర్ గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

అల్సర్


పొట్టలో పుండు ప్రమాదమా?

పెళుసుబారిన ఎముకల దృఢత్వాన్ని పెంచే ఇంజెక్షన్లు వాడుకునేవాళ్లకు అల్సర్లు తలెత్తే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా హృద్రోగ మందులు వాడుకుంటున్న వాళ్లకు హెలికోబ్యాక్టర్ పైలోరి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు, పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

కడుపులో పుండు.. అంటే 'అల్సర్' అన్నవాహిక చివరి భాగం, జీర్ణాశయం, చిన్నపేగు మొదటి భాగం (డియోడినం)లో తలెత్తవచ్చు. ఈ మూడు భాగాల్లో దేన్లో అల్సర్ తలెత్తినా దాన్ని పెప్టిక్ అల్సర్ డిసీజ్‌గానే భావించాలి. వీటిలో మరీ ముఖ్యంగా జీర్ణకోశం, చిన్నపేగు మొదటి భాగంలో అల్సర్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. సాధారణంగా అల్సరుకు ముందు ఎసిడిటీ లక్షణాలు చాలా కాలం పాటు వేధిస్తాయి. ఛాతీలో మంట, పొట్టలో మంట మొదలైన లక్షణాలు తిన్న తర్వాత తలెత్తుతూ ఉంటాయి కాబట్టి అసలు కారణం ఆహారంలోనే ఉందని భ్రమపడుతూ ఉంటాం. నిజానికి కారాలు, మసాలాలు తినడం వల్ల కడుపులో పుండ్లు ఏర్పడవు. ఇది అపోహ మాత్రమే! ప్రసిద్ధ వైద్య శాస్త్రవేత్త, ఎల్లాప్రగడ సుబ్బారావు గారు, 1970లోనే ఈ విషయాన్ని శాస్త్రీయంగా నిరూపించారు. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. ప్రధానంగా పొట్టలో అల్సర్లు ఒక బ్యాక్టీరియా వల్ల ఏర్పడతాయి. అదే...'హెలికోబ్యాక్టర్ పైలోరి'. 1980 - 1981లో బ్యారీ మార్షల్ అనే వైద్యుడు ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వల్లే అల్సర్లు తలెత్తుతున్నట్టు కనిపెట్టాడు. పొట్టలో అల్సర్లకు 85%, చిన్నపేగు మొదటిభాగంలో అల్సర్లకు 90% ఈ బ్యాక్టీరియానే కారణం.

అంతా ఆ బ్యాక్టీరియా వల్లే...

కలుషితమైన ఆహారం, నీటి ద్వారా పొట్ట లోపలికి చేరుకునే ఈ బ్యాక్టీరియా, దీర్ఘకాలిక నివాసాన్ని ఏర్పరుచుకుని, ప్రారంభ దశల్లో పొట్టలో ఆమ్ల ఉత్పత్తిని పెంచి, పొట్ట లోపల పూతకు కారణమవుతూ ఉంటుంది. వీటినే వైద్య పరిభాషలో... గ్యాస్ట్రిక్, డియోడనల్ ఎరోజన్స్ అంటారు. ఈ సమయంలో కడుపులో మంట, ఛాతీలో మంట, కడుపు ఖాళీగా ఉన్నప్పుడు మంట, తిన్న తర్వాత మంట.. ఇలా భిన్నమైన లక్షణాలు మొదలవుతాయి. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో సమస్యకు అసలు కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, వైద్యులను కలవకుండా సొంత వైద్యంతో ఉపశమనాన్ని పొందే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయితే ఎసిడిటీ లక్షణాలను నివారించే



ఈ గ్యాస్ మందులు తక్షణ ఉపశమనాన్ని అందించగలుగుతాయి తప్ప, పొట్టలోని బ్యాక్టీరియాను చంపలేవు. కాబట్టి అసిడిటీ సమస్య మందులు వాడినప్పుడు తగ్గుతూ, మళ్లీ తిరగబడుతూ దీర్ఘకాలం పాటు వేధిస్తుంది. 'నాకు గ్యాస్ట్రిక్ సమస్య ఉంది' అనే భావనకు లోనయ్యే 90 శాతం మందిలో ఇదే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉంటుంది. ఈ సమస్య దీర్ఘకాలంలో అల్సర్‌కు దారి తీస్తుంది. అయితే ఈ బ్యాక్టీరియా పొట్టలోకి చేరిపోయిన ప్రతి ఒక్కరికీ అల్సర్ వచ్చేస్తుందని అనడానికి కూడా వీల్లేదు. అల్సర్లు, జన్యుపరంగా సంక్రమించవచ్చు. 'ఒ' రక్త గ్రూపు వ్యక్తుల్లో, పురుషుల్లో, ధూమపాన ప్రియుల్లో ఈ సమస్య ఎక్కువ. అలాగే నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వాడుకునేవాళ్లలో కూడా అల్సర్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. వయసు పెరిగేకొద్దీ గ్యాస్ట్రిక్ అల్సరు తలెత్తే అవకాశాలు కూడా పెరుగుతాయి.

అల్సరు వచ్చిన తర్వాత...

అల్సర్లకు ముందు ఎసిడిటీ లక్షణాలు వేధిస్తే, అల్సరు ఏర్పడిన తర్వాత కొత్తలక్షణాలు మొదలవుతాయి. అవేంటంటే...

పొట్టలో వస్తే...

- ఆహారం తీసుకున్న తర్వాత పొట్టలో నొప్పి
- వాంతి వస్తున్న భావన కలగడం

చిన్న పేగు మొదటి భాగంలో వస్తే...

- సమయానికి భోజనం చేయనప్పుడు కడుపులో నొప్పి
- మధ్య రాత్రి నొప్పితో నిద్ర మెలకువ అయిపోవడం
- పొట్ట పైభాగంలో నొప్పి ఉన్న ప్రదేశాన్ని వేలితో చూపించగలగడం

ఒకే ఒక పరీక్షతో...

పొట్టలో అల్సరు ఉన్నదీ, లేనిదీ, అల్సరు ఉన్న ప్రదేశంతో పాటు హెలికోబ్యాక్టర్ పైలోరి బ్యాక్టీరియా ఉన్నదీ, లేనిదీ కూడా ఎండోస్కోపీ పరీక్షతో తెలుసుకోవచ్చు. భారతదేశంలో ఎండోస్కోపీకి అయ్యే ఖర్చు మూడు నుంచి మూడున్నర వేలు ఉంటుంది. ఎంతో మంది ఈ ఒక్క పరీక్షతో సమస్యను నిర్ధారించుకోకుండా, సంవత్సరాల తరబడి నెలకు ఐదు నుంచి ఆరు వందల రూపాయలు యాంటాసిడ్ల కోసం ఖర్చు పెట్టేస్తూ, సమస్యతో బాధపడుతూనే ఉంటారు. కానీ ఎండోస్కోపీ పరీక్షతో సమస్యను నిర్ధారించుకుని చికిత్స తీసుకుంటే ఈ సమస్య నుంచి శాశ్వతంగా విముక్తి పొందవచ్చు.

ఈ యాంటాసిడ్లు సురక్షితం

తాత్కాలిక ఉపశమనం కోసం వరగడుపున వేసుకునే యాంటాసిడ్ మాత్ర, ద్రవరూపంలో ఉండే యాంటాసిడ్లు సురక్షితం. పది నుంచి పదిహేను రోజుల పాటు ఈ మాత్రను వాడుకోవచ్చు. కానీ ఇదే మాత్ర ప్రతి రోజూ సంవత్సరాల తరబడి వేసుకోవడం ప్రమాదకరం. యాంటాసిడ్ మాత్రలు పొట్ట లోపలి యాసిడ్ ఉత్పత్తిని బాగా తగ్గించేస్తాయి. వీటిని దీర్ఘకాలికంగా వాడుకోవడం వల్ల తినే ఆహారంలోని ఐరన్, క్యాల్షియం శోషణ చెందవు. దాంతో రక్తహీనత వేధిస్తుంది. ఎముకలు గుల్లబారిపోతాయి. కొంతమందిలో మూత్రపిండాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. పొట్టలోని ఆమ్లం పేగులకు రక్షణ కల్పిస్తుంది. వ్యాధికారక బ్యాక్టీరియా పేగుల్లోకి చేరుకోకుండా అడ్డుపడుతుంది. ఎప్పుడైతే యాంటాసిడ్లతో పొట్టలోని ఆమ్ల ఉత్పత్తిని అణచివేస్తామో, అప్పుడు పేగులకు ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు పెరుగుతాయి. న్యుమోనియా తలెత్తే అవకాశాలు కూడా పెరుగుతాయి.

సమస్య ముదిరిపోకుండా...

గ్యాస్ట్రిక్ అల్సర్‌ను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. హెలికోబ్యాక్టర్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా తలెత్తిన గ్యాస్ట్రిక్ అల్సర్, దీర్ఘకాలంలో గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌గా పరిణామం చెందే ప్రమాదం ఉంటుంది. అంతే కాకుండా గ్యాస్ట్రిక్ అల్సర్లు రక్తస్రావానికి కారణమై రక్తపు వాంతులు, రక్తపు విరోచనాలు లాంటి సమస్యలకు కూడా దారి తీస్తాయి. అలాగే చిన్నపేగు మొదటి భాగంలో తలెత్తే అల్సర్లను నిర్లక్ష్యం చేస్తే, రక్తస్రావం జరిగి, రక్తపు వాంతులు, రక్తపు విరోచనాలు వేధించవచ్చు. ఇలాంటప్పుడు అదే పనిగా యాంటాసిడ్లు వాడుకుంటే, చిన్న పేగు మొదటి భాగం ఇరుకుగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు డియోడినం లోపలి పొర చిరిగిపోయి అత్యవసర పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి ఎసిడిటీ రూపంలో బయల్పడే అల్సర్ ప్రారంభ దశను మొదట్లోనే గుర్తించి అప్రమత్తం కావాలి. రెండు నుంచి మూడు నెలలకు పైగా ఎసిడిటీ లక్షణాలు వేధించినా, రెండు నుంచి మూడు వారాలు మందులు వాడుకుని, వాటిని ఆపేసిన వెంటనే సమస్య తిరగబెడుతున్నా, ఎండోస్కోపీ పరీక్ష చేయించుకోవాలి. ఈ సమస్యకు వయసుతో సంబంధం లేదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ తలెత్తవచ్చు. ఏదో ఒక సందర్భంలో మనందరం బయటి ఆహారం తింటూ ఉంటాం. కాబట్టి నీటి ద్వారా, ఆహార పదార్థాల ద్వారా హెలికోబ్యాక్టర్ పైలోరి బ్యాక్టీరియా మన పొట్టలోకి చేరిపోతూ ఉంటుంది. ఒకట్రెండు రోజుల పాటు ఎసిడిటీ లక్షణాలు తలెత్తి తగ్గిపోతే భయపడవలసిన అవసరం లేదు. కానీ వారాల తరబడి తరచూ ఇబ్బంది పడుతున్నవాళ్లు తప్పనిసరిగా వైద్యులను కలిసి పరీక్ష చేయించుకోవాలి.

అల్సర్లు రాకుండా...

- బయటి ఆహారం మానేయాలి
- ఎసిడిటీ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు
- ఎంతో అరుదుగా తప్ప యాంటాసిడ్లు వాడుకోకూడదు
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- నొప్పి నివారణ మందుల వాడకం పరిమితం చేయాలి

14 రోజుల్లో బ్యాక్టీరియా హతం

హెలికోబ్యాక్టర్ పైలోరి కారక ఇన్‌ఫెక్షన్‌ను సమూలంగా అంతం చేయడం ఎంతో సులభం. ఎమాక్సిసిలిన్, క్లారిత్రోమైసిన్, ఒక ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్.. ఈ మూడు మాత్రల సమ్మేళనంతో, 14 రోజుల పాటు చికిత్స తీసుకుంటే, 95 శాతం మందిలో ఈ ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోతుంది. మిగతా ఐదు శాతం మందిలో యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ మూలంగా ఈ ఇన్‌ఫెక్షన్ అదుపులోకి రాకపోవచ్చు. ఉదాహరణకు హైదరాబాద్‌లో హెలికోబ్యాక్టర్ పైలోరి చికిత్సలో క్లారిత్రోమైసిన్ రెసిస్టెన్స్ కనిపిస్తోంది. వీరికి క్లారిత్రోమైసిన్‌కు బదులుగా, లీవోఫ్లాక్సాసిన్‌ను ఇవ్వవలసి ఉంటుంది. ఈ 14 రోజుల చికిత్సతో గ్యాస్ట్రిక్ అల్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌కు దారి తీయకుండా నివారించుకోవచ్చు.

సర్జరీ అరుదుగానే...

జీర్ణాశయంలో లేదా చిన్నపేగు మొదటి భాగంలో రక్తస్రావం జరుగుతూ ఉంటే, దాన్ని నియంత్రించడం కోసం సర్జరీ అవసరమవుతుంది. డియోడినంలో పుండు పడితే వెంటనే సర్జరీ చేయవలసి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పేగులోని కొంత భాగాన్ని తొలగించి, బైపాస్ సర్జరీ చేయవలసి రావచ్చు. డియోడినం ఇరుకుగా మారినప్పుడు కూడా సర్జరీ చేయవలసి రావచ్చు.

డాక్టర్ సోమశేఖర రావు
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్



అప్రమత్తం

స్మార్ట్ ఫోన్ విజన్ సిండ్రోమ్

మన పనులు, కాలక్షేపాలు స్మార్ట్‌ఫోన్లతోనే ముడిపడిపోవడంతో, దీర్ఘకాలం పాటు వాటిని వాడుకుంటూ ఉండడం వల్ల, స్మార్ట్ ఫోన్ విజన్ సిండ్రోమ్ సమస్య తలెత్తుతోంది. కళ్లను దెబ్బతీసే ఈ సమస్యను అరికట్టాలంటే..

ఎక్కువ సమయాల పాటు: పని కోసం, కాలక్షేపం కోసం, వినోదం కోసం ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోవడం మానేయాలి

కళ్లు ఆర్పడం: స్మార్ట్‌ఫోన్లను వాడుకుంటున్నప్పుడు కళ్లు ఆర్పడం 60 శాతం మేరకు తగ్గించేస్తూ ఉంటాం. దాంతో కళ్లు మంటలు, పొడిబారే సమస్యలు మొదలవుతాయి.

కళ్లకు దగ్గరగా: ఫోన్లను కళ్లకు మరీ దగ్గరగా పెట్టుకుని వాడుకోవడం వల్ల కంటి కండరాల మీద ఒత్తిడి పెరుగుతుంది.

సరిపడా వెలుగు: తక్కువ వెలుగులో ఫోన్లను వాడుకోవడం వల్ల కూడా కళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది.



లక్షణాలు ఇవే!

చూపు మసకబారడం: ఏకాగ్రతగా చూడలేకపోవడం

తలనొప్పి: కళ్లు అలసటకు గురవడంతో తరచూ తలనొప్పి వేధించడం

కళ్లు: కనురెప్పలు ఆర్పకపోవడం వల్ల కళ్లు పొడిబారడం

మెడ, భుజం నొప్పి: స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించేటప్పుడు సరైన శరీర భంగిమ పాటించడకపోవడం వల్ల మెడ, భుజం నొప్పులు వేధిస్తాయి

నిద్రలేమి: నీలి వెలుగుకు అవసరానికి మించి బహిర్గతం అవడం వల్ల శరీర జీవగడియారం క్రమం తప్పి, నిద్ర సమస్యలు వేధిస్తాయి

పరిష్కారాలున్నాయి

కృత్రిమ కన్నీళ్లు: ఇవి పొడిబారిన కళ్లకు తేమనిచ్చి, మంటను తగ్గిస్తాయి

బ్లూ లైట్ గ్లాసెస్: ఈ ప్రత్యేకమైన లెన్సులు నీలి రంగును వడగట్టి కళ్ల అలసటను నివారిస్తాయి

కంటి వ్యాయామాలు: ప్రతి 20 నిమిషాలకూ, 20 సెకన్ల పాటు, 20 అడుగుల దూరంలో ఉన్న ఒక వస్తువును చూడగలిగితే కంటి కండరాలు సేద తీరతాయి.

ఇన్‌ఫ్లమేషన్‌కు అడ్డుకట్ట ఇలా...

ఆరోగ్య రంగంలో తాజాగా 'ఇన్‌ఫ్లమేషన్' ప్రధాన అంశంగా మారిపోయింది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవడం కోసం ఎంతో మంది, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించడం మొదలుపెట్టారు. అయితే ఎలాంటి జాగ్రత్తలతో, ఆరోగ్య, ఆహార నియమాలతో ఇన్‌ఫ్లమేషన్‌ను అదుపులో పెట్టుకోవచ్చో ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్, రుజుత దివేకర్, సామాజిక మాధ్యమం ద్వారా ఇలా వివరిస్తున్నారు.

'నిజానికి ఇన్‌ఫ్లమేషన్ ఆరోగ్యాన్ని పూర్తి స్థాయిలో నష్టపరచదు. వ్యాధుల నుంచి కోలుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. అయితే దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ కచ్చితంగా ఆరోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. కాబట్టి సహజసిద్ధ శరీర ప్రతిస్పందన అయిన ఇన్‌ఫ్లమేషన్‌ను ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలో తెలుసుకోవడం అవసరం. శరీరానికి దెబ్బ తగిలినప్పుడు, ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు, లేదా ప్రమాదకరమైన ప్రేరకాలకు లోనైనప్పుడు శరీరం సహజసిద్ధ రక్షణ వ్యవస్థను ప్రేరేపించడంలో భాగంగా ఇన్‌ఫ్లమేషన్ చోటు చేసుకుంటుంది. శరీరం, దెబ్బతిన్న కణజాలాలను మరమ్మతు చేసుకోవడం కోసం, ఇన్‌ఫెక్షన్లతో పోరాడడం కోసం ఇన్‌ఫ్లమేషన్ అవసరం. అయితే అస్తవ్యస్థ ఆహారపుటలవాట్లు, ఎక్కువ సమయాల పాటు విశ్రాంతిలో గడిపే అలవాట్లు, నిద్రలేమి లాంటి కారణాల వల్ల ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమవుతుంది. ఇది దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆటోఇమ్యూన్ డిజార్డర్ లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. వంటింటి చిట్కాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించగలుగుతాయని చాలా మంది నమ్ముతూ ఉంటారు. ఆ క్రమంలో పసుపు నీళ్లు, డిటాక్స్ రసాలు తాగడం, పచ్చి కూరగాయలు తినడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే శరీర ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌కు ఏకైక చిట్కా లాంటిదంటూ ఏదీ ఉండదు. సమతులమైన, సుస్థిరమైన ప్రయత్నాలతోనే ఈ సమస్యను అదుపులోకి తెచ్చుకోగలుగుతాం!

ఆహారం మాయాజాలం కాదు

సూపర్‌ఫుడ్స్ అని చెప్పుకునే ఆహార పోకడలు ఇన్‌ఫ్లమేషన్‌ను సమూలంగా నయం చేయలేవు. ఫలానా ద్రవ, ఘన పదార్థంతో చిటికెలో ఇన్‌ఫ్లమేషన్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చు అనుకుంటే అది అపోహ మాత్రమే! నిజానికి కొన్ని పదార్థాలకు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం ఉన్నప్పటికీ, పరిపూర్ణ ఆహార నియమాల్లో భాగంగా వాటిని మన భోజనంలో జోడించుకోగలిగినప్పుడే వాటి ఫలాన్ని పొందగలుగుతాం! అలా కాకుండా పచ్చికూరగాయలు లేదా పండ్లు, కూరగాయల స్మూదీలనే ప్రధాన భోజనంగా తీసుకోవడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పూర్తిగా తగ్గిపోదు. బదులుగా పొట్టుతీయని, పాలిష్ పట్టని పదార్థాలతో సమతులమైన ఆహారం తీసుకోవాలి.



ఒత్తిడి వద్దు

ఆధునిక జీవనశైలులతో ఒత్తిడి మోతాదులు ఎక్కువైనప్పుడు కూడా ఇన్‌ఫ్లమేషన్ వేధిస్తుంది. కాబట్టి ఇతరుల గుర్తింపు, మెప్పు కోసం పరితపించడం మానేసి, స్వీయ సంరక్షణ, మానసిక శ్రేయస్సు మీద దృష్టి పెట్టాలి. ధ్యానం, ప్రాణాయామం, నచ్చిన అభిరుచులకు సమయాన్ని కేటాయించడం లాంటివాటితో ఒత్తిళ్లను సహజసిద్ధంగా తగ్గించుకోవాలి.

వ్యాయామం సరిపడా...

ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు వ్యాయామం తోడ్పడుతుంది. అయితే అవసరానికి మించి లేదా అవసరమైనదానికంటే తక్కువ వ్యాయామంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ సమయం పాటు కదలకుండా ఉండిపోయేవారిలో ఇన్‌ఫ్లమేషన్ పెరగడంతో పాటు, శరీరం శక్తిని ఖర్చు చేసుకోలేని మెటబాలిక్ సమస్యలు కూడా పెరుగుతాయి. అలాగే వ్యాయామం చేయడంతో పాటు శరీరానికి వ్యాయామం నుంచి కోలుకునే సమయాన్ని కూడా ఇవ్వాలి. లేదంటే శరీరం ఒత్తిడికి లోనై, ఇన్‌ఫ్లమేషన్ పెరిగిపోతుంది. కాబట్టి బరువులతో కూడిన స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, నడకలతో వ్యాయామ ప్రయోజనాలను పొందాలి.

నిద్ర కంటి నిండుగా..

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో నిద్ర ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే విషయాన్ని చాలా మంది పట్టించుకోరు. శరీరం కోలుకునే ప్రక్రియ నిద్రలోనే జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి మోతాదులను పెంచి, దాంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమై, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి నిద్రవేళలకు ఒక క్రమం పాటిస్తూ, నిద్రకు ముందు ఫోన్లు, టివిల వాడకాన్ని తగ్గించాలి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారం

ఇన్‌ఫ్లమేషన్‌కు విరుగుడు ఆహారంతో ప్రయోజనం ఉంటుంది. అయితే ఆ ఆహారం ప్రభావం... మెటబాలిజం (శరీరం శక్తిని ఖర్చుచేసుకునే వేగం), ఆహారపుటలవాట్లు, ఆహార మోతాదుల మీద ఆధారపడి ఉంటుంది. ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలన్నీ సమపాళ్లలో దక్కాలంటే భోజన ప్రణాళికను తయారుచేసుకోవాలి. సమతులాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, కంటి నిండా నిద్రపోతూ, మానసిక ఒత్తిడిని అదుపులో పెట్టుకున్నంత కాలం ఇన్‌ఫ్లమేషన్ మన దరి చేరకుండా ఉంటుంది.

క్వార్టర్స్‌లోనే గుకేష్ అవుట్

హాంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ కథ ముగిసింది. సోమవారం జరిగిన క్వార్టర్స్ రెండో గేమ్‌లోనూ కరువానా (అమెరికా) చేతిలో గుకేష్ పరాజయం పాలయ్యాడు. నల్లపావులతో ఆడిన గుకేష్ 18 ఎత్తుల్లోనే ఓటమిని అంగీకరించాడు. తొలి గేమ్‌లోనూ ఓడిన గుకేష్ 0-2తో సెమీస్‌కు అర్హత సాధించలేకపోయాడు. టైటిల్ రేస్ నుంచి నిష్క్రమించిన గుకేష్ చివరి నాలుగు స్థానాల కోసం పోటీపడనున్నాడు.

చెన్నైలో స్క్వాష్ ప్రపంచ కప్

చెన్నై: స్క్వాష్ ప్రపంచ కప్‌నకు చెన్నై నగరం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. పురుషులు, మహిళల విభాగాల ఈ మెగా టోర్నమెంట్ ఈ ఏడాది డిసెంబరు 9 నుంచి 14 వరకు జరగనుంది.

అప్పటి మా జట్టయితే.. మూడు రోజుల్లోనే..!

అర్జున రణతుంగ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై టెస్టుల్లో తిరుగులేని భారత్‌కు గతేడాది న్యూజిలాండ్ షాకిచ్చింది. పెద్దగా స్టార్ ఆటగాళ్లు కూడా లేని కివీస్.. టీమిండియాను 3-0తో ఓడించడం పెద్ద చర్చనీయాంశమే అయింది. అయితే, రోహిత్ శర్మ సారథ్యంలో ఇప్పటి భారత జట్టును.. 1996 వరల్డ్‌కప్ సాధించిన శ్రీలంక టీమ్ అలవోకగా ఓడిస్తుందని ఆ దేశ మాజీ కెప్టెన్ అర్జున్ రణతుంగ అన్నాడు. 'చమిందా వాస్, మురళీధరన్ లాంటి బౌలర్లున్న మా జట్టు ప్రస్తుత భారత్‌ను వారి సొంతగడ్డపై మూడు రోజుల్లోనే చిత్తు చేస్తుంద'ని రణతుంగ చెప్పాడు.

ఐర్లాండ్ హ్యాట్రిక్

ఏకైక టెస్ట్‌లో జింబాబ్వేపై గెలుపు

బులవాయో: జింబాబ్వేతో ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ 63 పరుగులతో గెలిచింది. తద్వారా వరుసగా మూడో టెస్ట్ విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. 2017లో ఐసీసీ పూర్తిస్థాయి సభ్యదేశంగా మారాక ఐర్లాండ్ ఆడిన మొదటి ఏడు టెస్టుల్లో ఓటమిపాలైంది. కానీ గత మార్చిలో అఫ్ఘానిస్థాన్‌పై నెగ్గిన ఆ జట్టు తదుపరి రెండు టెస్టుల్లో జింబాబ్వేని ఓడించింది. తాజా మ్యాచ్‌లో.. 292 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 183/7తో చివరిరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 228 రన్స్‌కు ఆలౌటైంది. హంఫ్రీస్ (6/57) ఆరు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 260, జింబాబ్వే 267 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 298 రన్స్ చేసింది.

లెఫ్ట్-రైట్ ఓకేనా?

రాహుల్, అక్షర్ స్థానాల మార్పుపై చర్చ



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా అదరగొడుతోంది. వరుసగా రెండు మ్యాచ్‌లను గెలుచుకుని ఇప్పటికే సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ఫలితం అదుర్స్ అనిపించినా.. ఈ రెండింట్లో కోచ్ గంభీర్ చేసిన ఓ ప్రయోగంపై మాత్రం ఆందోళన వ్యక్తమవుతోంది. వన్డేల్లో ఐదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగే కేఎల్ రాహుల్‌ను ఆర్డర్‌లో కిందికి దించి, ఆ స్థానంలో లెఫ్ట్ హ్యాండర్ అక్షర్ పటేల్‌ను ఆడిస్తుండడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఎందుకంటే.. ఈ ప్రయోగంతో స్పెషలిస్ట్ టాపార్డర్ బ్యాటర్ అయిన రాహుల్ రెండు మ్యాచ్‌ల్లో (2, 10)నూ విఫలమయ్యాడు. అటు స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ మాత్రం ఐదో నెంబర్‌లో 52, 41 (నాటౌట్) రన్స్‌తో అదరగొట్టాడు. కానీ ఈ చర్యతో సమర్థుడైన బ్యాటర్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారన్న భావన అంతటా వ్యక్తమవుతోంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి ముందు అతడికి మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండాపోవడాన్ని ఎలా చూస్తారని, రాహుల్ బ్యాటర్ అనే విషయాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ మర్చిపోతున్నట్టుందని విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు. రాహుల్ ఐదో స్థానంలో బరిలోకి దిగిన 30 మ్యాచ్‌ల్లో రెండు శతకాలు, 9 హాఫ్ సెంచరీలతో 1259 పరుగులు సాధించాడు. సగటు కూడా 60కి దగ్గరలో ఉండడం విశేషం. అంతెందుకు.. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో 11 మ్యాచ్‌లో తను 75.33 సగటుతో 452 పరుగులు సాధించాడు. అదే ఆరో స్థానంలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో చేసింది 42 పరుగులే కావడం గమనార్హం. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నా రాహుల్ ఎక్కడ ఆడితే బెటర్ అనే విషయం ఎవరికైనా అర్థమవుతుంది. అందుకే ప్రయోగాలు జట్టుకు లాభపడేలా ఉండాలి కానీ.. బ్యాటర్ ఫామ్‌ను దెబ్బతీసేలా ఉండకూడదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అసలు ఇలాంటి వ్యూహం ఎందుకని ప్రశ్నిస్తే.. మిడిలార్డర్‌లో ఓ ఎడమ చేతి బ్యాటర్ ఉండాలని జట్టు కోరుకుంటోందన్నది సమాధానం. అలా అయితే కుడి-ఎడమ కాంబినేషన్ ప్రత్యర్థి బౌలర్లను ఇబ్బంది పెడుతుందని, ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడం తేలికవుతుందని కోచ్, కెప్టెన్ భావిస్తున్నారు. అందుకే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అక్షర్‌ను ఐదో నెంబర్‌లో ఆడించారు. అయితే అతను సక్సెస్ అవుతున్నప్పటికీ.. రాహుల్ ఫామ్ కోల్పోతుండడం జట్టుకు ఏవిధంగా మేలు చేస్తుందనే విషయం కూడా ఆలోచించాల్సి ఉంటుంది. 'ఒకవేళ బ్యాటింగ్‌కు కష్టసాధ్యమైన పిచ్‌పై జట్టు 5 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు అక్షర్‌ను ఆడించే ధైర్యం చేయగలరా? అలాకాని పక్షంలో ఈ మతిలేని ప్రయోగం ఎందుకు?' అని మాజీ పేసర్ దొడ్డ గణేష్ సూటిగా ప్రశ్నించాడు.



పంత్ పరిస్థితేమిటి?

రాబోయే చాంపియన్స్ ట్రోఫీలోనూ జట్టు లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌తోనే వెళ్లనున్నట్టు స్పష్టమవుతోంది. దీన్ని బట్టి కేఎల్ రాహుల్ ఆరో స్థానానికే ఫిక్స్ అవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తుది జట్టులో చోటు లేక బెంచీకే పరిమితమైన రిషభ్ పంత్ పరిస్థితేమిటన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పుడున్న బ్యాటింగ్ కాంబినేషన్‌లో అతడికి జట్టులో చోటు కష్టమని మాజీ బ్యాటర్ ఒకరు తేల్చాడు. వ్యాఖ్యాత రవి శాస్త్రి కూడా 'జట్టు కూర్పు గురించి ఓసారి ఆలోచించాలి. పంత్‌లాంటి ఆటగాడిని బెంచీపై కూర్చోపెడితే ఎలా' అని ప్రశ్నించాడు. 2022 రోడ్డు ప్రమాదం తర్వాత పంత్ ఒక్క వన్డే మాత్రమే ఆడి ఆరు పరుగులు చేశాడు. అందుకే జట్టు కీపర్‌గా తొలి ప్రాధాన్యత అనుభవజ్ఞుడైన రాహుల్‌కే ఇస్తున్నారు. అటు రాహుల్ తనకు సరిపోని స్థానంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇదిలాగే కొనసాగితే కేఎల్‌ను పక్కకు తప్పించి ఫినిషింగ్ టచ్ ఇచ్చే పంత్‌ను ఆడించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ ఒత్తిడిలో రాహుల్ ప్రదర్శన ఎలా ఉంటుందో ముందు చూడాల్సిందే.



భారత్‌కు సవాల్

ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ నేటి నుంచి

సాత్విక్ జోడీ, లక్ష్య సేన్‌పై ఆశలు

క్వింగ్‌డావో (చైనా): ప్రతిష్ఠాత్మక ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో గతం కంటే మెరుగైన ప్రదర్శనపై భారత్ దృష్టిసారించింది. మంగళవారం నుంచి జరిగే టోర్నీలో ఈసారి భారత్ స్వర్ణంపై గురిపెట్టింది. అయితే, ఏస్ షట్లర్ పీవీ సింధు తొడ కండర గాయంతో చివరి నిమిషంలో టోర్నీకి దూరం కావడంతో.. ఈసారి మనకు కఠిన సవాలే ఎదురుకానుంది. రెండేళ్ల క్రితం దుబాయ్‌లో జరిగిన టోర్నీలో భారత జట్టు కాంస్యం సాధించడంలో సింధు కీలకపాత్ర పోషించింది. అయితే, ఇప్పుడామె తప్పుకోవడంతో.. మహిళల సింగిల్స్‌లో ఆ బాధ్యత వరల్డ్ నెం:29 మాళవిక బన్సోడ్‌పై పడింది. గ్రూప్-డిలో బుధవారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో మకావుతో భారత్ తలపడనుంది. నాకౌట్‌కు చేరాలంటే భారత్ అద్భుత ప్రదర్శన కనబర్చాల్సిన అవసరం ఉంది. ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటి వరకు పసిడి నెగ్గలేదు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీపై భారీ అంచనాలున్నాయి. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొంటుండగా..అశ్విని-తనీషా క్యాస్ట్రో జంట కూడా అప్పుడప్పుడు మెరుపులు మెరిపిస్తోంది. సతీష్ కరుణాకరన్-ఆద్య వరియత్ జోడీ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది.

ఫ్లడ్‌లైట్స్ ఎందుకు ఆగాయి?

ఒడిశా ప్రభుత్వం సీరియస్

కటక్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో ఫ్లడ్‌లైట్లు ఆగిపోవడంపై ఒడిశా ప్రభుత్వం చర్యలకు దిగింది. భారత్ ఇన్నింగ్స్ 6.1 ఓవర్లప్పుడు 35 నిమిషాలసేపు ఓ ఫ్లడ్‌లైట్ టవర్ మొరాయించడంతో ఆటగాళ్లంతా మైదానం వీడాల్సి వచ్చింది. ఈ ఇబ్బందికర పరిస్థితిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఒడిశా క్రికెట్ సంఘానికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆరేళ్ల తర్వాత ఇక్కడ అంతర్జాతీయ వన్డే మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజా వైఫల్యంతో ఇక్కడ మ్యాచ్ నిర్వహణకు బీసీసీఐ ముందుకు వస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు జనరేటర్‌లో సమస్య కారణంగా ఓ టవర్ లైట్లలో సమస్య వచ్చిందని, మరో జనరేటర్ తెచ్చి దాన్ని పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపాడు.



స్నేహిత్ బృందానికి కాంస్యం

200 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో జ్యోతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో స్నేహిత్ సారథ్యంలోని తెలంగాణ టేబుల్ టెన్నిస్ జట్టు కాంస్యం సాధించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం ముగిసిన టీమ్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో తెలంగాణ 0-3తో మహారాష్ట్ర చేతిలో ఓడింది. స్నేహిత్, అలీ, సంతోష్, మహ్మద్, స్వర్ణిందు బృందం కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 200 మీటర్ల హర్డిల్స్‌లో విశాఖపట్నం అమ్మాయి యర్రాజి జ్యోతి, 200 మీ. రేసులో హైదరాబాద్ అమ్మాయి నిత్య ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ జిమ్నాస్టులు నిషిక అగర్వాల్, సురభి ప్రసన్న, ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్ విభాగంలో ఆంధ్ర అమ్మాయిలు షేక్ యాసిన్, మోహన రూప ఫైనల్స్ చేరారు.

రాణించిన సూర్య, రహానె

రంజీ క్వార్టర్స్

కోల్‌కతా: సూర్యకుమార్ యాదవ్ (70), కెప్టెన్ అజింక్యా రహానె (88 బ్యాటింగ్) రాణించడంతో హరియాణాతో మ్యాచ్‌లో ఆటకు మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 278/4 స్కోరు చేసింది. మొత్తంగా ముంబై 292 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు శార్దూల్ ఠాకూర్ (6/58) దెబ్బకు ఓవర్‌నైట్ స్కోరు 263/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హరియాణా 301 పరుగులకు ఆలౌటైంది. ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరు 315కు 14 రన్స్ వెనుకబడింది.

ఉర్విల్, జైమీత్ శతకాలు.. గుజరాత్ 511 ఆలౌట్

ఉర్విల్ పటేల్ (140), జైమీత్ పటేల్ (103) శతకాల మోత మోగించడంతో.. సౌరాష్ట్రతో మ్యాచ్‌లో గుజరాత్ పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 260/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 511 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన సౌరాష్ట్ర మూడో రోజు ఆట ఆఖరుకు వికెట్ నష్టపోకుండా 33 పరుగులు చేసింది. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 216 రన్స్ సాధించింది.


పట్టుబిగించిన విదర్భ: విదర్భతో మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులకు కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 169/5 స్కోరు చేసింది. మొత్తంగా 297 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 353 పరుగులు చేసింది.

కేన్ సెంచరీ

- దక్షిణాఫ్రికాపై కివీస్ గెలుపు

లాహోర్: కేన్ విలియమ్సన్ (133 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో ముక్కోణపు వన్డే టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆరు వికెట్లతో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. తద్వారా టోర్నమెంట్ ఫైనల్‌కు కివీస్ అర్హత సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 304/6 స్కోరు చేసింది. అరంగేట్ర ఓపెనర్ మాథ్యూ బ్రీట్జ్కే (150) రికార్డు సెంచరీతో అదరగొట్టాడు. భారీ ఛేదనలో 48.4 ఓవర్లలో 308/4 స్కోరు చేసి న్యూజిలాండ్ విజయం సాధించింది. కాన్వే (97) తృటిలో శతకం మిస్సయ్యాడు.

బిజినెస్



భారత స్టీల్, అల్యూమినియంపైనా టారిఫ్‌లు

ప్రకటించిన ట్రంప్ సర్కారు... దేశీయ కంపెనీలపై రూ.8,750 కోట్ల వరకు భారం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని తీవ్రం చేస్తున్నారు. అమెరికాకు దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రభావం మన దేశ స్టీల్, అల్యూమినియం ఎగుమతులపైనా 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,750 కోట్లు) వరకు ఉంటుందని అంచనా. అయితే అమెరికా మొత్తం స్టీల్ దిగుమతుల్లో మన వాటా కేవలం 5 శాతం మాత్రమే. దీంతో ఈ ప్రభావం భారత స్టీల్ కంపెనీలపై పెద్దగా ఉండకపోవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. అల్యూమినియం పరిశ్రమపై మాత్రం ఈ ప్రభావం భారీగానే ఉంటుంది. ప్రస్తుతం అమెరికా మొత్తం అల్యూమినియం దిగుమతుల్లో మన కంపెనీల వాటా 12 శాతం. దీంతో నాల్కో, హిందాల్కో వంటి కంపెనీల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ సుంకాల పభావం కెనడా, బ్రెజిల్, మెక్సికో దేశాల కంపెనీలపై మాత్రం ఎక్కువగానే ఉంటుందని అంచనా.

భారత్‌కు డంపింగ్ ప్రమాదం

అయితే ట్రంప్ అన్నంత పని చేస్తే చైనా, ఇండోనేషియా, దక్షిణ కొరియా కంపెనీలు భారత్‌లోకి తమ స్టీల్‌ను మరింత పెద్దఎత్తున డంప్ చేసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశం స్టీల్ దిగుమతులపై 7.5 శాతం సుంకం విధిస్తోంది. దీన్ని రెట్టింపు చేయబోతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రస్తుతం చైనా పెద్దఎత్తున తన మిగులు స్టీల్‌ను మన దేశంలో చౌకగా డంప్ చేస్తోంది. దీంతో టాటా స్టీల్, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి అనేక దేశీయ కంపెనీల లాభాలకు భారీగా గండి పడింది. సొంత గనులు లేని వైజాగ్ స్టీల్ వంటి కంపెనీలైతే ఉత్పత్తి ఖర్చులు దండగ అని ఉత్పత్తిని కుదించుకున్నాయి. ట్రంప్ అన్నంత పని చేస్తే చైనాతో సహా అనేక దేశాలు మరింత ఉధృతంగా తమ మిగులు స్టీల్‌ను మరింతగా డంప్ చేసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ పరిస్థితిని తట్టుకునేందుకు స్టీల్ దిగుమతులపై మన ప్రభుత్వమూ 25 శాతం దిగుమతి సుంకం విధించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

మార్కెట్ 'మండే'న్!

మెటల్ షేర్లలో పోటెత్తిన అమ్మకాలు

- సెన్సెక్స్ 548 పాయింట్లకు పైగా పతనం
- 4 రోజుల్లో రూ.7.68 లక్షల కోట్లు ఆవిరి

లోహ రంగ షేర్ల నష్టాలు	
కంపెనీ	నష్ట శాతం
నాల్కో	4.83
సెయిల్	4.67
వేదాంత	4.31
ఎన్ఎండీసీ	3.95
టాటా స్టీల్	3.11
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	2.20
హిందాల్కో	1.87
జిందాల్ స్టెయిన్‌లెస్	1.61
జిందాల్ స్టీల్	0.72

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టపోయాయి. లోహం, బ్యాంకింగ్, ఇంధన రంగ షేర్లలో అమ్మకాల కారణంగా సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 753 పాయింట్లు క్షీణించింది. చివరికి సూచీ 548.39 పాయింట్ల నష్టంతో 77,311.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద ముగిసింది. అమెరికాలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై అదనంగా 25 శాతం సుంకం విధిస్తానంటూ ట్రంప్ ప్రకటించడం ఇందుకు ప్రధాన కారణమైంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల తరలింపు కొనసాగడం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,272 పాయింట్లు పతనమవగా.. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.68 లక్షల కోట్లు తగ్గి రూ.417.82 లక్షల కోట్లు (4.77 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. బీఎస్ఈలో 4,225 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,125 నష్టపోయాయి. 993 లాభపడగా.. 107 యథాతథంగా ముగిశాయి. 192 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 2 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.372 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ డిసెంబరు త్రైమాసికంలో రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.245 కోట్లతో పోల్చితే ఇది 52 శాతం అధికం. ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు పెరిగింది. వచ్చే మూడు, నాలుగు సంవత్సరాల కాలంలో 11 ప్రాంతాల్లో 3,512 అదనపు పడకలు ఏర్పాటు చేసే దిశగా సంస్థ కృషి చేస్తోంది. దేశంలోని నలుమూలలా నాణ్యమైన ఆరోగ్య సేవలు సమాజంలో సంపన్నులకు మాత్రమే పరిమితం కాదు... ప్రజలందరి ప్రాథమిక హక్కు అన్న సిద్ధాంతానికి తాము కట్టుబడ్డామని సంస్థ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి అన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.9 (180%) మధ్యంతర డివిడెండును డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండు అర్హతకు రికార్డు తేదీని ఫిబ్రవరి 15గా నిర్ణయించారు.

బంగారం భగ్గు



ఒక్కరోజే రూ.2,430 పెరుగుదల

10 గ్రాములు రూ.88,500

రూ.97,500కు కిలో వెండి ధర

న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపట్లేదు. రోజుకో రికార్డు స్థాయికి ఎగబాకుతోంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర ఒక్కరోజే రూ.2,430 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.88,500కు చేరింది. కిలో వెండి సైతం రూ.1,000 పెరుగుదలతో రూ.97,500 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహాలకు భారీ డిమాండ్ నెలకొనడంతో పాటు రూపాయి విలువ క్షీణిస్తుండటంతో దేశీయంగా వీటి రేట్లు భగ్గుమంటున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది.

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,900 డాలర్ల మైలురాయిని సైతం దాటేసింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ రేటు ఒక దశలో 45.09 డాలర్లు (1.56 శాతం) పెరిగి ఆల్‌టైం రికార్డు స్థాయి 2,932.69 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రేటు సైతం దాదాపు ఒక శాతం పెరుగుదలతో 32.76 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు ఇందుకు కారణమయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు (గడిచిన 41 రోజుల్లో) బంగారం ధరలు 10 శాతానికి పైగా పెరిగాయి. ట్రంప్ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలకు దారి తీయవచ్చన్న భయాందోళనలు ఉధృతమవుతున్నాయి. తత్ఫలితంగా ఆర్థిక వృద్ధి మందగించడంతో పాటు కమోడిటీల ధరలు మళ్లీ ఎగబాకే ప్రమాదం ఉంది. ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో పెట్టుబడులకు భద్రమైన సాధనంగా పేరుండటంతో బంగారానికి డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. దాంతో అంతర్జాతీయంగా, దేశీయంగా వీటి ధరలు కొండెక్కుతున్నాయని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. మార్కెట్లో వాణిజ్య అనిశ్చితి మరింత పెరిగితే, త్వరలోనే ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్లకు చేరుకోవచ్చని వారు భావిస్తున్నారు.

గుడ్‌ఇయర్ కోసం హైదరాబాద్‌లో టెక్ మహీంద్రా జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాలోని ఓహియోకు చెందిన టైర్ల కంపెనీ గుడ్‌ఇయర్ టైర్ అండ్ రబ్బర్ కోసం హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేసేందుకు టెక్ మహీంద్రా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. 3,000 సీట్ల సామర్థ్యంతో కూడిన ఈ జీసీసీలో గుడ్‌ఇయర్ తన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఐటీ కార్యకలాపాలను నిర్వహించనుంది. ఈ జీసీసీలో పనిచేసేందుకు టెక్ మహీంద్రా తన లక్షన్నరకు పైగా ఉద్యోగుల్లో దాదాపు 2 శాతం మందిని కేటాయించనున్నట్లు తెలిసింది.

టీబీఏఎల్ 300వ ఫ్యూజ్‌లేజ్ సరఫరా

టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్) హైదరాబాద్‌లోని తమ తయారీ కేంద్రం ద్వారా ఏహెచ్-64 అపాచీ ఎటాక్ హెలీకాప్టర్ 300వ ఫ్యూజ్‌లేజ్ (ప్రధాన క్యాబిన్) డెలివరీ చేసింది. కంపెనీ సాధించిన కీలక మైలురాయి ఇది. భారత సైన్యం, అమెరికా సైన్యం సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్లందరి కోసం వీటిని ఈ ప్లాంట్‌లో తయారుచేస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,060 ▲	79,800 ▲	1,07,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,000 ▼
విశాఖపట్నం	85,940 ▲	78,780 ▼	96,230 ▲
రాజమండ్రి	87,050 ▲	79,800 ▲	98,400 ▼
ప్రొద్దుటూరు	86,700 ▲	80,280 ▲	96,000 ▼
ముంబై	85,665 ▲	78,469 ▲	95,533 ▲

రూ. 8.75 లక్షల కోట్ల పెట్టుబడులు

10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు

కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్

నాలుగు ఈయూ దేశాలతో టీఈపీఏ

న్యూఢిల్లీ: యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఈఎఫ్‌టీఏ) కూటమిలోని స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నార్వే, లీచెన్‌స్టీన్ దేశాలతో మన దేశం వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) పేరుతో ప్రత్యేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో వచ్చే 15 సంవత్సరాల్లో మన దేశంలో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.75 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెట్టేందుకు ఈ నాలుగు దేశాలు హామీ ఇచ్చాయి. ఇది చివరికి దాదాపు 40,000 కోట్ల డాలర్ల నుంచి 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులకు దారితీసే అవకాశం ఉందని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. ఈ పెట్టుబడులతో ప్రత్యక్షంగా 10 లక్షల ఉద్యోగాలు, పరోక్షంగా 50-60 లక్షల మందికి ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందన్నారు. ఈ సంవత్సరం చివరికల్లా ఈ ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ దేశాలతో వాణిజ్య, పెట్టుబడుల సమన్వయం కోసం తమ మంత్రిత్వ శాఖలో ప్రత్యేక డెస్కును కూడా ఏర్పాటు చేస్తున్నట్టు గోయెల్ తెలిపారు. ఈ ఒప్పందంతో మన దేశం ఈ దేశాల నుంచి దిగుమతయ్యే చాక్లెట్లు, స్విస్ వాచీలు, కట్ చేసి సానపెట్టిన వజ్రాజలపై సుంకాలను సున్నా లేదా కనీస స్థాయికి తగ్గిస్తుంది.

రిక్తమ్ గ్రూప్ నుంచి జింటర్‌వ్యూఏఐ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంజనీరింగ్ సొల్యూషన్స్ సంస్థ రిక్తమ్ గ్రూప్.. జింటర్‌వ్యూఏఐ పేరుతో ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా నియామక ప్రక్రియను తమ ప్లాట్‌ఫామ్ చేపడుతుందని రిక్తమ్ టెక్నాలజీ డైరెక్టర్, జింటర్‌వ్యూఏఐ సీఈఓ సిద్ధరామ్ సింగిశెట్టి తెలిపారు. ఇన్నోవేటివ్ ఏఐ ఆధారిత అవతారంతో కూడిన వ్యక్తి తమ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలను చేపడతారని ఆయన చెప్పారు. జింటర్‌వ్యూఏఐ ద్వారా ప్రస్తుత టెక్నాలజీలకు తగ్గట్టుగా నైపుణ్యాలు కలిగిన వ్యక్తులను కంపెనీలు ఎంపిక చేసుకోవటంతో పాటు సమయాన్ని ఆదా చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భారత్, యూఏఎస్‌లోని దాదాపు 20కి పైగా కంపెనీలకు తమ ప్లాట్‌ఫామ్ ద్వారా నియామక సేవలను అందిస్తున్నట్లు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 11వ తేదీ

ప్రాంతం	ధర	ప్రాంతం	ధర
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

ప్రాంతం	ధర	ప్రాంతం	ధర
హైదరాబాద్	97	విజయవాడ	106
వరంగల్	97	గుంటూరు	106
కరీంనగర్	97	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	82
కర్నూలు	97	నెల్లూరు	87
విశాఖపట్నం	100	అనంతపురం	87
గోదావరి	106		

ఆత్మహత్య కేసులో కర్నూలు జిల్లా వాసి అరెస్టు

» పదుల సంఖ్యలో ఖాతాలు తెరిచి లోన్ యాప్‌లకు సహకారం

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ నిర్వాహకులకు సహకరిస్తూ నగరానికి చెందిన యువకుడి ఆత్మహత్యకు కారకుడైన కర్నూలు జిల్లా వాసిని అరెస్టు చేసినట్టు మహారాణిపేట పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఐదు నెలల క్రితం మహారాణిపేట అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన సూరాడ నరేంద్ర లోన్ యాప్ ద్వారా రూ.2వేలు రుణం తీసుకున్నాడు. రోజుల వ్యవధిలో వాటిని తిరిగి చెల్లించినా ఇంకా వడ్డీ రూపంలో మరింత కట్టాలంటూ యాప్ నిర్వాహకులు వేధించారు. నరేంద్ర కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, అతడి ఫోన్ కాంట్రాక్ట్ లిస్టులో ఉన్న బంధువులకు, స్నేహితులకు పంపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేంద్ర నాలుగు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదుచేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. నరేంద్ర బ్యాంకు ఖాతాకు కర్నూలు జిల్లా కల్లూరు మండలానికి చెందిన ఆర్‌బీ శ్రీనివాసులు అకౌంట్ నుంచి డబ్బులు వచ్చినట్టు, తిరిగి జమ అయినట్టు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. శ్రీనివాసులుకు పలు రాష్ట్రాల్లో 30 బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, ఆ ఖాతాల ద్వారా లోన్ యాప్‌ల నిర్వాహకులకు సహకరించాడని, అందుకు రూ.12 లక్షల వరకూ కమీషన్‌గా తీసుకున్నాడని పోలీసులు గుర్తించారు.

ప్రాణం తీసిన లిఫ్ట్

అనపర్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో అపార్టుమెంట్ లిఫ్ట్‌లో చిక్కుకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అనపర్తికి చెందిన కసిమేడ సూర్యనారాయణ(54) అనపర్తి పాతవూరిలోని తన కుమారుడు నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు వచ్చాడు. కుమారుడు ఆస్పత్రి పనిమీద బయటికి వెళ్లడంతో సూర్యనారాయణ తిరిగి కిందికి వచ్చే క్రమంలో నాలుగో ఫ్లోర్‌లో లిఫ్ట్ డోర్ తీసి ఉన్నది చూసుకోకుండా లోపలికి అడుగువేశాడు. అయితే, అప్పటికే లిఫ్ట్ క్యాబిన్ మూడో ఫ్లోర్‌లో ఉండడం, సూర్యనారాయణ లిఫ్ట్ నాలుగో ఫ్లోర్ నుంచి క్యాబిన్‌పైకి ఒక్కసారిగా జారిపోవడం, డోరు లాక్ అవడం ఒకేసారి జరిగాయి. అదే సమయంలో మూడో ఫ్లోర్‌లో ఒకరు లిఫ్ట్‌ను ఆపరేట్ చేయగా లిఫ్ట్ కిందకు రావడంతో సూర్యనారాయణ చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి: టీడీపీపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం రూ.12 వేల కోట్లు, నష్టాలలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను తిరిగి గాడిన పెట్టేందుకు రూ.11,440 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది' అని టీడీపీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో టీడీపీ తరఫున ఎంపీ లావు మాట్లాడారు. 'రాష్ట్రాభివృద్ధికి కేంద్ర బడ్జెట్ మరింత ఊతం ఇస్తుంది. వికసిత్ భారత్ 2047కు లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి' అని కోరారు.

ఎర్ర కాల్వ సమస్య పరిష్కరించాలి: పురందేశ్వరి

తూర్పుగోదావరి జిల్లాలో రైతుల దుఃఖ దాయనిగా ఉన్న ఎర్ర కాలువ సమస్య తీర్చేందుకు నిధులు విడుదల చేయాలని కేంద్ర నీటి పారుదల మంత్రి సీఆర్ పాటిల్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. సోమవారం, కేంద్ర మంత్రితో భేటీ అయిన ఆమె ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఎర్రకాలువ శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.268 కోట్ల వరకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.

ఆ 5 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చండి

» అమిత్ షాకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కళింగ వైశ్య, సొండి, శిష్ట కరణం, తూర్పు కాపు, అరవల కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈమేరకు షాతో భేటీ అయిన రామ్మోహన్‌నాయుడు వినతిపత్రం అందించారు.

కాకాణి అల్లుడి భూమేత?

2024 మార్చి 15న నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం రామదాసు కండ్రిగ ప్రాంతంలో 50.5 ఎకరాలను జీకేఎస్ కంపెనీకి కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రోజు రాత్రి ఈ జీవో జారీ చేసింది. అదేరోజు గంటల వ్యవధిలో ఏపీఐఐసీ ఈ భూములను జీకేఎస్ కంపెనీకి స్వాధీనం చేసింది. అదేరోజు కాకాణి అల్లుడు మన్నెం గోపాలకృష్ణారెడ్డి ఈ కంపెనీలో భాగస్వామి కావడంతో పాటు ఏకంగా సీఈవో అయిపోయారు. రూ.100 కోట్లకు పైగా విలువ చేసే పేదల భూములను కారుచౌకగా 9 కోట్లకే కొట్టేశారు



నెల్లూరు జిల్లా రామదాసుకండ్రిగ ప్రాంతంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి అల్లుడు గోపాలకృష్ణారెడ్డికి కేటాయించిన భూములివే

» కారుచౌకగా 50 ఎకరాలు కొట్టేశారు
» ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందు జీవో
» అదేరోజు గోపాలకృష్ణారెడ్డికి భూమి స్వాధీనం చేసిన ఏపీఐఐసీ
» మార్కెట్ విలువ 100 కోట్లకు పైనే
» పేద రైతులకు చెల్లించింది 9 కోట్లే
» కూటమి సర్కారుకు టీడీపీ నేతల ఫిర్యాదు
» చంద్రబాబు ఆదేశాలతో విజిలెన్స్ విచారణ
» అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వ పాలన చివరి రోజుల్లో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి అల్లుడు మన్నెం గోపాలకృష్ణారెడ్డి ఉన్నఫళంగా ఓ కంపెనీకి సీఈవో అయిపోయారు. అదే రోజు కోట్ల రూపాయల విలువైన సీజేఎఫ్ఎస్ భూములు కారుచౌకగా ఈ కంపెనీ పరమయ్యాయి. కాకాణి నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యేగా, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న రోజుల్లోనే ఇవన్నీ జరిగాయి. ఎన్నికల్లో కాకాణి ఓడిపోయినా కారుచౌకగా పేదల ఆస్తిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆయన అల్లుడు మాత్రం లాభపడ్డారని సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుల ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. కాకాణి అల్లుడు సీఈవోగా ఉన్న కంపెనీకి అప్పటి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైమాటే.

ఇదీ భూమి స్వరూపం

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం పరిధిలో కృష్ణపట్నం పోర్టుకు అతి దగ్గరలో ఆ భూములు ఉన్నాయి. వైసీపీ నేత కాకాణి సర్వేపల్లికి పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేశారు. ముఖ్యంగా గడిచిన ఐదేళ్లు ఎమ్మెల్యేగా కంటే ఓ రాజులాగా నియోజకవర్గం మీద పెత్తనం చెలాయించారనేది అక్కడి ప్రజల అభిప్రాయం. నియోజకవర్గంలో ఆయనకు తెలియకుండా ఎవరికీ సెంటు భూమి పట్టా ఇవ్వడానికీ వీలులేదు. అధికారులు తమ అధికారాలను స్వతంత్రంగా వినియోగించుకునే హక్కు కూడా లేదు. అలాంటి నియోజకవర్గంలో కాకాణి అల్లుడు సీఈవోగా ఉన్న ఒక చిన్న కంపెనీకి 50.5 ఎకరాలను, అందునా పేదలకు చెందిన భూములను కారుచౌకగా స్వాధీనం చేశారనేది ప్రధాన అభియోగం. వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ ప్రాంతంలో పోర్టు రోడ్డుకు అనుకొని 50.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1976 ప్రాంతంలో ఈ భూమిని పేదలకు ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున పట్టా ఇచ్చారు. అప్పటి నుంచి ఈ భూములు సీజేఎఫ్ఎస్ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టు ఏర్పడిన క్రమంలో ఈ భూములకు విలువ పెరిగింది. పారిశ్రామిక విస్తరణకు అనువైన భూములుగా వీటిని గుర్తించారు. ఈ భూమికి చుట్టుపక్కల రియల్ వెంచర్లు వేయడంతో పేదల చేతుల్లో ఉన్న భూముల విలువ అమాంతం పెరిగింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కనీస మార్కెట్ ధర ఎకరం కోటి నుంచి 2 కోట్లకుపైగా పలుకుతోంది.

కృష్ణపట్నం పోర్టు కోరినా..

పోర్టుకు సమీపంలో ఉన్న ఈ భూములను పారిశ్రామికంగా వినియోగించుకోవాలని 2016 ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీని కోరారు. అదే సమయంలో ఈ భూములను తమకు కేటాయిస్తే మార్షన్ ట్రక్ టెర్మినల్ నిర్మిస్తామని పోర్టు యాజమాన్యం ఏపీఐఐసీని, రెవెన్యూ అధికారులను కోరింది. అయితే కారణాలు తెలియవు కానీ ఆ ప్రతిపాదనలను పక్కన పెట్టేశారు. ఏపీఐఐసీ సైతం ఈ భూములను స్వాధీనం చేసుకోలేదు. ఆ ఫైళ్లు అలాగే పెండింగ్‌లో ఉండిపోయాయి.

టీడీపీ నేతల ఫిర్యాదుతో...

మాజీ మంత్రి కాకాణి పేదల నోరు కొట్టి అల్లుడికి కోట్ల రూపాయల పేదల భూములు దోచిపెట్టారని కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక టీడీపీ నాయకులు పరిశ్రమల శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి స్పందన రాకపోవడంతో డిసెంబరు 4న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఎం వెంటనే విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ ఈ భూ కేటాయింపుల వెనుక అక్రమాలు జరిగాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేటాయింపులు చేశారని నివేదికలో పేర్కొనట్లు తెలిసింది. ఇక తదుపరి చర్యలు తీసుకోవడమే మిగిలుంది.

వైసీపీ ప్రభుత్వంలో ఆగమేఘాలపై..

కాలక్రమంలో బాగా విలువ పెరిగిన ఈ భూములపై కొందరి కన్ను పడింది. వీటిని స్వాధీనం చేసుకోవడానికి జీకేఎస్ ఇండస్ట్రియల్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ పేరుతో 2023 ఫిబ్రవరి 24వ తేదీన ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంది. అంతే.. ఈ భూమి కోసం 2016 నుంచి ఎదురు చూస్తున్న కృష్ణపట్నం పోర్టు యాజమాన్యాన్ని పక్కకు నెట్టి ఏడాదికి ముందు పుట్టిన జీకేఎస్ కంపెనీకి ఈ భూమిని కేటాయించడానికి ఫైళ్లు శరవేగంగా పరిగెత్తాయి. పేదల చేతుల్లో ఉన్న ఈ భూమిని స్వాధీనం చేసుకోవడానికి భూ సేకరణకు వెళ్లలేదు. భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువ కన్నా 2.5 రెట్లు ఎక్కువ ఇచ్చి పేదల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలి. అలా కూడా చేయలేదు. ప్రభుత్వ మార్కెట్ విలువ ఎకరం 15 లక్షలు ఉంటే.. అంతే మొత్తానికి పేదల ముక్కు పిండి రాయించుకున్నారు. రైతులకు చెల్లించిన 9 కోట్ల రూపాయలు కాకాణి అల్లుడి అకౌంట్ నుంచే వెళ్లాయనే ఆరోపణలు ఉన్నాయి. 2024 మార్చి 15వ తేదీన ఈ భూములను జీకేఎస్ కంపెనీకి కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అదే రోజు ఈ కంపెనీకి మన్నెం గోపాలకృష్ణారెడ్డి సీఈవో అయ్యారు. మంత్రి అల్లుడి కోసం వందల కోట్ల విలువజేసే పేదల భూములను అతి తక్కువ ధరకు స్వాధీనం చేసుకున్నారని ఏపీఐఐసీ అధికారులపై ఆరోపణలు బలంగా ఉన్నాయి.

రాష్ట్రానికి మీరేం చేశారు?

వైసీపీ నేతలకు టీడీపీ ఎంపీల సూటి ప్రశ్న

» సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రాభివృద్ధికి నిధులు: లావు
» మిథున్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడారు: కలిశెట్టి
» పాడి రైతులను దోచుకున్న ఘనుడు పెద్దిరెడ్డి: దగ్గుమళ్ల
» 300 కోట్లకు రైతులను మోసం చేసిన మిథున్‌రెడ్డి: శబరి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం కోసం ఏం చేశామో చెప్పకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పనితీరును విమర్శించడం సబబు కాదు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో అసలు అభివృద్ధి జరగలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని అని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం ఇక్కడ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, శ్రీభరత్‌తో కలసి లావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం కేంద్రం నుంచి సాధించుకున్న నిధుల వివరాలను వివరించారు. 'మేం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పోలవరానికి కేంద్ర రూ.12 వేల కోట్లు ఇచ్చింది. రాబోయే నాలుగేళ్ల కాలంలో ఇంకా సాయం చేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల్లో ఐదు కాలేజీల నిర్మాణ పనులు కొంతమేర జరిగాయి. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మూడు వైద్య కళాశాలల్లో ఒక కాలేజీ నా నియోజకవర్గంలో నిర్మాణంలో ఉంది. రాష్ట్రప్రభుత్వం తన నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణం ఆగిపోయింది. మిగతా మెడికల్ కాలేజీలకు గత ప్రభుత్వంలో భూములు మాత్రమే కేటాయించారు' అని లావు పేర్కొన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులతో పాటు రాష్ట్రానికి దక్కాల్సిన గౌరవం కూడా దక్కుతున్నందున నాకెంతో సంతోషంగా ఉంది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించేవిధంగా మాట్లాడారు' అన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. వైసీపీ నేత పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి పాడి రైతులను తక్కువ ధరకు పాలను అమ్మాలని బెదిరించేవారు' అని ఆరోపించారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, 'వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి సంబంధించి రూ.3 వేల కోట్ల లిక్కర్ స్కాం బయటపడడంతో లోక్‌సభలో ఆయన మతితప్పి మాట్లాడుతున్నారు. రిజర్వాయర్లు పేరిట రైతుల నుంచి రూ.300 కోట్లు వసూలు చేసి మోసం చేశారు. లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిపై, మిథున్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి, ఆ వ్యాఖ్యలను తొలగించాలని కోరుతాం' అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేమ.. బ్రేకప్ నేపథ్యంలో



పా పాండి, రాయన్ వంటి బ్లాక్ బస్టర్‌ల తర్వాత ధనుష్ దర్శకత్వంలో వస్తున్న మరో చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 21న విడుదలవుతోంది. తెలుగులో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ ప్రారంభంలో..ధనుష్ కనిపించి ఇదొక సాధారణ ప్రేమ కథ అని అసలు కథలోకి తీసుకెళ్తాడు. ఓ ప్రేమ, బ్రేకప్ నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం వినోదభరితంగా ఉండబోతోంది.

ఆ సన్నివేశం సినిమాలో లేదు

విశ్వక్ సేన్



"మా కంట్రోల్‌లో లేకుండా ఒక వ్యక్తి చేసిన తప్పుకి మా సినిమాని బలి చేయకండి. ఇది మా విన్నపం. ఆ వ్యక్తికి నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆయన మా సినిమాలో నటించాడంతే. ఆయన తరఫున నేను క్షమాపణలు చెప్తున్నాను. దయచేసి సినిమాని విడుదల కాకముందే చంపకండి. ప్లీజ్ సపోర్ట్ 'లైలా'. అయినా, ఆయన అన్న డైలాగ్ గానీ, సన్నివేశం గానీ సినిమాలో లేదు. ఈ సినిమా నాకెంతో స్పెషల్. లేడీ క్యారెక్టర్ కోసం చాలా కష్టపడ్డాను. 'బాయ్‌కాట్ లైలా' అంటూ 25 వేల ట్వీట్లు చేశారు. రిలీజ్ రోజునే సినిమా హెచ్‌డీ ప్రింట్ లీక్ చేస్తాం అని బెదిరిస్తున్నారు. ఎవరో చేసిన తప్పుకి మేమెందుకు బలి కావాలి సార్" అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా రామ్‌నారాయణ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో నటుడు పృథ్వీరాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. దీంతో విశ్వక్‌సేన్, సాహు గారపాటి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ "ప్రీ రిలీజ్ ఈవెంట్ తర్వాత 'బాయ్‌కాట్ లైలా' అనే పోస్టులు చూసి షాక్ అయ్యాను. ఆయన అలా మాట్లాడేటప్పుడు మేము చిరంజీవిని ఆహ్వానించడానికి వెళ్లాం. సినిమా అనేది వేల మంది కష్టం. ఈ విషయాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలని కోరుతున్నాం" అని చెప్పారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది.

సినిమాకు కంటెంటే ముఖ్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి



ఆదిత్య, ప్రియ జంటగా రాజ్ లోహిత్ దర్శకత్వంలో చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన చిత్రం 'తకిట తదిమి తందాన'. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'తక్కువ బడ్జెట్ చిత్రమా? కొత్త నటీనటులా అనే విషయాన్ని పట్టించుకోకుండా మంచి కంటెంట్‌తో ఫీల్‌గుడ్‌గా నిలిచే సినిమాలు విజయవంతమవుతున్నాయి. కంటెంట్ ప్రధానంగా వచ్చే చిత్రాలే ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతున్నాయి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత రామసత్యనారాయణ, సినీటేరియా మీడియా వర్క్స్ అధినేత వెంకట్, దర్శకుడు రాజ్‌లోహిత్ పాల్గొన్నారు. ఈనెల 27న చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాత చందన్‌కుమార్ తెలిపారు.

పైరసీ చేస్తున్న వారిని వదిలిపెట్టం

అల్లు అరవింద్



"పైరసీ పెద్ద క్రైమ్. పైరసీ చేస్తున్న వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్ అడ్మిన్‌లకు ఇదే నా హెచ్చరిక. మీపై కేసులు పెట్టాం. జైలుకు వెళ్లే అవకాశముంది. యువత ఇందులో ఇరుక్కోవద్దు. నిర్మాతలు, ఫిల్మ్‌ఛాంబర్, ఓటీటీ చర్యల వల్ల కొన్నాళ్లుగా పైరసీ ఆగింది. కానీ రెండు నెలలుగా మళ్లీ మొదలైంది. 'తండేల్' సినిమాను పైరసీ చేయడమే కాకుండా ఓ ఆర్టీసీ బస్సులో ప్రదర్శించారు" అని అల్లు అరవింద్ అన్నారు. ఇటీవలె విడుదలైన 'తండేల్' సినిమాను పైరసీ చేసి ఆన్‌లైన్‌లో పెట్టడంతో చిత్ర సమర్పకుడు అల్లు అరవింద్, నిర్మాత బన్నీవాసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బన్నీవాసు మాట్లాడుతూ "సినిమా విజయం సాధించి మేము ఎంజాయ్ చేయాల్సిన సమయంలో ఇలా జరిగింది" అని చెప్పారు.

మెగా అభిమానులకు క్షమాపణలు

"ఈ మధ్య జరిగిన 'తండేల్' ఈవెంట్‌లో నేను రామ్‌చరణ్‌ను తగ్గించి మాట్లాడానని అంటున్నారు. ఈ విషయంలో నన్ను అపార్థం చేసుకున్నారు. నేను దిల్ రాజు పరిస్థితిని వివరించే క్రమంలో.. అలా అన్నాను. దానికి మెగాభిమానులు ఫీలయ్యారు. ఆయన నా ఏకైక మేనల్లుడు. చరణ్‌కి నేను ఏకైక మేనమామని. ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావు. ఎవరైనా నొచ్చుకుని ఉంటే క్షమించండి" అని అల్లు అరవింద్ అన్నారు.



రీరిలీజ్ అయితే సంతోషమే

- రాజ్‌కుమార్ హిరానీ





షారుఖ్ ఖాన్ హీరోగా రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డంకీ'. 2023లో విడుదలైన ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుని షారుఖ్‌కు హ్యాట్రిక్ హిట్ నిచ్చింది. అయితే, ఇప్పుడు ఈ సినిమా రీరిలీజ్ చేయాలనే ఆసక్తికర చర్చ సోషల్‌మీడియాలో నడుస్తోంది. పంజాబ్ నుంచి అమెరికాకు అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల కథాంశంగా ఈ సినిమా రూపొందింది. ప్రస్తుతం అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయులను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వెనక్కి పంపిస్తుండడం తెలిసిందే. దీంతో ఈ సినిమాను రీరిలీజ్ చేస్తే ఇందులోని సందేశం, వలస దారుల కష్టాలు అందరికీ మరింత చేరువవుతాయని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ విషయంపై దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ స్పందించారు. "ఈ సినిమాను రీరిలీజ్ చేస్తున్న సంగతి నాకు తెలియదు. ఒకవేళ రీరిలీజ్ అయితే, అది సంతోషకరమైన విషయం. పంజాబ్ నుంచి ఏళ్లుగా అక్రమంగా ఎంతో మంది వలసబాట పడుతూనే ఉన్నారు. కానీ ఆ విషయం ఇప్పుడు అందరికీ తెలుస్తోంది" అని చెప్పారు. మరోవైపు, ఈ సినిమాను ఈ నెలలోనే నిర్మాణ సంస్థ రీరిలీజ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనిపై నిర్మాతల స్పందన తెలియాల్సి ఉంది. కాగా, ఈ సినిమాలో షారుఖ్ ఖాన్ 'హర్డీ' పాత్రలో నటించారు. విక్కీ కౌశల్, బొమన్ ఇరానీ, అనిల్ గ్రోవర్, తాప్సీ కీలక పాత్రల్లో నటించారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర శ్రీధర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా నుంచి వెన్నెల కిశోర్ నటించిన డాక్టర్ భ్రమరం క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాత్రలో వెన్నెల కిశోర్ నవ్వులు పూయించనున్నారు. గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం తన వద్దకు సంతానలేమి సమస్యలతో వచ్చే వారిని ఆయుర్వేద వైద్యానికి ఆధునిక ఔషధాలను కలిపి ఎలా ట్రీట్ చేశారు అనేది హిలేరియస్‌గా ఉండబోతుందని చిత్ర బృందం పేర్కొంది.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్



విరాజ్ రెడ్డి హీరోగా జగ పెద్ది తెరకెక్కించిన చిత్రం 'గార్డ్'. 'రివెంజ్ ఫర్ లవ్' ఉపశీర్షిక. అనసూయ రెడ్డి నిర్మించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో విరాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే చిత్రమిది. ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ తప్పకుండా విజయం సాధిస్తుంది. పాటలు అద్భుతంగా ఉంటాయి" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్:రాజ్ మేడ, సినిమాటోగ్రఫీ:మార్క్ కెన్ఫీల్డ్, సంగీతం:ప్రణయ్ కాలేరు.



వీరవల్లిలోని కృష్ణా మిల్క్ యూనియన్ కామధేను పాల ఫ్యాక్టరీ

ఆరుపదుల.. 'విజయ' ప్రస్థానం!

- 84 రకాల పాల ఉత్పత్తులతో దక్షిణ భారత్‌లోనే టాప్
- నేడు విజయవాడలో కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవం

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తూ దినదినాభివృద్ధి చెందుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలోని 'విజయ' డెయిరీ వజ్రోత్సవ వేడుకలకు సన్నద్ధమైంది. మంగళవారం విజయవాడ చిట్టినగర్‌లోని డెయిరీ ప్రధాన కేంద్రంలో వేడుకలు జరగనున్నాయి. విజయ డెయిరీ రోజుకు 11 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తూ రూ.1200 కోట్ల టర్నోవర్ కలిగి రెండు లక్షల మంది పాడి రైతులకు జీవనాధారంగా ఉంది. దక్షిణ భారతదేశంలోనే 84 రకాల పాల ఆధారిత ఉత్పత్తులతో నంబర్ వన్‌గా ఉంది. పాడి రైతులకు నాలుగు నెలలకోసారి బోనస్ ఇవ్వటం, సభ్యులకు లాభాలను పంపిణీ చేయటం, పాడి రైతులకు సంక్షేమ పథకాలను వర్తింపచేయటం, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించటం డెయిరీ ప్రత్యేకత. ఇంతింతై వటుడింతైన చందాన.. 'విజయ' ప్రస్థానం వజ్రోత్సవానికి చేరింది.

పాడిపరిశ్రమ అభివృద్ధికి బీజం ఇలా..!

తొలుత యూనిసెఫ్ సహకారంతో నాలుగు మిల్క్ చిల్లింగ్ సెంటర్లు, మిల్క్ పౌడర్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో మొట్టమొదటి చిల్లింగ్ సెంటర్ పామర్రులో 1965 ఫిబ్రవరి 11న ప్రారంభమైంది. అదే తర్వాతి కాలంలో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డైరీ)గా రూపాంతరం చెందింది. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ ముందుకు సాగుతోంది. నేటికి కృష్ణా మిల్క్ యూనియన్ ప్రారంభమై 60 ఏళ్లవుతోంది. పాలసేకరణలో రోజుకు 10 లక్షల లీటర్ల మైలురాయిని చేరి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది కృష్ణామిల్క్ యూనియన్. రూ.600 కోట్ల టర్నోవర్‌ను ఐదేళ్లలోనే రూ.1200 కోట్లకు చేర్చిన ఘనత ఈ పాలకవర్గానిదే. గత సెప్టెంబరులో వరదల వల్ల విజయవాడ పాల ఫ్యాక్టరీ 45 రోజులు మూతపడ్డా వినియోగదారులకు సకాలంలో పాల ఉత్పత్తులు అందించడం వీరవల్లి ఫ్యాక్టరీ వల్లే సాధ్యమయింది. విదేశాల్లోని సాంకేతికతను పాడిరైతులకు చేరువ చేసేందుకు తానా లాంటి సంస్థల సహకారం తీసుకుంటూ ముందుకు సాగుతోంది.

ఎక్కడ నుంచి ఎక్కడిదాకా?

- కోసిగి మండలం పల్లెపాడు ప్రజల జీవనాధారం వ్యవసాయం. ఆ పల్లెలో 1,500 కుటుంబాలు ఉంటే 1,100 కుటుంబాలు గుంటూరు జిల్లా, కర్ణాటకలోని దేవదుర్గ, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు వలస వెళ్లారు.
- దుద్ది గ్రామంలో 1,200 కుటుంబాలు ఉంటే 650 కుటుంబాలు వలస బండెక్కాయి.
- చిర్తనకల్లు, మూగలదొడ్డి, డి.బెళగల్, పెద్దభూంపల్లి, చింతకుంట, కోసిగి, అర్లబండ, వందగల్లు, కామన్‌దొడ్డి, అగసనూరు గ్రామాలు సగానికిపైగా ఖాళీ అయ్యాయి.
- ఆదోని మండలం ఆరేకల్లులో 650కిగాను 350 కుటుంబాలు వలసదారిన సాగిపోయాయి.
- గణేకల్లులో 700కుగాను 400 కుటుంబాలు పిల్లాపాపలతో తరలిపోయాయి.
- కోడుమూరు మండలం కల్లపారిలో బీసీ, ఎస్సీ కాలనీలు ఖాళీ అయ్యాయి. ఆ పల్లెలో 250కిపైగా కుటుంబాలు వలస వెళ్లారు.
- ఎమ్మిగనూరు మండలం కడివెళ్లలో 950కి 600 కుటుంబాలు, కందనాతిలో 800కి 450 కుటుంబాలు వెళ్లిపోయాయి.
- కోటేకల్లులో 550కుగాను 200 కుటుంబాలు వలస బాటపట్టాయి.



కర్నూలు జిల్లా కోసిగి మండలం అర్లబండ, కామన్‌దొడ్డి గ్రామాల నుంచి లారీలో గుంటూరుకు వలస వెళ్తున్న రైతులు, కూలీలు

కర్నూలు పల్లెలు ఖాళీ!

పనులు లేక వలస బాట

- గుంటూరు, తెలంగాణ ప్రాంతాల్లో పత్తి, మిరప కోత పనులకు పయనం

కర్నూలు జిల్లాలోని పల్లెలు ఖాళీ అవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ముగియగానే పనులు వెతుక్కుంటూ రైతులు, వ్యవసాయ కూలీలు మూటముల్లె సర్దుకుని పిల్లపాపలతో వలస బాటన సాగిపోతున్నారు. ఒక్కప్పుడు వ్యవసాయ కూలీలు మాత్రమే వలస వెళ్లేవారు. ఇప్పుడు వ్యవసాయం కలసిరాక.. పెట్టుబడి అప్పులు తీర్చేదారి లేక.. బతుకు పోరులో అన్నదాతలు సైతం వలస బండెక్కుతున్నారు.

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లాలో ఎటు చూసినా తాళాలు వేసిన ఇళ్లే కనిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఖరీఫ్ పనులతో కళకళలాడిన పల్లెలు.. ఇప్పుడు పనులు లేక ప్రజలు వలసపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే లక్షల కుటుంబాలకుపైగా తెలంగాణ, గుంటూరు ప్రాంతాల్లో పత్తి తీత, మిరప కోత పనులకు వెళ్లిపోయారు. వయసు మళ్లిన వృద్ధులను ఇళ్ల దగ్గరే వదిలేసి.. పొట్ట చేతపట్టుకుని వలస బాట పట్టారు. కర్నూలు జిల్లా పశ్చిమ పల్లెసీమలలో రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలు.. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేశ్.. వీరి కష్టాలు విన్నారు. ఉన్న చోటే పనులు కల్పించి వలసలు ఆపుతామని హామీ ఇచ్చారు. కానీ, వలసలు ఆపే దిశగా తీసుకున్న చర్యలు నామమాత్రంగా ఉండడంతో పల్లెలు బోసిపోతున్నాయి. కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల్లో ఏ ఊరికి వెళ్లినా.. తలుపులకు తాళం వేసిన ఇళ్లు, ఆ ఇళ్లకు కాపలాగా ఉన్న వృద్ధులే కనిపిస్తున్నారు. ఈ ఏడాది పంటలు ఆశాజనకంగా ఉన్నా.. మిరప, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయి.

మిరప కోత.. పత్తి తీత

గుంటూరు జిల్లాలో మిరప కోత పనులు ఎక్కువగా సాగుతున్నాయి. దీంతో ఎక్కువ మంది ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ జిల్లాలో ఏ పల్లెలో చూసినా కర్నూలు జిల్లా వలస కూలీలే కనిపిస్తున్నారు. పురుషులకు రూ.650-700, మహిళలకు రూ.550-600 కూలి ఇస్తున్నారు. లేదంటే ఎకరాకు రూ.20-25 వేల చొప్పున ఒప్పందం చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రాంతంలో పత్తి తీత పనులు జరుగుతున్నాయి. అక్కడ కిలో పత్తి తీతకు రూ.13 ప్రకారం భార్యభర్తలు ఇద్దరు కలసి రోజుకు 100-120 కిలోలు పత్తి తీస్తే రూ.1,300-1,500 వరకు వస్తుంది. రెండు నెలలు భార్యభర్తలు ఇద్దరు కష్టపడితే తిండిఖర్చులు పోను రూ.50 వేలు సంపాయించవచ్చనే ఆశతో వలస బాటపట్టారు. బడికెళ్లే పిల్లలను సైతం బడిమాన్పించి తీసుకెళ్తుండడంతో పాఠశాలల్లో హాజరు శాతం గణనీయంగా పడిపోతుంది.

ఆదుకోని ఉపాధి పథకం

గ్రామీణ ఉపాధి హామీ పథకం కర్నూలు రైతులకు, కూలీలకు భరోసా ఇవ్వలేకపోతుంది. జిల్లాలో 1.45 లక్షలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కల్పిస్తారు. ఒక ఇంట్లో నలుగురు పనికి వెళ్తే 25 రోజుల్లో వంద పని దినాలు పూర్తవుతాయి. ఆతర్వాత ఉపాధి పని చూపించరు. దీంతో పూట గడవాలంటే వలసే శరణ్యం. అంతేకాదు రోజంతా మట్టి పనులు చేస్తే ఇచ్చే కూలీ రూ.250-300 మించడం లేదు. రెండు నెలలుగా ఉపాధి కూలీ డబ్బులు చెల్లించలేదు. దీంతో కూలీలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. రోజుకు లక్ష మందికి ఉపాధి చూపాలనే లక్ష్యం ఉన్నప్పటికీ 45-55 వేల మందికి మించి పని కల్పించలేక పోతున్నారు. అందులోనూ 10-12 వేలకుపైగా బోగస్ హాజరు ఉంటోంది.



కర్నూలు జిల్లా కోసిగి ప్రజలు వలస వెళ్లడంతో నిర్మానుష్యంగా మారిన వాల్మీకినగర్



కర్నూలు జిల్లా కోసిగి గ్రామంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో 65 మంది విద్యార్థులకు గాను 16 మంది విద్యార్థులే హాజరైన దృశ్యం

కొడుకు కోడలు ఎప్పుడొస్తారో?



ఈ వృద్ధురాలి పేరు పెద్ద నరసమ్మ(73). కర్నూలు జిల్లా మండల కేంద్రం కోసిగిలోని వాల్మీకి నగర్. నలుగురు కొడుకులు హనుమంతు, రామాంజనేయులు, హనుమేశ్, ఈరన్న, కూతురు లక్ష్మి గుంటూరుకు మిరప కోత వెళ్లారు. ఇంటికి కాపలాగా నరసమ్మ ఉన్నారు. వలస వెళ్లిన కొడుకులు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్నారు. "బడికెళ్లే పిల్లలను వెంటబెట్టుకొని సుగ్గివెళ్లారు.. అక్కడ ఎట్లా ఉన్నారో.. ఎట్లా బతుకుతారో.. ఆ దేవుడు మా బతుకులు ఇట్లా రాసినాడయ్యా" అని కన్నీటి పర్యంతమయ్యారు.

పెట్టుబడి మట్టిపాలై!



ఇంటికి కాపలాగా ఉన్న ఈ దివ్యాంగుడి పేరు బొల్లాలి ఈరన్న(68). 4 ఎకరాల పొలం ఉంది. పత్తి సాగు చేస్తే.. తెగుళ్ల వచ్చి దిగుబడి తగ్గింది. ఆదోని పత్తి మార్కెట్ తీసుకెళితే క్వింటా రూ.6 వేలలోపే అమ్మకోవాల్సి వచ్చింది. రూ.లక్షలకు పైగా పెట్టుబడి పెడితే అప్పులే మిగిలాయి. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి. భార్య నరసమ్మ, కొడుకులు రమేశ్, ఈరేశ్ ఇద్దరు భార్యపిల్లలతో కలసి కర్ణాటకలోని దేవదుర్గకు పత్తితీత పనులకు వలస వెళ్లారు. "ఈడ పనుల్లేవు.. వలస వెళితే 4 రూకలు వెనకేసుకొని అప్పులకు వడ్డీలైనా కట్టవచ్చు. అందుకే నా భార్య, కొడుకులు వలస వెళ్లారు" అని ఈరన్న ఆవేదన వ్యక్తం చేశారు.

బోదకాలు నివారణకు కృషి

- రాష్ట్రంలో 40,877 మంది వ్యాధిగ్రస్తులు: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బోదకాలు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బోదకాలు వ్యాధిగ్రస్తులకు సామూహిక మందుల పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 2030 నాటికి బోదకాలు వ్యాధి విస్తరణను అరికట్టే కార్యక్రమంలో భాగంగా సోమవారం 13 రాష్ట్రాల్లోని 111 జిల్లాల్లో ఈ వ్యాధి నివారణ మందుల పంపిణీని చేపట్టారు. ఆయా రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీకి అటల్ భూజల్ యోజన!

- 8,200 కోట్లతో కొత్తగా 5 రాష్ట్రాలలో విస్తరణకు కేంద్రం యోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భూగర్భ జలాల సుస్థిరతను పెంపొందించేందుకు అమలు చేస్తున్న అటల్ భూజల్ యోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 5 రాష్ట్రాలకు విస్తరించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతం నీటి కొరత ఉన్న 7 రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రూ.8,200 కోట్లతో 5 రాష్ట్రాలలో కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలు చేసేందుకు ఆర్థిక శాఖలోని ఖర్చుల విభాగం ప్రాథమిక అనుమతి ఇచ్చింది. కాగా సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ సారథ్యంలోని జలవనరుల స్థాయీ సంఘం జల్ జీవన్ మిషన్‌పై నివేదిక సమర్పించింది. 2024 డిసెంబరు నాటికి దేశంలోని అన్ని గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీరు ఇవ్వాలన్న జల్ జీవన్ మిషన్ లక్ష్యం.. గడువు ముగిసినా నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేసింది.

మద్యం ధరలు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వారికిచ్చే మార్జిన్ పెంపునకు ఇటీవల కేబినెట్‌లో ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ పన్నుల్లో మార్పులు తీసుకొచ్చింది. లైసెన్సీలకు ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తారు. కానీ ఇప్పటివరకూ ఏఆర్‌ఈటీ ఇష్యూ ప్రైస్‌లో లేదు. దీంతో లైసెన్సీలకు అనుకున్నంత మార్జిన్ రావట్లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ఏఆర్‌ఈటీని రెండు రకాలుగా వర్గీకరిస్తూ తాజా సవరణలు చేశారు. ఏఆర్‌ఈటీ1, ఏఆర్‌ఈటీ2 అని రెండు కాంపోనెంట్‌లు సృష్టించి, ఏఆర్‌ఈటీ1ను ఇష్యూ ప్రైస్ కిందకు తీసుకొచ్చారు. దీంతో ఏఆర్‌ఈటీ1 పన్నులోనూ లైసెన్సీలకు మార్జిన్ లభిస్తుంది. కాగా క్వార్టర్ రూ.99 లిక్కర్ ధరను పెంచలేదు. అవి మినహా అన్ని రకాల లిక్కర్ బ్రాండ్లపై లైసెన్సీలకు ఏఆర్‌ఈటీ1లో మార్జిన్ లభిస్తుంది. దీని ఫలితంగా ఆ బ్రాండ్ల బాటిళ్లపై రూ.10 పెరిగింది. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఉత్పత్తిచేసి గోడౌన్లలో ఉన్న, రవాణాలో ఉన్న మద్యానికి కూడా ఈ పెంపు వర్తిస్తుందని, ఆమేరకు లైసెన్సీలు అదనంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. బార్లు, ఇన్‌హౌస్ మద్యం అమ్మకపు కేంద్రాలకు ఏఆర్‌ఈటీ 15శాతం అదనంగా ఉంటుంది.

అధికారుల పొరపాట్లతో తలనొప్పి

ఎక్సైజ్ అధికారులు చేసిన పొరపాట్ల వల్ల ఇప్పుడు ధరల పెంచాల్సి వచ్చింది. అక్టోబరులో పాలసీని తీసుకొచ్చిన సమయంలో పన్నులు సవరించారు. కొత్త పాలసీని తీసుకొచ్చే సమయంలో అధికారులు అంచనాల రూపకల్పనలో విఫలయ్యారు. లైసెన్సీలకు 20శాతం మార్జిన్ ఇస్తామని పాలసీలో పేర్కొన్నా, వాస్తవంగా 10శాతమే వచ్చేలా పాలసీని తయారు చేశారు. దీనిని గుర్తించని ప్రభుత్వం పాలసీని అమల్లోకి తెచ్చేందుకు అనుమతి ఇచ్చింది. పాలసీ అమల్లోకి వచ్చాక అంచనాల్లో పొరపాట్లు బయటపడ్డాయి. వ్యాపారం తమవల్ల కాదంటూ లైసెన్సీలు గగ్గోలు పెట్టారు. ఈ వ్యవహారం సీఎం వరకూ వెళ్లడంతో పొరపాటును గుర్తించిన ఆయన మార్జిన్ పెంచుతామని లైసెన్సీలకు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్జిన్ సవరణ కోసం వినియోగదారులపై స్వల్పంగా అదనపు భారం వేయాల్సి వచ్చింది.

భోలేబాబా, వైష్ణవి, ఏఆర్ నడుమ 'నెయ్యి'ం

- మూడింటికీ టెండర్లలో పాల్గొనే అర్హత లేదు
- తప్పుడు డాక్యుమెంట్లతో పాల్గొన్న వైనం
- సిట్ రిమాండ్ రిపోర్టులో విస్తుగొలిపే విషయాలు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాఖండ్, ఏపీ, తమిళనాడు నడుమ ట్రయాంగిల్ అక్రమ నెయ్యి దందా నడిచింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేయడం కోసం ఈ మూడు రాష్ట్రాలకు చెందిన భోలేబాబా, వైష్ణవి, ఏఆర్ డెయిరీల నడుమ అక్రమ బంధం ఏర్పడింది. ఈమూడు డెయిరీలకు చెందిన నలుగురు డైరెక్టర్లను అరెస్టు చేసిన సందర్భంగా కోర్టుకు సమర్పించిన సిట్ రిమాండ్ రిపోర్టులో మతి పోగొట్టే అంశాలు అనేకం ఉన్నాయి. తిరుమలలో లడ్డూల తయారీకి జంతువుల కొవ్వు కలిపి కల్తీ చేసిన నెయ్యిని వాడిన వ్యవహారంపై సిట్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. రిమాండ్ రిపోర్టులోని అంశాలను బట్టి.. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు అయిన పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు ఈ అక్రమ దందాలోకి వైష్ణవి డెయిరీని, ఏఆర్ డెయిరీని లాగారు. తొలుత వైష్ణవి డెయిరీలో షేర్లు కొనుగోలు చేసి దానికి డైరెక్టర్లుగా మారారు. అక్కడ కీలక స్థానాల్లో తమ మనుషులను నియమించుకున్నారు. వారి ద్వారా ఏఆర్ డెయిరీని ముగ్గులోకి లాగారు. తతిమ్మా కథ తెలిసిందే! టీటీడీ టెండర్లలో పాల్గొనే అర్హత ఈ మూడు డెయిరీలకూ లేకపోవడం గమనార్హం. అయితే అక్రమ పద్ధతుల్లో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండర్లలో పాల్గొన్నారు. టెండర్లు దక్కించుకుని నాసిరకం, కల్తీ నెయ్యి సరఫరా చేసి అరెస్టయ్యారు.

2019లో మొదలైన కథ ఇది!

ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలోని భోలేబాబా డెయిరీ 2019లో తొలిసారిగా టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. అప్పట్లో ఈ డెయిరీ కిలో రూ.291 ధరతో నెయ్యి టిన్నులను టీటీడీకి అందించింది. ఆ ఏడాదిలోనే ఈ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్...తిరుపతికి చేరువలోని వైష్ణవి డెయిరీ యాజమాన్యాన్ని సంప్రదించారు. వైష్ణవి డెయిరీ టీటీడీ టెండర్లలో పాల్గొని అర్హత పొందితే ఆ డెయిరీ పేరిట తామే టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తామని ప్రతిపాదించారు. ఇందుకు సహకరిస్తే 2 నుంచి 3 శాతం వరకూ కమీషన్ చెల్లిస్తామని ఆఫర్ ఇవ్వడంతో వైష్ణవి డెయిరీ యాజమాన్యం అంగీకరించింది. జాతీయ డెయిరీల కేటగిరీలో భోలేబాబా డెయిరీ టీటీడీకి నెయ్యిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేది. 2022లో టీటీడీ ల్యాబ్ టెస్టుల్లో ఆ నెయ్యి విఫలం కావడంతో తిరస్కరించారు.

వైష్ణవిలో షేర్లు కొని డైరెక్టర్లుగా మారి...

భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్....వైష్ణవి, ఏఆర్ డెయిరీలను ముగ్గులోకి దింపారు. వారిద్దరూ వైష్ణవి డెయిరీలో షేర్లు కొని భాగస్వాములుగా మారిపోయారు. అప్పటి నుంచీ వారిద్దరి తరఫున అపూర్వ వినయ్‌కాంత్ చావడా సీఈవో హోదాలోనూ, సబ్బిర్ కలీముల్లా ఖాన్ అలియాస్ సామీర్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలోనూ వైష్ణవి డెయిరీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

మూడు రూపాయల కమీషన్‌కు కక్కుర్తి పడి...

తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ పాల విక్రయ వ్యాపారం చేస్తుండేది. అందులో భాగంగా చాలా కాలం నుంచి అలపట్టి చిల్లింగ్ సెంటర్ నుంచీ ఏపీలోని వైష్ణవి డెయిరీకి పాలు సరఫరా చేసేది. ఈ కారణంగా వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావడాకు ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్‌తో సన్నిహిత పరిచయాలున్నాయి. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని చావడా ఆయన్ను ముగ్గులోకి లాగారు. టీటీడీకి నెయ్యి సరఫరా ప్రక్రియ గురించి రాజశేఖరన్‌కు వివరించిన చావడా నెయ్యి సరఫరా గురించి తాను చూసుకుంటానని, ఏఆర్ డెయిరీ పేరు వాడుకున్నందుకు కిలోకు రూ. 2.75 నుంచీ రూ. 3 వరకూ కమిషన్ చెల్లిస్తానని ఆఫర్ ఇచ్చారు. దీనికి రాజశేఖరన్ అంగీకరించారు. 2023 మేలో చావడా ఏఆర్ డెయిరీ పేరిట మెయిల్ ఐడీ క్రియేట్ చేశారు. ఏఆర్ డెయిరీ డాక్యుమెంట్లతో టీటీడీ ఇ-టెండర్లలో పాల్గొని ఆర్డర్ దక్కించుకున్నారు. భోలేబాబా డెయిరీ నుంచి వైష్ణవి డెయిరీకి వచ్చిన నెయ్యిని ఏఆర్ డెయిరీ పేరిట టీటీడీకి సరఫరా చేశారు. వాటి నమూనాలను సేకరించి టీటీడీ గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపడం, అక్కడ టెస్టుల్లో నెయ్యిలో వెజిటబుల్, యానిమల్ ఫ్యాట్స్ వున్నాయని రిపోర్టులు రావడం తెలిసిందే.

కమీషన్ ఏజంటుగా శ్రీనివాసన్

చెన్నైకి చెందిన శ్రీనివాసన్ పేరు సిట్ దర్యాప్తులో ప్రముఖంగా వినిపించింది. టీటీడీ నిర్వహించే నెయ్యి సేకరణ టెండర్లలో ఇతడి పాత్ర కీలకంగా ఉందని సిట్ గుర్తించింది. ఇతడు 2018 నుంచీ భోలేబాబా డెయిరీకి కమిషన్ ఏజంటుగా వ్యవహరించేవాడని సిట్ దర్యాప్తులో వెల్లడైంది. ఆపై 2019 నుంచి వైష్ణవి డెయిరీకి కమీషన్ ఏజంటుగా వ్యవహరిస్తున్నాడని, అలాగే 2022 నుంచి మాల్‌గంగా డెయిరీకి, 2023 నుంచి ఏఆర్ డెయిరీకి ఏజంటుగా పనిచేస్తున్నట్టు సిట్ గుర్తించింది.

భోలేబాబా నుంచి ఏఆర్ డెయిరీకి నగదు బదిలీ

2023 అక్టోబరులో అప్పటి వైసీపీ హయాంలో టీటీడీ... జాతీయ డెయిరీలకు, 1500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీల నుంచి నెయ్యి సరఫరాకు ఇ-టెండర్లు పిలిచింది. ఏఆర్ డెయిరీ ఆ టెండర్లలో పాల్గొనేందుకు ఈఎండీ చెల్లించాలి. రెండు కేటగిరీల కింద ఈఎండీ చెల్లింపు కోసం భోలే బాబా డెయిరీ నుంచే నగదు ఏఆర్ డెయిరీ ఖాతాకు బదిలీ అయింది. 2023 అక్టోబరు 21న భోలేబాబా డెయిరీ ఖాతా నుంచి ఆర్టీజీఎస్ ద్వారా రూ. 38 లక్షలు, రూ. 32 లక్షలు చొప్పున మొత్తం రూ. 70 లక్షలు ఏఆర్ డెయిరీ ఖాతాకు బదిలీ అయింది. అలాగే మరో సందర్భంలో అంటే 2024 మార్చి 11న ఇ-టెండర్ల ఈఎండీ చెల్లింపుల కోసం భోలేబాబా డెయిరీ నుంచీ ఏఆర్ డెయిరీకి ఆర్టీజీఎస్ ద్వారా రూ. 51 లక్షలు బదిలీ అయింది. అదనపు ఈఎండీ రూ. 29 లక్షలు సైతం భోలేబాబా డెయిరీ నుంచీ ఏఆర్ డెయిరీకి 2024 మే 21న బదిలీఅయింది. ఏఆర్ దాన్నే టీటీడీకి చెల్లించింది.

కొత్త డైరెక్టర్లుగా కారు డ్రైవర్లు

సిట్ దర్యాప్తులో ఆసక్తికరమైన మరో అంశం వెలుగు చూసింది. గతేడాది సెప్టెంబరు 1న అంటే నెయ్యి కల్తీ వ్యవహారం బయటకు రాకమునుపే వైష్ణవి డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ఇద్దరూ తమ పదవులకు రాజీనామా చేశారు. తమ స్థానంలో సురేంద్ర సింగ్, సౌరభ కశ్యప్ అనే కొత్త వ్యక్తులను వారు డైరెక్టర్లుగా నియమించారు. ఈ ఇద్దరూ ఎవరా అని ఆరా తీసిన సిట్ అధికారులు కంగుతిన్నారు. కొత్త డైరెక్టర్లుగా నియమితులైన ఇద్దరూ పాత డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌ల సొంత కారు డ్రైవర్లని తేలింది. కాగా, సోమవారం భోలేబాబా డెయిరీకి సంబంధించిన మరో డైరెక్టర్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఆ వ్యక్తిని తిరుపతి సిట్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారిస్తున్నట్టు తెలిసింది. కాగా, ఈ కేసులో నలుగురు నిందితులను కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ అధికారులు తిరుపతి కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు.



అమెరికాలో జరిగే ఎక్స్‌పోలో చేనేత ప్రదర్శనను ఏర్పాటు చేయాల్సిందిగా కోరేందుకు మంత్రి సవితను కలిసిన చికాగో ప్రతినిధులు

అమెరికాలో చేనేత ఎక్స్‌పోలు!

- నిర్వహణకు సహకారం అందిస్తామన్న చికాగో బృందం
- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవితతో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని పలు ప్రాంతాల్లో చేనేత ఎక్స్‌పోలు నిర్వహించేందుకు సహకారం అందిస్తామని ఆ దేశంలోని చికాగో నగరం ప్రతినిధుల బృందం రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవితకి తెలిపింది. చికాగోలోని పుర్డ్యూ యూనివర్సిటీ, జీఎస్‌పీ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో నిర్వహించనున్న గ్లోబల్ మిల్లెట్స్ ఎక్స్‌పోలో పాల్గొనాలని మంత్రి సవితను ఆ బృందం ఆహ్వానించింది. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల ప్రస్తావనను మంత్రి తీసుకొచ్చారు. దీంతో అమెరికాలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించడం తమ బాధ్యతగా భావిస్తామని, చేనేత వస్త్రాలపై డిజైన్లలో శిక్షణ కూడా ఇస్తామని ఆ బృందం తెలిపింది. మన చేనేత వస్త్రాలకు మార్కెటింగ్, నేతన్నలకు అధునాతన డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చిన చికాగో ప్రతినిధులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల నియామకానికి బ్రేక్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో చోటు కల్పించి, వారికి జాబ్‌చార్టుతో పాటు, ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఇందులో భాగంగా డిజిటల్ అసిస్టెంట్లను ప్రణాళిక శాఖలో మండల స్థాయిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారుల కమిటీని నియమిస్తూ జనవరి 31న ప్రభుత్వం జీవో ఇచ్చింది. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను ప్రణాళిక శాఖలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఈవిధంగా వారికి జాబ్‌చార్ట్ ఉంటుందని, ప్రమోషన్‌కి చానల్ అందుబాటులోకి వస్తుందని భావించారు. వీరిని ప్రణాళిక శాఖ నిర్వహించే ఆర్థిక సామాజిక సర్వే, పారిశ్రామిక, జలవనరుల గణాంకాలు, ఇతర అంచనాల రూపకల్పనలో భాగస్వాములు చేయాలనుకున్నారు. ఇందుకోసం మండలాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి స్థానాలను డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు పరిశీలించి, పోస్టులు భర్తీ చేసేందుకు ఏడుగురు అధికారులతో జనవరి 31న కమిటీ నియమించారు. ఇప్పుడు ఆ కమిటీని రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం జీవో ఇచ్చింది.

కార్పొరేషన్ల హోదాల్లో గందరగోళానికి స్వస్తి

- సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు


అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు హోదాలను కేటాయించడంలో ఏర్పడిన గందరగోళానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రభుత్వ కార్పొరేషన్లంటినీ 'ఏ' కేటగిరీలోకి, కుల కార్పొరేషన్లను 'బీ' కేటగిరీలోకి చేరుస్తూ సాధారణ పరిపాలనశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణాభివృద్ధి అథారిటీలనూ 'బీ' విభాగంలోకి మార్చారు. గతంలో 'బీ' కింద ప్రకటించిన ఏపీ ఫైబర్‌నెట్, గిరిజన కార్పొరేషన్ లాంటి పెద్ద కార్పొరేషన్లను ఇప్పుడు 'ఏ' విభాగంలోకి తీసుకొచ్చారు.

రాష్ట్ర పండుగగా దామోదరం సంజీవయ్య జయంతి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఫిబ్రవరి 14న రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంజీవయ్య జయంతి నిర్వహణకు ఆయన జన్మస్థలం కర్నూలు జిల్లాకు రూ.3లక్షలు, మిగిలిన ఒక్కో జిల్లాకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.28 లక్షలు మంజూరుచేస్తూ సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

60 రోజులు రాకపోతే అనర్హత వేటు!

» బడ్జెట్ సమావేశాలకు జగన్ రావాలి: స్పీకర్ అయ్యన్న



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా 60 రోజులు అసెంబ్లీకి రాకుండా ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. వైసీపీ ఎమ్మెల్యే జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై, తమ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడాలని సూచించారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం... ఒక ఎమ్మెల్యేకు ఇచ్చినంత సమయం సభలో మాట్లాడేందుకు ఆయనకు కూడా ఇస్తామని తెలిపారు. శాసనసభ సమావేశాలను కౌరవసభ మాదిరిగా కాకుండా గౌరవసభలా హుందాగా నడుపుతామని స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాలకైనా ఆయన రావాలని సూచించారు. ప్రతిపక్ష హోదా లేని జగన్‌కు సీఎంకు ఇచ్చినంత సమయం ఎలా ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. సోమవారం ఏపీ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడారు. 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలకు ఈ నెల 22, 23 తేదీల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని స్పీకర్ తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆహ్వానించామని తెలిపారు. 23న రాజ్యసభ మాజీ ఛైర్మన్ వెంకయ్యనాయుడు రానున్నట్లు తెలిపారు. జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు రావాలని హితవు పలికారు. సభలో వారికైనా మాట్లాడే స్వేచ్ఛనివ్వాలని జగన్‌కు సూచించారు. సభకు రాని సభ్యులు వ్యక్తిగతంగా స్పీకర్‌కు లేఖలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగని, అసెంబ్లీ హాజరు జాబితాలో నకిలీ సంతకాలు పెట్టడం కుదరదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

24 నుంచి బడ్జెట్ సమావేశాలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్నాయి. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా పడుతుంది. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగంపై చర్చను చేపడతారు. ఈ సమావేశాలను సుమారు 20 పని దినాలు నిర్వహించాలని భావిస్తున్నారు. అయితే బీఏసీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రతినిధుల అర్థవంతమైన భాగస్వామ్యం ఉండాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 22, 23న శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు, శిక్షణ తరగతులకు సమాయత్తంగా మంగళవారం చీఫ్ విప్, విప్‌లతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, ఉభయసభలకు చెందిన ఇద్దరు చీఫ్ విప్‌లతోపాటు 18మంది విప్‌లు హాజరవుతారు.

దాడి కేసులో అరెస్టయిన వ్యక్తి కొప్పవరం వాసి

» రంగరాజన్‌పై దాడి కేసులో 23 మంది నిందితులను గుర్తించాం

రాజేంద్రనగర్/అనపర్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రంగరాజన్‌పై దాడిలో మొత్తం 25మంది పాల్గొనగా 23 మందిని గుర్తించామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 12 మంది ఏపీ వారు కాగా, తెలంగాణ వాళ్లు 11 మంది ఉన్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డిని ఇప్పటికే అరెస్టు చేయగా, సోమవారం మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రామరాజ్యం పేరుతో ఆర్మీ ఏర్పాటు చేసుకున్న వీరరాఘవరెడ్డి ఈ నెల 6న చిలుకూరు ఆలయానికి వెళ్లి కొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడని తెలిపారు. ఇందుకు రంగరాజన్ ఒప్పుకోకపోవడంతో ఆయనపై దాడి చేశాడని వివరించారు. వీర రాఘవరెడ్డిపై 2015లో ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు కేసు నమోదైందన్నారు.

పోలీసులు నిగ్గుతేల్చాలి: పవన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిలుకూరులోని ప్రసిద్ధ బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై మూకదాడిని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ తీవ్రంగా ఖండించారు. ఇది దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిని ధర్మపరిరక్షణపై దాడిగా భావించాలని, ప్రతి ఒక్కరూ ఈ దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు. రంగరాజన్‌పై ఒక మూక దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చి, కఠినంగా శిక్షించాలని పవన్ డిమాండ్ చేశారు.

కిరణ్ రాయల్‌పై అంతర్గత విచారణ: సామినేని

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ వ్యవహారంపై అంతర్గతంగా విచారణ జరుగుతోందని పార్టీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను వెల్లడించారు. 'కిరణ్ రాయల్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమా? కాదా..! అనే విషయం విచారణలో తెలుస్తుంది. నాకు తెలిసినంత వరకు ఆయనపై కుట్రతోనే ఈ అభియోగాలు చేశారు. త్వరలోనే అన్ని విషయాలు ప్రజలకు తెలుస్తాయి' అని సామినేని అన్నారు.

సీఎంఓ కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా



అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎంఓ కార్యదర్శిగా కార్తికేయ మిశ్రాకు పదోన్నతి దక్కింది. ఇప్పటిదాకా ఆయన సీఎంఓ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఏడాది జనవరి 1నుంచి ఆయనకు కార్యదర్శి హోదా లభించింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో కార్తికేయ మిశ్రా కార్యదర్శి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. కేంద్ర సర్వీసుల్లో కార్తికేయ మిశ్రా జాయింట్ సెక్రటరీ హోదాలో ఉంటారు. రాష్ట్ర సర్వీసులో మాత్రం కార్యదర్శిగా ఉంటారు.

టీడీపీ ఆఫీసుపై దాడి కేసుతో సంబంధం లేదు

» ప్రాసిక్యూషన్‌లో ఎదురు తిరిగిన ఫిర్యాదుదారుడు

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడు ప్రాసిక్యూషన్‌లో ఎదురుతిరిగాడు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని న్యాయాధికారి ముందు వాంగ్మూలం ఇచ్చాడు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు టీడీపీ కార్యాలయంలో కర్రలు, రాళ్లతో బీభత్సం సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ముదునూరు సత్యవర్ధన్ ఫిర్యాదుతో గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత ఈ కేసు సీఐడీకి బదిలీ అయింది. మొత్తం 88 మందిని నిందితులుగా చేర్చారు. వారిలో 39మంది ముందస్తు బెయిల్ కోసం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై విచారణ జరుగుతోంది. న్యాయాధికారి హిమబిందు సోమవారం బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయిన తర్వాత సత్యవర్ధన్‌ను న్యాయాధికారి విచారించారు. తనకు, ఈ కేసుకు ఎలాంటి సంబంధం లేదని, పోలీసులు సాక్షిగా సంతకం తీసుకుని తనను ఫిర్యాదుదారుడిని చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన అఫిడవిట్‌ను అందజేశారు. తనను ఎవరూ కులం పేరుతో దూషించలేదని, టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినప్పుడు అక్కడ లేనని స్పష్టం చేశారు. ఆయన వాంగ్మూలాన్ని న్యాయాధికారి నమోదు చేసుకున్నారు. అనంతరం విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

కల్తీ నెయ్యి సూత్రధారులు తేలాలి: దినకర్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి లడ్డూలో వినియోగించిన నెయ్యి విషయంలో జరిగిన కల్తీలో పాత్రదారులు అరెస్టు అయ్యారు. ఇక సూత్ర ధారులెవరో తెలాలి' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. 'సిట్ త్వరగా సూత్రధారులను కనిపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం. తిరుమలను ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా ఆదాయ వనరుగా చూసిన జగన్... వేంకటేశ్వర స్వామి డబ్బును పక్కకు మరలించి అవినీతికి పాల్పడ్డారు. పాప ఫలితం అనుభవించారు' అని దినకర్ అన్నారు.

21 వేల కోట్లతో సరిపెట్టుకోండి!

» జల వనరుల శాఖ బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి పయ్యావుల సూచన

» ఈ మొత్తం చాలదన్న నిమ్మల

» రూ.32,000 కోట్లు కావాలని వినతి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఈ నెలలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో శాఖలవారీ కేటాయింపులపై ప్రభుత్వం కసరత్తు జరుగుతోంది. సంబంధిత శాఖల మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై భేటీకి ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. నీటి ప్రాజెక్టులకు రూ.32 వేల కోట్లు కేటాయించాలని జల వనరుల శాఖ ప్రతిపాదించగా.. అంత పెద్దమొత్తంలో కేటాయింపులు అసాధ్యమని.. ఈ ఏడాదికి రూ.21 వేల కోట్లతో సర్దుకోవాలని నిమ్మలకు పయ్యావుల సూచించారు. ఇందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు, గాలేరు-నగరి, హంద్రీ-నీవాకు చెరో రూ.4,500 కోట్లు, వెలిగొండకు రూ.1,800 కోట్లు ఇస్తామన్నారు. అయితే ఈ కేటాయింపులతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇతర చిన్న, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులను ఎలా చేపడతామని నిమ్మల ప్రశ్నించారు. చాలా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవన్నారు. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరారు. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో.. అవన్నీ నిర్వీర్యంగా మారాయన్నారు. ప్రధానంగా ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ కోసం లస్కర్ వ్యవస్థ కూడా లేకుండా పోయిందని తెలిపారు. గేట్లకు గ్రీజు పూసే పనులూ చేయలేదన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ కూడా నిలిచిపోయిందని.. ఈ నేపథ్యంలో వీటితో పాటు మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులకూ నిధులు కేటాయించాలని కోరారు. దీంతో ఈ అంశంపై మంగళవారం కూడా చర్చలు కొనసాగించాలని పయ్యావుల నిర్ణయించారు.



బడ్జెట్‌పై సమావేశంలో మంత్రులు కేశవ్, నిమ్మల

విజన్ 2047లో

భాగస్వాములవ్వండి

» విజన్ కల సాకారానికి నిత్యం శ్రమిస్తున్నాం

» అగ్రి, అనుబంధ రంగాల్లో వృద్ధికి అవకాశం ఎక్కువ.. ప్రకృతి సాగు గేమ్‌ఛేంజర్

» రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న అధికారులు

అమరావతి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలి. 10 సూత్రాల అమలుతో విజన్ కలను నిజం చేసేందుకు నిత్యం శ్రమిస్తున్నాం. 15% వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం. వీటిలో కీలకమైన ప్రాథమిక రంగానికి బ్యాంకర్ల సహకారం ఎంతో అవసరం. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఎక్కువ వృద్ధి సాధించే అవకాశం ఉంది. దీనికి బ్యాంకర్ల నుంచి తగిన మద్దతు కావాలి' అని సీఎం చంద్రబాబు కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 'ప్రజల ఆహారపుటలవాట్లు మారుతున్నాయి. దీనికి అనుగుణంగా పంటల సాగు కూడా మారుతోంది. వ్యవసాయ పంటల స్థానంలో ఉద్యాన పంటల సాగు వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ఉద్యాన రైతులకు బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి. ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగు చేసే రైతులకు బ్యాంకులు సాయపడాలి. అన్ని అర్హతలున్న రైతులు రుణం కోసం బ్యాంకుకు వచ్చిన 15నిమిషాల్లోనే రుణం ఇచ్చే పరిస్థితి ఉండాలి. డెయిరీ రంగాన్ని ప్రోత్సహించడం తమ ప్రభుత్వ విధానం. కొన్ని సందర్భాల్లో సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర రాక పంట ఉత్పత్తిని పారబోసే పరిస్థితి కనిపిస్తోంది. దీన్ని నివారించేందుకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నాం. 'ప్రోడక్ట్ పర్ఫెక్షన్' పైనా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పంటలు, ఉత్పత్తులకు విలువ పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నాం. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో విపరీతంగా పురుగు మందుల వాడకం వల్ల క్యాన్సర్ బాధితులు పెరిగి, వైద్యం కోసం ఢిల్లీ బాట పడుతున్నారు. ఇలాంటి సమస్యలకుప్రకృతి సేద్యం గేమ్ ఛేంజర్ అవుతుంది. ఉద్యాన పంటల సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయానికి బ్యాంకర్లు మద్దతుగా నిలవాలి' అని కోరారు. గత ప్రభుత్వ విధ్వంస పాలనలో అన్ని విభాగాలు, రంగాలూ దెబ్బతిన్నాయని, వాటిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణలో బ్యాంకులు దర్యాప్తు సంస్థలకు సమాచారమిచ్చి, సహకరించాలని సీఎం కోరారు. సాగు రంగంలో డ్రోన్ టెక్నాలజీకి సహకరించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర పునర్నిర్మాణానికి, హెల్త్, వెల్త్, హ్యాపీ ఏపీకి సహకరించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు సహకరించాలని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌బాబు, యూబీఐ సీఈవో మణిమేఖలాయ్, ఆర్బీఐ ఆర్డీ బషీర్, వివిధ బ్యాంకుల అధికారులు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలు కనిపించకూడదు

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల మాటే వినిపించకూడదని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. చనిపోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, బ్యాంకర్లు ఏం చేయాలనే దానిపై ప్రత్యేకంగా మేధోమథనం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కేంద్రం ఎంఎస్ఎంఈలకు రుణాలను సరళతరం చేసిందని, బ్యాంకులు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని ఆయన కోరారు. ఎంఎస్ఎంఈలకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని, ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో తాము పని చేస్తున్నామని, ఇది సాకారం కావాలంటూ, చిరు వ్యాపారులకు రుణాలు సులభతరం చేయాలని సూచించారు. 'పీఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2కిలోవాట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ పరికరాలు అందిస్తాం. ఈ పథకం ద్వారా ఉచితంగా తమ అవసరాలకు విద్యుత్‌ను పొందటమే కాకుండా, మిగులు విద్యుత్‌తో ప్రజలుఆదాయం పొందే అవకాశముంది. ఇందులో బ్యాంకులు భాగస్వామ్యంకావాలి. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయని, రుణాలిచ్చి, సహకరించాలి' అని కోరారు.

99% రుణాల పంపిణీ: బ్యాంకర్లు

రాష్ట్రంలో 2024-25లో బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం గత డిసెంబరు నాటికి రూ.5.40లక్షల కోట్ల రుణ పంపిణీ లక్ష్యంలో రూ.5.34లక్షల కోట్లు (99%) సాధించినట్లు బ్యాంకర్లు తెలిపారు. వ్యవసాయ రుణాల పంపిణీ లక్ష్యం రూ.2.64లక్షల కోట్లలో రూ.2.37లక్షల కోట్లు, ప్రాధాన్య రంగాలకు రూ.3.37లక్షల కోట్లలోరూ.3.26లక్షల కోట్లు, ఎంఎస్ఎంఈ రంగం లో రూ.87వేల కోట్లలో రూ.79వేల కోట్లు, ప్రాధాన్యేతర రంగంలో రూ.1.65లక్షల కోట్లలో రూ.2.08లక్షల కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. 2024 ఖరీఫ్‌లోపంట రుణాలు రూ.97,940కోట్లు, అనుబంధ రంగాల కింద రూ.55,860కోట్లు కలిపి, మొత్తం రుణ లక్ష్యం రూ.1,53,800కోట్లు కాగా, రూ.1,69,797కోట్లు (110%) బ్యాంకులుపంపిణీ చేశాయి. 2024-25రబీలో పంట రుణాలు రూ.68,060 కోట్లు, అనుబంధ రంగాలకు రూ.42,140 కోట్లు కలిపి, మొత్తం రూ.1,10,200 కోట్ల రుణ లక్ష్యంలో గత డిసెంబరు నాటికి రూ.67,472 కోట్లు(61%) రైతులకు పంపిణీ చేశాయి. 2024-25లో 10లక్షల పంట సాగుదారు హక్కు పత్రాలు కౌలు రైతులకు పంపిణీ చేయగా, ఈ ఏడాది రూ.4వేల కోట్ల రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్యంలో రూ.3,826.41 కోట్లు(96%) బ్యాంకులుపంపిణీ చేశాయి. కాగా, 2024-25 బడ్జెట్‌లో వడ్డీలేని, పావలా వడ్డీ రుణాలు రూ.628కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

డేటా అనుసంధానం వేగవంతం చేయాలి

» శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల వినియోగం

» వాట్సాప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి

» ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్)పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని శాఖల మధ్య ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసే పనుల్లో వేగం పెరగాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ప్రస్తుతం అందిస్తున్న సేవలతోపాటు అదనంగా ఏం అందించగలమో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంలో సాంకేతిక అవరోధాలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 14,770 సీసీ కెమెరాలు వినియోగంలో ఉన్నాయని, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరస్తులను పట్టుకోవడంలో ఏఐ సాంకేతికను ఉపయోగించుకోవాలని నిర్దేశించారు. నేరం జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారికి అలర్ట్ మెసేజ్ వెళ్లి, నేరస్తులు పారిపోకుండా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు సహాయపడేలా రూపకల్పన చేయాలన్నారు. రౌడీషీటర్లపై ముందుగానే నిఘా పెట్టి, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీజీఎస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ఏయే దశల్లో ఉన్నాయో ఆ విభాగం సీఈవో దినేశ్‌కుమార్ వివరించారు. ఏఐ వినియోగంలో గూగుల్ సంస్థ సహకారం అందిస్తోందని చెప్పారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, అధికారులు పాల్గొన్నారు.

జగన్ ఇంటి వద్ద సీసీ కెమెరాలు పని చేయట్లేదు!

» తాడేపల్లి ఎస్‌హెచ్‌వోకు వైసీపీ లేఖ

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని మాజీ సీఎం జగన్ నివాసం వద్ద సీసీ కెమెరాలు పని చేయట్లేదని వైసీపీ రాష్ట్ర కార్యాలయం తాడేపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు లేఖ రాసింది. ఈ నేపథ్యంలో నిజంగానే సీసీ కెమెరాలు పని చేయడం లేదా.. లేక ఆయన ఇంటి వద్ద ఎండిన గ్రీనరీ తగలబడిన ఘటన కేసులో సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వకుండా చేసేందుకు కావాలనే ఇలా చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంటల ఘటన దర్యాప్తునకు సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వమని పోలీసులు వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని కోరారు. అయితే ఆ పార్టీ ఫుటేజ్ అందించకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనం ఇచ్చింది. దీంతో వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి పేరుతో తాజాగా తాడేపల్లి ఎస్‌హెచ్‌వోకు లేఖ రాసింది. జగన్ ఇంటి వద్ద ఈ నెల 5న జరిగిన ఘటనకు సంబంధించి తాము 6న ఫిర్యాదు చేశామని, 7న నోటీసులు పంపారని లేఖలో పేర్కొన్నారు. ఇంతకు ముందు అనేకసార్లు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఊరేగింపుగా వచ్చి పార్టీ కార్యాలయం ముందు నానా బీభత్సం సృష్టించారని పేర్కొన్నారు. అయితే 'ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం వాటికి కనెక్షన్ తొలగించింది. పునరుద్ధరించమని పలుమార్లు కోరినా స్పందించలేదు. కెమెరాలు పని చేయకపోవడం వల్ల వాటిల్లో ఏమీ రికార్డు కాలేదు' అని తెలిపింది.

రేసు గుర్రాల్లో జోష్ ఏదీ!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారన్న మాట! మోదీ రెండోసారి ప్రధానమంత్రి అయ్యాక ఇలాంటి హెచ్చరికలు చాలా మంది బ్యూరోక్రాట్లకు జారీ అయ్యాయి. పద్ధతి మార్చుకోని వారిని కంపల్సరీ రిటైర్‌మెంట్ కింద ఇంటికి పంపించిన ఉదంతాలూ ఉన్నాయి! ఉన్నత స్థాయి అధికారులపై ఢిల్లీలో ఉండే నియంత్రణ, నిఘా ఇది! ఆయా అధికారులు బయట చేస్తున్న వ్యవహారాలపైనే ఇంతలా కన్నేసి ఉంచారంటే... ఆఫీసు వ్యవహారాల సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేముంది! మరి... ఏపీలో ఏం జరుగుతోందో తెలుసా? ఏ బ్యూరోక్రాట్ ఏం పని చేస్తున్నారు? ఆఫీసుకు ఏ సమయంలో వస్తున్నారు? ప్రభుత్వ పనిచేస్తున్నారా? ప్రైవేటు పనుల్లో ఎక్కువ నిమగ్నమయ్యారా? ఎన్ని ఫైల్స్‌ను క్లియర్ చేశారు? ఏ ఫైలును ఎందుకు ఆపారు? ఆన్‌లైన్ పార్కింగ్‌లో ఎన్ని ఫైళ్లు దాచిపెట్టారు? దీనిపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందా?... అంటే లేదనే చెప్పాలి. దీంతో పలువురు ఉన్నతస్థాయి అధికారులు ప్రభుత్వ పనికన్నా సొంతపనులపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. కొందరు జగన్ అనుకూల అధికారులు మరో అడుగు ముందుకేసి కులం, మతం సంఘాల సమావేశాలను ఏర్పాటు చేయడంలో బిజీగా ఉంటున్నారు. మరి కొందరు ప్రాంతాల వారీగా భేటీలు జరుపుతున్నారు. తమను ప్రభుత్వం గమనిస్తోందన్న భయం లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శాఖలకు సారథుల్లాంటి అధికారులే ఇలా ఉంటే... ప్రభుత్వం తమ లక్ష్యాలను చేరుకునేదెలా అనే ప్రశ్న తలెత్తుతోంది.

వారే కీలకం...

సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో కీలకపాత్ర ఉన్నతాధికారులదే! ప్రభుత్వం రథమైతే... రేసుగుర్రాలు వీరే! కానీ.. ఇప్పుడు వీరిలోనే జోష్ కనిపించడంలేదు. కేబినెట్ నిర్ణయంపై ఫైలు కదిలించి ఉత్తర్వులు జారీ చేయడంలో అధికారుల పాత్రే కీలకం! ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. నిజానికి... ఈ విషయంలో మంత్రుల పాత్ర చాలా పరిమితం. ఫైలు మొదలు పెట్టడం నుంచి చివరికి తీసుకు రావడంలో అధికారులదే కీలక పాత్ర. తమ విధానాల మేరకు ఉందో లేదో పరిశీలించి ఫైల్‌పై సంతకం చేయడానికే మంత్రి పరిమితం! కానీ... మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు! అధికారులను మినహాయించారు!

గజిబిజి నిర్ణయాలు..

ప్రభుత్వ విధానం, ఆలోచన ఒకటి! అధికారులు చేసేది మరొకటి! దీంతో... గజిబిజి జీవోలు వెలువడుతున్నాయి. తర్వాత తప్పు తెలుసుకుని వాటిని దిద్దుకోవాల్సి వస్తోంది. ఇటీవల ఇలాంటి అనేక ఘటనలు జరిగాయి. ఉదాహరణకు... ప్రభుత్వం కార్పొరేషన్‌ల ఛైర్మన్, సభ్యుల వేతనాల విషయంలో కేటగిరీలు విభజించి వివక్ష చూపించారు. ఈ వివక్షపై విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇక... ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటే... అందుకు అధికారులు ఏర్పాట్లు చేయాల్సిందే. అందుకు సంబంధించిన ఫైళ్లను పెండింగ్ పెట్టకూడదు. కానీ... ఈ విషయంలో కొందరు అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రభుత్వం ముందు 'ఎస్' చెప్పేసి... ఆఫీసుకు వచ్చాక కొర్రీలువేసి ఫైలును పెండింగ్ కొండలో చేర్చుతున్నారు. కొందరు అధికారుల 'ఇష్టాఇష్టాలు' మరీ శ్రుతిమించిపోతున్నాయి. వ్యక్తిగతంగా కాసులు కురిపించే ఫైళ్లను భారీగా పెండింగ్ పెట్టి... తర్వాత బేరాలు కుదుర్చుకుంటున్నారు. కొందరైతే ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలియకుండా, ఆన్‌లైన్ ఈ-ఆఫీస్ పార్కింగ్‌లో పెడుతున్నారు. వాటిని సెటిల్ చేయడం కోసం, తమకు అనుకూలమైన టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు ఫైళ్లపై పర్యవేక్షణ లోపించి ఏ ఫైల్‌ను, ఎందుకు పెండింగ్‌లో పెట్టారో కూడా ప్రభుత్వానికి తెలియని పరిస్థితి ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

అదే అరాచకం...

ఐదేళ్ల జగన్ జమానాలో నెలకొన్న అరాచకం ఇప్పటికీ కొనసాగుతోంది. కొందరు అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండటం లేదు. హైదరాబాద్‌లో మకాం ఉంటూ అమరావతిలో అద్దె పొందుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నమే హైదరాబాద్‌కు వెళ్లి... సోమవారం నింపాదిగా అమరావతికి వచ్చేవాళ్లు అత్యధికులు! రెగ్యులర్ పోస్టుతోపాటు ఆయా శాఖల అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) చూస్తున్న పెద్దసార్లు కొందరు ప్రభుత్వ కార్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. అధికారులకూ హాజరు తప్పనిసరి. కానీ... ఎవరూ పట్టించుకోరు. కొందరు అధికారులు ఎప్పుడు ఆఫీసుకు వస్తారో, ఏ సమయంలో ఎక్కడ ఉంటారో కూడా తెలియడంలేదు. విజిటింగ్ అవర్స్‌లో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదు. ముఖ్యమంత్రి సమీక్షలు ఉన్నప్పుడు మాత్రం సచివాలయానికి వచ్చి హడావుడి చేసే అధికారులూ ఉన్నారు.

పని చేయించుకోవాలి కదా...

కార్యదర్శుల స్థాయిలో అధికారుల కొరత ఉన్నమాట నిజమే! అయితే... గతంలో జగన్‌కు అనుకూలంగా పనిచేశారని కొందరు అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం పక్కన పెట్టింది. వారు ఏ పనీ చేయకుండా వేతనాలు, అలవెన్సులూ, ఇతర సదుపాయాలన్నీ పొందుతున్నారు. ఖాళీగా ఉండే కొందరు హైదరాబాద్ కేంద్రంగా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. దీనివల్ల ఇతర అధికారులపై పని భారం పెరుగుతోంది. అలా కాకుండా... ఖాళీగా ఉన్న అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించి వారి పనితీరుపై పర్యవేక్షణ కొనసాగించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గతంలో జగన్‌తో బాగా అంటకాగిన ఓ అధికారి ఇప్పుడు ఖాళీగా ఉంటూ.. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కులాలను రెచ్చగొట్టే పనిలో బిజీగా ఉన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంది.

జైలులో దస్తగిరిని చైతన్యరెడ్డి కలిశారు

» విచారణ అధికారికి తెలిపిన బీటెక్ రవి

» జైల్లో నా బ్యారక్ ఎదురుగా దస్తగిరి ఉండేవాడు

» ఆ బ్యారక్‌కు చైతన్యరెడ్డి వెళ్లడం చూశాను

» లిఖితపూర్వకంగా వివరాలు ఇచ్చిన బీటెక్ రవి

కడప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన డ్రైవర్ దస్తగిరిని కడప సెంట్రల్ జైలులో డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి కలిసింది వాస్తవమేనని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి విచారణ అధికారి రాహుల్ శ్రీరాంకు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. తనను బెదించారంటూ ఇటీవల నలుగురిపై దస్తగిరి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో రాహుల్ శ్రీరాం కడప సెంట్రల్ జైలులో విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే తొలుత బాధితుడు దస్తగిరిని, తరువాత నిందితులు డాక్టర్ చైతన్యరెడ్డి, జైలు సూపరింటెండెంట్‌గా పని చేసిన ప్రకాశ్‌ను, సిబ్బందిని విచారించారు. దస్తగిరి కడప సెంట్రల్ జైల్లో ఉన్నపుడు ఆ సమయంలో రిమాండులో ఉన్న వారిని విచారణ చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు వద్ద పోలీసులపై దౌర్జన్యం చేశారన్న కేసులో బీటెక్ రవిని 2023 నవంబరు 14న పోలీసులు అరెస్టు చేశారు. 14 రోజులపాటు రిమాండులో ఉంచారు. అదే సమయంలో దస్తగిరి ఎస్ఎస్ఆర్ బ్యారక్‌లో ఉండగా.. ఆ ఎదురుగా ఉన్న బ్యారక్‌లోనే బీటెక్ రవి కూడా ఉండేవారు. ఈ నేపథ్యంలో బీటెక్ రవిని రాహుల్ శ్రీరాం సోమవారం విచారించారు. " ఏ కేసులో అరెస్టు చేశారు? ఏ బ్యారక్‌లో ఉన్నారు? చైతన్యరెడ్డి ఎస్ఎస్ఆర్ బ్యారక్‌లోకి ప్రవేశించడం చూశారా?" అంటూ వాట్సాప్ ద్వారా రవిని కోరగా.. ఆయన లిఖితపూర్వకంగా జవాబిచ్చారు.

ముగ్గురు డాక్టర్లతో కలసి వచ్చారు

ఎస్ఎస్ఆర్ బ్యారక్‌లోకి డాక్టర్ చైతన్యరెడ్డి ముగ్గురు డాక్టర్లతో కలిసి వెళ్లడం చూసినట్లు రవి చెప్పారు. వివేకా హత్య కేసులో నిందితుడైన దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు చైతన్యరెడ్డిని.. అదే కేసులో అప్రూవరైన దస్తగిరి బ్యారక్‌లోకి పంపడం సరైంది కాదంటూ అప్పుడు కొందరు అధికారులతో తనతో చెప్పినట్లు తెలిపారు. దస్తగిరి ఉన్న బ్యారక్ నిషేధిత ప్రాంతమని, ఈ మేరకు అక్కడ బోర్డు పెట్టడంతో పాటు అతనిపై నిఘా ఉంచారని తెలిపారు.

గాలిమేడలు!



తమకు నివేశన స్థలాలు చూపలేదంటూ విజయవాడలో కార్పొరేటర్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

(మొదటి పేజీ తరువాయి)

లక్షల మందికి ఇళ్ల స్థలాలు లేకుండా పోయాయి. గత టీడీపీ ప్రభుత్వం కంటే సంఖ్యాపరంగా ఎక్కువ మంది పేదలకు సొంతింటి స్థలాలు ఇవ్వాలని జగన్ ప్రయత్నించారు. ఆ ఆలోచన సరైందే అయినా ఆచరణలో విఫలమయ్యారు. నవరత్నాల కింద ఇచ్చిన ఇళ్ల స్థలాలు కొందరికే దక్కాయి. లక్షలాది మందికి అసలు ఇవ్వలేదు. కొందరికి పట్టాలు, మరికొందరికి స్థలాలు ఇవ్వకున్నా ఇచ్చినట్టుగా గొప్పలు చెప్పుకొన్నారు. దారుణం ఏంటంటే... దాదాపు 25 వేలమందికి పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లుగా రికార్డులైతే రూపొందించారు కానీ స్థలాలు మాత్రం ఇవ్వలేదు. ఒక్క విజయవాడ నగర పరిధిలోనే దాదాపు 2000 మంది బాధితులు ఉంటారని అంచనా. విజయవాడ నగర బాధితులది మరో విషాదగాథ. లేని భూమిలో ఇంటి నిర్మాణం కోసం సగటున ఒక్కో లబ్ధిదారుడు 35 వేల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించారు. డబ్బులు లేవన్నా.. డ్వాక్రా సభ్యులు కావటంతో వారికి రుణాలిప్పించి మరీ డబ్బులను వసూలు చేశారు. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఓట్లు దండుకునేందుకు...

ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలనే దురుద్దేశంతో జగన్ సర్కారు.. లేని భూమికి పట్టాలు ఇచ్చింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం పట్టా పొందిన వారి పేర్లు ఇళ్ల స్థలాల లబ్ధిదారుల జాబితాలో ఉంటాయి. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి జీవితంలో ఒకసారే ఇంటి స్థలం ఇస్తారు. రెండోసారి ఇవ్వరు. ఈ లెక్కన జగన్ సర్కారు దగ్గర పట్టాలు మాత్రమే పొందిన వారు కూడా ఇళ్ల స్థలాల లబ్ధిదారులే. వారికి భూమి పొజిషన్ చూపించకున్నా పట్టా ఉంది కాబట్టి లబ్ధిదారుల జాబితాలో ఉన్నట్లే లెక్క. ఇక వారు మరోసారి ప్రభుత్వ స్థలం పొందే అవకాశం లేదు. కూటమి సర్కారు పేదలకు స్థలాలు ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని ప్రభుత్వం పాలసీ ప్రకటన చేసింది. మార్గదర్శకాలు విడుదలయ్యాయి. జగన్ సర్కారు నుంచి లేని భూమికి పట్టాలు పొందిన వారి పరిస్థితి ఇప్పుడు రెంటికీ చెడ్డరేవడిలా మారింది. పట్టాలు పొందారు కాబట్టి లబ్ధిదారుల జాబితాలో వారుంటారు. కాబట్టి కొత్తగా ఇచ్చే స్థలాల జాబితాకు వారు అనర్హులు. జగన్ ఇచ్చామన్న భూమి ఎక్కడుందో తెలియదు. కొత్తగా స్థలం తీసుకోలేరు. దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

విజయవాడ బాధితుల మొర

విజయవాడలోని 2 వేల మంది బాధితుల్లో తూర్పు నియోజకవర్గంలో 1270 మంది, విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలలో మిగిలినవారు ఉన్నారు. వణుకూరు, ఉప్పులూరు, కొండపావులూరు, కోలవెన్ను గ్రామాలలోని లే అవుట్లలో పట్టాలు ఇచ్చినా వారికి ప్లాట్లు చూపలేదు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని టీడీపీ కార్పొరేటర్లకు మొరపెట్టుకుంటున్నారు. పటమట 13వ డివిజన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఇటీవల 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బాధిత మహిళలు స్థానిక కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. లేని భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వడం జగన్ సర్కారు చేసిన తప్పు. దీన్ని కూటమి సర్కారు సరిదిద్దాలని బాధితులు కోరుతున్నారు. పట్టాలు మంజూరయినా భూమిని పొజిషన్‌లో చూపనివారి పేర్లు గత ప్రభుత్వం రూపొందించిన లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించి, కూటమి ప్రభుత్వం కొత్తగా వారికి స్థలాలిస్తే సమస్య పరిష్కారం అవుతుందని రెవెన్యూ అధికార వర్గాలు చెబుతున్నాయి.

తిరిగి తిరిగి విసిగిపోయాం

గత ప్రభుత్వం మాకు పట్టా ఇచ్చిందే కానీ స్థలం చూపించలేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి విసిగిపోయాం. లబ్ధిదారుల జాబితాలో మా పేరు ఉంది. కానీ స్థలం మేం చూడనేలేదు. ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. **- జంగా సంధ్యారాణి, జయంతిపేట, చీరాల**

స్థలం చూపలేదు



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు రేష్మ. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని హనుమేష్‌నగర్ సమీపంలోని గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్ల క్రితం జగనన్న కాలనీలో ఒక సెంటు స్థలం ఇచ్చారు. ఆమె పేరుతో రిజిస్ట్రేషన్ చేసినట్లుగా పట్టా ఇచ్చారు. కానీ స్థలం ఎక్కడుందో చూపించలేదు. స్థలాన్ని చూపించాలని వార్డు కౌన్సిలర్‌ను ఎన్నిసార్లు అడిగినా కాలయాపన చేశారు. ఆమెకు కేటాయించిన స్థలం ఉందా? ఎవరైనా కబ్జా చేశారా అనేది తెలియదు. రేష్మ భర్త మున్వర్ బాషా ఎలక్ట్రీషియన్. నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దె ఇంట్లో ఉంటున్నారు. స్థలం చూపిస్తే చిన్న గుడిసైనా వేసుకుని, అందులో నివాసం ఉంటామని, అద్దె భారమైనా తగ్గుతుందని రేష్మ అంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఆ స్థలం ఎక్కడుందో చూపించాలని కోరుతున్నారు.

పట్టా ఇచ్చారంతే..



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు మారెక్క. ఆమె స్వగ్రామం అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్. ఈమె దివ్యాంగురాలు. గ్రామ సమీపంలోని తిమ్మాపురం రోడ్డులో సర్వే నంబరు 216బీలో జగనన్న లే అవుట్ వేశారు. అందులో 101 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. మారెక్కకు కూడా అదే లే అవుట్‌లో స్థలం కేటాయించినట్లు చూపించి, నాలుగన్నరేళ్ల క్రితం పట్టా కాగితం ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఆ స్థలాన్ని ఆమె పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలం ఎక్కడుందో చూపించాలని వీఆర్వోను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. ఆర్డీటీ సంస్థ కట్టించి ఇచ్చిన ఒక చిన్న గదిలో మారెక్క, వారి బంధువు ఒకరు ఉంటున్నారు. స్థలం చూపితే చిన్న కొట్టమైనా వేసుకుంటామని మారెక్క అంటున్నారు.

పట్టా మాత్రమే ఇచ్చారు




జగనన్న కాలనీ కింద పట్టా అయితే ఇచ్చారు కానీ హద్దులు మాత్రం చూపలేదు. ఆ స్థలం ఎక్కడ ఉందో కూడా ఇంతవరకు తెలియదు. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం నవరత్నాల కింద ఇంటి స్థలం లబ్ధి పొందినట్లు ఉంది. ఆ స్థలాన్ని మా పేరుతో ఇంకెవరయినా తీసుకున్నారేమో అనే అనుమానం ఉంది. గత ప్రభుత్వం స్థలం ఇచ్చినట్లు చెప్పిందే కానీ దానిని చూపించకుండా మోసం చేసింది. ఈ ప్రభుత్వం అయినా మాకు ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతున్నాం.

- బైలడుగు అంజలి, ముక్తేశ్వరం, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా

పోలవరం పనుల పురోగతిపై
ప్రతి నెలా సమీక్ష!

- **ఆ ఐదేళ్లలో బాధ్యతంతా రాష్ట్రానికి వదిలేశాం**
- **తద్వారా దిద్దుకోలేని తప్పు చేశాం: కేంద్రం**
- **రూ.2,700 కోట్ల అడ్వాన్సుపై త్వరలో నిర్ణయం**
- **జలశక్తి కార్యదర్శి దేబర్శి ముఖర్జీ స్పష్టీకరణ**



అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల బాధ్యతను 2019-24 మధ్య పూర్తిగా రాష్ట్రానికే వదిలేసి దిద్దుకోలేని తప్పు చేశామని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబర్శి ముఖర్జీ అన్నారు. ఇకపై అలాంటి తప్పు చేయబోమని, ఇకపై పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్షిస్తామని స్పష్టం చేశారు. గడచిన ఐదేళ్లలో ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని.. ఫలితంగా ప్రాజెక్టు పురోగతి 'రివర్స్' అయిందని చెప్పారు. సోమవారం ఢిల్లీలో ఆమె అధ్యక్షతన పోలవరంపై ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చైర్మన్/సీఈవో అతుల్ జైన్, సెంట్రల్ సాయిల్-మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) ఉన్నతాధికారులు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ-ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు వెలగపూడి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. పోలవరం పనులు సాగుతున్న తీరుపై దేబర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నిపుణులు సూచించిన విధంగానే టీ-16 కాంక్రీట్ విశ్రమంతో డయాఫ్రం వాల్ పనులు సాగడంపైనా సంతోషం వ్యక్తం చేశారు. గ్యాప్-1, గ్యాప్-2 పనుల కార్యాచరణ, డిజైన్లపైనా నిర్ణయం తీసుకుంటామన్నారు. నెలవారీగా మెటీరియల్ ఎంత అవసరం.. ప్రాజెక్టు వద్ద ఎంత అందుబాటులో ఉందో జలశక్తి శాఖకు సమాచారం అందించాలని ఆదేశించారు. వాల్‌తో పాటు.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణానికి మట్టి, రాళ్లు ఎంతమేర అందుబాటులో ఉన్నాయి.. ఇంకెంత అవసరమో కూడా తెలియజేయాలన్నారు. నెలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుని.. ప్రగతిపై నివేదికలు సమర్పిస్తూ ఉండాలని కోరారు. వాల్ పనుల్లో నాణ్యత తగ్గేందుకు వీల్లేదని తేల్చిచెప్పారు. ప్రాజెక్టు క్షేత్రంలో ఏర్పాటు చేసిన లేబొరేటరీలో మెటీరియల్ నాణ్యతను పరీక్షించి రిపోర్టులు సమర్పించాలన్నారు. ప్రాజెక్టు పనుల వేగవంతానికి రెండో విడత అడ్వాన్సు సొమ్ము రూ.2,700 కోట్ల మంజూరుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని దేబర్శి చెప్పారు. గతంలో ఇచ్చిన నిధులను రాష్ట్ర ఖాతాలో జమచేసి ఖర్చుచేయడంపై కేంద్ర ఆర్థిక శాఖ లేవనెత్తిన అభ్యంతరాల సమస్య సమసిపోయిందని చెప్పారు. ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిందన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో పోలవరం పనుల్లో నెలవారీ లక్ష్యం మేరకు వేగాన్ని పెంచాలని స్పష్టం చేశారు.

కోరమాండల్‌కు ప్రోత్సాహకాలు

- **రూ. 529 కోట్ల రాయితీ పదేళ్లలో చెల్లింపు**
- **యూనిట్‌కు రూపాయి చొప్పున విద్యుత్**

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఎరువుల కర్మాగారాన్ని విస్తరించడానికి ముందుకు వచ్చిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి ప్రోత్సాహకాలను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ (4.0) ప్రకారం టైలర్ మేడ్ ఇన్సెంటివ్స్ ప్రొవిజన్ కింద ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడలో కోరమాండల్ సంస్థ మరో రూ. 1,539 కోట్ల అదనపు పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ పాస్ఫటిక్ ఫెర్టిలైజర్ ప్లాంట్ విస్తరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఇవి కార్యరూపం దాల్చితే కాకినాడలో ఆ కంపెనీ ఎరువుల ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 20 లక్షల టన్నుల నుంచి 37.5 శాతం పెరిగి 27.5 లక్షల టన్నులకు చేరుతుంది. 2027 జనవరి నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కానుంది. దీంతో బిల్డింగ్ కాంపోనెంట్ సహా మూలధన పెట్టుబడిపై టైలర్ మేడ్ ఇన్సెంటివ్‌గా 40% రాయితీ కింద పదేళ్ల వ్యవధిలో రూ. 529 కోట్లు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ. 74 కోట్ల డీకార్బనైజేషన్ సబ్సిడీని పదేళ్ల వ్యవధిలో చెల్లించనుంది. యూనిట్‌కు రూపాయి చొప్పున విద్యుత్ రాయితీని ప్రకటించింది. ఈ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. సింగిల్ డెస్క్ పోర్టల్ 2.0 కింద అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వాలని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. విద్యుత్తు, జలవనరులు, పరిశ్రమలు, వాణిజ్యం, నైపుణ్యాభివృద్ధి, రెవెన్యూ, ఆర్థికశాఖ, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

విక్రాంత్‌రెడ్డిదే కీలక పాత్ర!

- **కాకినాడ పోర్ట్, సెజ్‌లలో కేవీరావు వాటాలు అరబిందోకు బదలాయింపులో ప్రణాళిక ఆయనదే**
- **ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం**
- **పిటిషన్‌ను కొట్టివేయండి.. హైకోర్టులో సీఐడీ కౌంటర్**

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ లోని వాటాలను.. కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీఆర్ గ్రూపునకు చెందిన కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీరావు)ను బెదిరించి, భయపెట్టి బలవంతంగా అరబిందోకు బదలాయించడంలో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని సీఐడీ హైకోర్టుకు నివేదించింది. కేవీరావు ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విక్రాంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో ఈ మేరకు తాజాగా కౌంటర్ వేసింది. 'కేవీరావు ఆరోపించినట్లు అప్పటి సీఎం జగన్ ప్రోద్బలంతోనే విక్రాంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వాటాల బదిలీకి ప్రణాళిక రచించినట్లు కనపడుతోంది. షేర్ల బదిలీ విషయంలో తాను చెప్పినట్లు నడుచుకోకుంటే క్రిమినల్ కేసులు పెట్టి, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తామని, హానితలపెడతామని కేవీరావును ఆయన బెదిరించారు. అప్పటి ముఖ్యమంత్రి తరఫున షేర్లను సేకరిస్తున్నట్లు చెప్పారు. వాటాలను అరబిందోకు బదలాయించడం ద్వారా కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌కు రూ.3,666 కోట్లు, కాకినాడ సెజ్‌కు రూ.1109 కోట్లు మొత్తం రూ.4,775 కోట్ల నష్టం జరిగింది. కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.965.65 కోట్ల నష్టం వాటిల్లిందని పీకేఎఫ్ శ్రీధర్ ఆడిట్ సంస్థ తప్పుడు నివేదిక ఇచ్చింది. అరబిందోకు వాటాల బదిలీ అనంతరం రూ.9.03 కోట్లే నష్టం వాటిల్లినట్లు సవరించిన రిపోర్టు ఇచ్చింది. ఎవరు చెబితే తప్పుడు నివేదిక ఇచ్చింది.. ఈ మొత్తం వ్యవహారంలో అంతిమంగా ఎవరు లబ్ధి పొందారో తేల్చేందుకు విక్రాంత్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉంది. కేవీరావు వాటాలను బదలాయించుకునేందుకు నిందితులందరూ కలిసి భారీ కుట్ర పన్నారు. పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుంది. ఆయన వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు. సాక్షులను బెదిరించి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని విక్రాంత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని సీఐడీ అభ్యర్థించింది.

పేర్ని జయసుధ బెయిల్ రద్దు చేయండి

- **హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు**

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్నినాని సతీమణి పేర్ని జయసుధకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. పేర్ని జయసుధకు నోటీసులు అందజేయాల్సి ఉందని, విచారణను వాయిదా వేయాలని పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి విచారణను రెండువారాలకు వాయిదా వేశారు.

ముందస్తు బెయిలివ్వండి.. విడదల రజని పిటిషన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పిల్లి కోటి ఫిర్యాదు ఆధారంగా చిలకలూరిపేట పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని, ఆమె పీఏలు నాగశెట్టి జయ ఫణీంద్ర, రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బహిరంగంగా దూషించిన సందర్భంలో మాత్రమే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తిస్తుందని, ఈ కేసులో తనను వాట్సాప్ కాల్‌లో కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదుదారు చెబుతున్న నేపథ్యంలో ఆ చట్టం వర్తించదని పేర్కొన్నారు.

తూర్పున బర్డ్‌ఫ్లూ పంజా..!

- **కానూరు అగ్రహారంలో 62 వేల కోళ్లు మృతి**
- **బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ.. కిలోమీటరు మేర రెడ్ జోన్**
- **10 కిలోమీటర్ల పరిధిలో సర్వేలైన్స్ జోన్**
- **కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**



తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో చనిపోయిన కోళ్లు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. నిడదవోలు నియోజకవర్గ పరిధి పెరవలి మండలం కానూరు అగ్రహారం కోళ్లఫారంలో... బర్డ్‌ఫ్లూ సోకడంతో సుమారు 62 వేల కోళ్లు మృతిచెందాయి. చనిపోయిన మూడు కోళ్ల శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబొరేటరీకి పంపించగా రెండింటికి బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ నిర్ధారణ అయింది. కానూరు అగ్రహారంలోని రామకృష్ణ పౌల్ట్రీలో ఈ నెల 1 నుంచి కోళ్లు ఎక్కువగా చనిపోతున్నాయి. సమాచారం అందుకున్న కాకినాడకు చెందిన లేబొరేటరీ సిబ్బంది 83 శాంపిల్స్ (చనిపోయిన 3 కోళ్ల శాంపిల్స్‌తోపాటు 40 కోళ్ల ముక్కు శాంపిల్స్, మరో 40 కోళ్ల రెట్ట శాంపిల్స్)ను సేకరించి భోపాల్ ల్యాబ్‌కు పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండింటికి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయింది. మిగతా శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. కాగా, సీతానగరం మండలం మిర్తిపాడు, నల్లజర్ల, చాగల్లు మండలాల్లో ఉన్న ఫారాల్లో కూడా కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు. ఇంతకుముందు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని బాదంపూడి, తణుకు సమీపంలోని వేల్పూరులో కూడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడంతో శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపించారు. బర్డ్‌ఫ్లూ కలకలంతో చికెన్, గుడ్లు తినడానికి ప్రజలు భయపడుతున్నారు. దీంతో కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తూర్పుగోదావరి జిల్లాలో 250 కోళ్ల ఫారాల్లో 2.60 కోట్ల కోళ్లు ఉన్నాయి. బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో కానూను అగ్రహారం గ్రామానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొద్దిరోజుల పాటు చికెన్, గుడ్లు తినడం మానేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్ జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధిలో సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించామన్నారు. 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చినట్టు తెలిపారు. ఎక్కడ పక్షులు చనిపోతున్నా వెంటనే అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. ఇప్పటికే కానూరు అగ్రహారంలో కిలోమీటరు పరిధిలోని కోళ్లను, గుడ్లను కాల్చి వేయాలని ఆదేశించారు. పౌల్ట్రీలలో పనిచేస్తున్న వారికి పరీక్షలు చేయాలన్నారు. రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని, అక్కడ 9542908025 నంబర్‌లో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారని చెప్పారు.

ఇది మనుషులకూ వ్యాపించవచ్చు..

'బర్డ్‌ఫ్లూ అంటువ్యాధి.. ఇది మనుషులకూ వ్యాపించవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి' అని పశుసంవర్ధక శాఖ జేడీ టి శ్రీనివాసరావు చెప్పారు. కానూరు అగ్రహారంలోని కోళ్ల ఫారంలో పనిచేసిన వారికి పరీక్షలు చేయగా వ్యాధి లక్షణాలు కనిపించలేదన్నారు. ఈ గ్రామంలో కిలోమీటరు మేర పెంపుడు పక్షులన్నింటినీ చంపేసి గొయ్యితీసి పాతిపెట్టాలని ఆయన సూచించారు.

ఆందోళన వద్దు: మంత్రి దుర్గేష్

కానూరు అగ్రహారంలో కోళ్లకు వైరస్ సోకడం వల్ల అధికారులు నివారణ చర్యలు చేపట్టారని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొద్దిరోజుల పాటు చికెన్, గుడ్లు తినొద్దని చెప్పారు. పౌల్ట్రీ రైతులు బయో సెక్యూరిటీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

బర్డ్‌ఫ్లూ వల్లే కోళ్ల మరణాలు

- **చనిపోయిన కోళ్లలో హెచ్5ఎన్1 వైరస్**

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ వైరస్ కారణమని నిర్ధారణయింది. పక్షం రోజులుగా ఉభయగోదావరి జిల్లాలను వణికిస్తున్న వైరస్ ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (హెచ్5ఎన్1) అని భోపాల్‌లోని యానిమల్ డిసీజెస్ ల్యాబ్ తేల్చింది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు, కొల్లేరు సమీప ప్రాంతాల్లో గత వారం 25 లక్షల పైగా కోళ్లు చనిపోయాయి. తాజాగా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో 50వేల కోళ్లు మృతి చెందాయి. కాకినాడ, ఏలూరు పశుసంవర్ధకశాఖ అధికారులు చనిపోయిన కోళ్ల నుంచి రక్తనమూనాలు తీసి భోపాల్‌లోని ఎన్ఐహెచ్ఎస్ఏడీ ల్యాబ్‌కు పంపారు. తణుకు మండలం వేల్పూరు, పెరవలి మండలం కానూరు గ్రామాల్లో చనిపోయిన కోళ్లకు హెచ్5ఎన్1 పాజిటివ్‌గా పరీక్షల్లో నిర్ధారణ అయింది. పశుసంవర్ధకశాఖ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు సోమవారం ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు, ప్రకాశం జిల్లాల కోళ్ల పెంపకందారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాగా, కొల్లేరు సరస్సుకు వలస పక్షులు ఎక్కువగా రావడం వల్ల వాటి ద్వారా కోళ్లకు వైరస్ వ్యాపించి ఉంటుందని పశువైద్యులు భావిస్తున్నారు. పౌల్ట్రీల్లో యజమానులు జీవభద్రతా చర్యలు పాటించకపోవడం, చనిపోయిన కోళ్లను శాస్త్రీయంగా ఖననం చేయకపోవడం కూడా వ్యాధి విస్తరణకు కారణంగా చెబుతున్నారు. వైరస్ సోకని కోడి మాంసాన్ని, గుడ్లను బాగా ఉడికించి తినాలని పశువైద్యులు సూచించారు.

ఆలయాల ఎఫ్‌డీల జోలికెళ్తే
కఠిన చర్యలు

ఇష్టారాజ్యంగా అధికారులు బ్రేక్ చేయడానికి వీల్లేదు

- **పగడ్బందీగా నిబంధనలు తీసుకొచ్చిన ప్రభుత్వం**

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేవాలయాల ఆస్తుల సంరక్షణలో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయాల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈవోలు, ఇతర ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వాడుకోవడానికి వీల్లేకుండా కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. కమిషనర్ అనుమతులు లేకుండా ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేస్తే ఈవోతో పాటు సంబంధిత ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకునేలా నిబంధనలు మార్చింది. దేవదాయ శాఖలోని చాలా మంది ఈవోలు వారు విధులు నిర్వహించే ఆలయాలకు సంబంధించిన ఎఫ్‌డీలను ఇష్టమొచ్చినట్లు బ్రేక్ చేస్తున్నారు. దేవుడి సొమ్మును సొంత వ్యవహారాలకు వాడుకుంటున్నారు. కొంత మంది ఈవోలు ఎఫ్‌డీలను చూపించి వ్యక్తిగత రుణాలు కూడా పొందుతున్నారు. మరికొందరు బరితెగించి ఈ ఎఫ్‌డీ సొమ్ములను బెట్టింగ్‌లకు కూడా వాడేస్తున్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేసేందుకు దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇకపై ఎఫ్‌డీలను బ్రేక్ చేసి ఎన్‌క్యాష్ చేసేందుకు వీలు లేకుండా పలు నిబంధనలతో దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ సోమవారం ప్రత్యేక సర్క్యులర్ జారీ చేశారు.

ఎఫ్‌డీలపై రుణాలకు వీల్లేదు

ఎఫ్‌డీలను ఎలా సంరక్షించాలి, ఎలా ఎన్‌క్యాష్ చేయాలన్న దానిపై కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈవోలే కాదు అసిస్టెంట్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు కూడా ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేయడానికి వీలులేకుండా పకడ్బందీగా నిబంధనలు తీసుకొచ్చారు. 6ఏ, 6బీ, 6సీ ఆలయాల ఈవోలతో పాటు ఆర్జేసీ, డీసీ, ఏసీలు వారి వారి పరిధిలో ఉన్న దేవాలయాల ఎఫ్‌డీలకు సంబంధించిన రిపోర్టును ఏటా మార్చి 31నాటికి కమిషనర్ కార్యాలయానికి అందించాలి. భూముల అమ్మకం, ఆలయం సేవింగ్స్, అన్నదానం ఎఫ్‌డీలు ఇలా ప్రతి ఒక్కటి ఉన్నతాధికారులు తనిఖీలు చేసి, ఎఫ్‌డీలు ఏమైనా ఎన్‌క్యాష్ అయితే వెంటనే కమిషనర్‌కు రిపోర్టు ఇవ్వాలి. రెన్యువల్ చేయాల్సి వచ్చినపుడే ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేసి.. వెంటనే మరో ఎఫ్‌డీ వేసే విధంగా ఆలయాల ఈవోలు, జిల్లా ఎండోమెంట్ అధికారులు ఆయా బ్యాంక్‌లకు లేఖలు రాయాలి. జాయింట్ అకౌంట్‌పైనే ఎఫ్‌డీలు వేయాలి. 6సీ ఆలయాలకు సంబంధించిన ఎఫ్‌డీలు ఆలయం ఈవో పాటు జిల్లా ఎండోమెంట్ అధికారి పేరు మీద, అలానే 6బీ, 6ఏ ఆలయాల ఎఫ్‌డీలు ఈవోతో పాటు డిప్యూటీ కమిషనర్, జాయింట్ కమిషనర్‌తో జాయింట్‌గా చేయాల్సి ఉంటుంది. ఎఫ్‌డీలపై ఈవోలు ఎలాంటి రుణాలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఎఫ్‌డీలు బ్రేక్ చేసి ఎన్‌క్యాష్ చేయాల్సిన అవసరం ఏదైనా వస్తే కచ్చితంగా దేవదాయ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. ఈ చర్యలతో ఆలయాల ఎఫ్‌డీలకు రక్షణ కల్పించవచ్చునని భావిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

దేవదాయ కమిషనర్ సర్క్యులర్‌లో ఇటీవల కర్నూలు, రాజమండ్రి, చీరాలలో కొంత మంది ఈవోలు ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేశారని స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్‌క్యాష్ చేశాక చాలా రోజుల వరకూ బయట పడటం లేదు. ఆడిట్ జరిగినప్పుడో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్ప ఈ విషయాలు వెలుగులోకి రావడం లేదు. దీంతో కొంతమంది ఈవోలు దేవుడి నిధులను ఇష్టారాజ్యంగా వాడుకుని జల్సాలు చేస్తున్నారు. కర్నూలుకు చెందిన ఒక ఈవో ఇటీవల ఎఫ్‌డీలను ఎన్‌క్యాష్ చేసి క్రికెట్ బెట్టింగ్‌లు ఆడారు. ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉండవల్లి గ్రూప్ టెంపుల్స్, మదడం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఎఫ్‌డీలకు సంబంధించి కోటి ఎన్‌క్యాష్ చేశారు. ఆ డబ్బులు సొంతానికి వాడుకున్నారు. ఎఫ్‌డీలను దుర్వినియోగం చేస్తున్న ఈవోలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గత ఆరు నెలల్లో పది ఆలయాలకు సంబంధించిన ఎఫ్‌డీలు ఎన్‌క్యాష్ చేసినట్లు కమిషనర్ దృష్టికి వచ్చినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. దీంతో ఈవోలకు భయం లేకుండాపోతోంది. కఠిన నిబంధనలు పెట్టడంతో పాటు తప్పు చేసిన వారికి వెంటనే శిక్ష విధిస్తే మరోసారి తప్పులు చేయడానికి ఈవోలు భయపడతారని దేవదాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.